శుక్రవారం 19-8-2022

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 149

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



ఆభరణమోహనం

కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ప్రత్యేక కథనం - 11లో



భారత్ ఘన విజయం


హరారేలో జరిగిన తొలి వన్డేలో 10 వికెట్లతో జింబాబ్వే చిత్తు - 13లో



న్యాయంపై నమ్మకం పోయింది

తనపై అత్యాచారానికి పాల్పడిన 11 మందికి గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడంపై బిల్కిస్ బానో ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాలు 6లో



షానవాజ్‌పై ఎఫ్ఐఆర్

బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్‌పై అత్యాచార ఆరోపణలకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో



8 యూట్యూబ్ చానళ్లపై నిషేధం

జాతీయ భద్రతకు ముప్పు కలిగేలా తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్న 8 యూట్యూబ్ చానళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది.

వివరాలు 6లో



రష్దీ జీవించి ఉండడం ఆశ్చర్యమే!

సల్మాన్ రష్దీపై తన దాడి వెనుక ఎవరూ లేరని నిందితుడు హాదీ తెలిపాడు. రష్దీ ప్రాణాలతో ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నాడు.

వివరాలు 6లో

చంద్రబాబు దర్శకత్వంలో.. టీడీపీ సమర్పిస్తున్న..

ది డర్టీ పిక్చర్..!

అధికారానికి, జనాదరణకు దూరమై తీవ్ర నిరాశా నిస్పృహలు

- చివరకు ఫొటోల మార్ఫింగ్‌తో పాటు బూతు వీడియోలు సృష్టించే స్థాయికి దిగజారుడు
- ఎంపీ మాధవ్ పేరిట వైరల్ అయిన వీడియోపై ఎక్లిప్స్ ఫోరెన్సిక్ స్పష్టత
- వీడియో ఒరిజినల్ అని తాము సర్టిఫికెట్ ఇవ్వలేదని స్పష్టీకరణ
- తమ సర్టిఫికెట్‌ను ట్యాంపర్ చేసి వైరల్ చేశారన్న ల్యాబ్ అధిపతి జిమ్ స్టాఫర్డ్
- అందుకు బాధ్యులైన ప్రసాద్ పోతిని, ఇతరులపై చర్యలు
- సీఐడీ అదనపు డీజీ పీవీ సునీల్ కుమార్ వెల్లడి
- ఎక్లిప్స్ ల్యాబ్స్ పంపిన మెయిల్ కాపీ మీడియాకు విడుదల
- ఇదే తరహాలో మంత్రి రజని ఫొటోను మార్ఫింగ్ చేసిన టీడీపీ
- ఆమె బాలకృష్ణను కలిశారని, పార్టీ మారతారని సోషల్ మీడియాలో దుష్ప్రచారం



Email ADG, CID

Re: Regarding a fake certificate in circulation on your name

టీడీపీ ప్రచారం చేసిన ఫోరెన్సిక్ సర్టిఫికెట్ తామివ్వలేదని ఎక్లిప్స్ ల్యాబ్ పంపిన మెయిల్





వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డిని మంత్రి రజని మర్యాదపూర్వకంగా కలిసిన ఫొటోను.. టీడీపీ నేత బాలకృష్ణ తలతో మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ

సాక్షి, అమరావతి: అధికారంతో పాటు జనాదరణకు కూడా దూరమవుతుండటంతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడిలో నిరాశా నిస్పృహలు పతాక స్థాయికి చేరుతున్నాయి. చివరకు మంత్రులపై పార్టీ మారుతున్నారనే దుష్ప్రచారం చేయటానికి ఫొటోలు మార్ఫింగ్ చేయటానికి దిగటంతో పాటు.. ఎంపీల ప్రతిష్టను దిగజార్చడానికి బూతు వీడియోల స్థాయికి దిగజారిపోయారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఇటీవల పార్టీ ప్రధాన కార్యదర్శి విజయ సాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఫొటోను తీసుకుని... టీడీపీ సోషల్ మీడియా శ్రేణులు సాయిరెడ్డి తలకు బాలకృష్ణ తలను అతికించి దుష్ప్రచారానికి దిగారు. మంత్రి రజని పార్టీ మారుతున్నారంటూ... జగన్‌కు షాక్ ఇస్తున్నారని వీడియోలు సృష్టించి వైరల్ చేశారు. ఇక అనంతపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేరిట ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఓ 'బూతు వీడియో కాల్'కు కర్త, కర్మ, క్రియ అన్నీ తెలుగుదేశం పార్టీయేనని..

మిగతా 2వ పేజీలో ▶

ఫేక్ బాబుపై చర్యలు తీసుకోవాల్సిందే

మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్

- మాధవ్ వీడియోను ట్యాంపర్ చేసి రిపోర్టు సృష్టించింది చంద్రబాబే
- లోకేష్, ఎల్లో మీడియాపై కూడా చర్యలు తీసుకోవాలి

2లో

రాయ్‌గఢ్ తీరానికి కొట్టుకు వచ్చిన ఆయుధాల నౌక



విదేశీ నౌకలో ఏకే–47 రైఫిల్స్

- మహారాష్ట్ర హరిహరేశ్వర్ బీచ్‌లో కలకలం
- తూటాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- ఉగ్రవాద కోణం లేదన్న ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

మహారాష్ట్ర తీరానికి కొట్టుకువచ్చిన ఓ విదేశీ నౌకలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు బయటపడడం తీవ్ర కలకలం సృష్టించింది. ముంబైకి 190 కిలోమీటర్ల దూరంలో రాయ్‌గఢ్ జిల్లా హరిహరేశ్వర్ బీచ్ వద్దకు వచ్చిన నౌకను పోలీసులు తనిఖీ చేయగా.. మూడు ఏకే–47 రైఫిల్స్, తూటాలు, పేలుడు పదార్థాలు, ఆయుధాల విడిభాగాలు ఉన్న పెట్టె బయటపడింది. అయితే ఇందులో ఎలాంటి ఉగ్రవాద కోణం లేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. ఒమన్ నుంచి యూరప్ వెళ్తున్న ఆ నౌక ప్రమాదవశాత్తూ కొట్టుకువచ్చిందని చెప్పారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

నౌకల మరమ్మతు కేంద్రంగా విశాఖ షిప్‌యార్డ్



నౌకల మరమ్మతు కేంద్రంగా విశాఖ షిప్‌యార్డ్‌ను అభివృద్ధి చేస్తామని షిప్ యార్డ్ చైర్మన్ హేమంత్ తెలిపారు. ఇప్పటి వరకు పెద్ద నౌకలను తయారు చేసిన తమ సంస్థ రానున్న రోజుల్లో వేగవంతమైన బోట్లను కూడా తయారు చేయబోతోందని చెప్పారు.

వివరాలు 14లో ▸

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి అరుదైన గౌరవం



డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి అరుదైన గౌరవం లభించింది. అత్యుత్తమ పని తీరుతో దేశంలోని ఆరోగ్య విశ్వవిద్యాలయాల్లో తొలిసారిగా రెండు కేటగిరీల్లో ఐఎస్‌వో గుర్తింపు పొంది రికార్డు సృష్టించింది.

వివరాలు 12లో ▸

జీపీఎస్‌తో రిటైర్మెంట్ భరోసా



ఉద్యోగుల పదవీ విరమణ తర్వాత హాయిగా జీవించే భరోసాను ప్రభుత్వం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ ద్వారా కల్పిస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సీపీఎస్‌తో ఉద్యోగులకు కలిగే మేలు కంటే మెరుగ్గా ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొస్తుందని చెప్పారు.

వివరాలు 12లో ▸

విద్యాభివృద్ధి కార్యక్రమాలు ఏపీలో అద్భుతం



ఏపీలో అమలుచేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయని గోవా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రతినిధులు ప్రశంసించారు. ఏపీలోని సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయమని అభినందించారు.

వివరాలు 3లో ▸

ఓటీటీ.. ఇంకాస్త చౌకగా!

ప్రస్తుతానికి ధరల యుద్ధానికి విశ్రాంతి | **షరతులు వర్తిస్తాయి**

వినోదాన్ని నట్టింటిలోకి తీసుకొచ్చిన ఓటీటీ సంస్థలన్నీ ఇప్పుడిప్పుడే వాస్తవాన్ని అర్థం చేసుకుంటున్నాయి. ధరల యుద్ధానికి విశ్రాంతి ఇవ్వబోతున్నాయి. అలాగే కేవలం సబ్‌స్క్రిప్షన్ ఆదాయంపై ఆధారపడటం కష్టమనే నిర్ణయానికి వచ్చాయి. మధ్యలో ప్రకటనలివ్వడం ద్వారా ఆదాయాన్ని ఆర్జించాలని భావిస్తున్నాయి. ఇందుకోసం సబ్‌స్క్రిప్షన్ ధరలు కూడా తగ్గించాలనుకుంటున్నాయి. వచ్చే ఏడాది నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రకటనలు మొదలు కానున్నాయి. అమెజాన్ మినహా ఇతర ఓటీటీ చానల్స్ కూడా ఇదే దారిలో నడవబోతున్నాయి.

13లో



ఉధృతంగా గోదావరి



రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద ప్రవహిస్తున్న వరద

- పోలవరం, ధవళేశ్వరం వద్ద పెరిగిన వరద
- భద్రాచలం వద్ద స్వల్పంగా తగ్గిన నీటిమట్టం
- మూడో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- కాటన్ బ్యారేజి నుంచి 16 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి


14లో

చంద్రబాబు పాపం..

డిస్కంలకు శాపం

బకాయిలు చెల్లించని 13 రాష్ట్రాలకు విద్యుత్ కొనుగోళ్లపై కేంద్రం నిషేధం

- ఎనర్జీ ఎక్స్ఛేంజ్ నుంచి ఏపీ క్రయవిక్రయాలకు ఆటంకం
- విద్యుత్ పంపిణీ సంస్థలు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ.17,060 కోట్లు
- 12 వాయిదాల్లో చెల్లించేందుకు లేట్ పేమెంట్ సర్‌చార్జ్ పథకంలో చేరిన ఏపీ డిస్కంలు
- ఈ నెల 6న మొదటి వాయిదా కింద రూ.1,422 కోట్లు చెల్లింపు
- చంద్రబాబు తప్పుడు విధానాలతో కుదేలైన విద్యుత్ రంగం.. రూ.2,893.23 కోట్ల నుంచి రూ.21,540.96 కోట్లకు డిస్కంల బకాయిలు
- ట్రూ అప్ చార్జీలు రూ.20 వేల కోట్లు వసూలు చేయకపోవడంతో డిస్కంలు కుదేలు
- టీడీపీ పాలనలో రూ.68,596 కోట్లకు చేరిన మొత్తం విద్యుత్ రంగం అప్పులు
- విద్యుత్ సంస్థలను ఆదుకోవడానికి రూ.40 వేల కోట్లు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- వడ్డీలు చెల్లించడానికే పవర్ ఫైనాన్స్ సంస్థల నుంచి మరో రూ.38,836 కోట్ల రుణం



సాక్షి, అమరావతి: విద్యుత్ రంగానికి చంద్రబాబు చేసిన పాపాలు శాపాల్లా వెంటాడుతున్నాయి. టీడీపీ అధికారంలో ఉండగా తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, విధానాల వల్ల కుదేలైన విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతతో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే బకాయిలను సకాలంలో చెల్లించలేదంటూ 'ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ (ఐఈఎక్స్)' నుంచి క్రయవిక్రయాలు జరపకుండా ఏపీతో సహా 13 రాష్ట్రాలకు చెందిన 29 డిస్కంలపై కేంద్రం నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ శాఖ పరిధిలోని పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్ (పోసోకో) రాష్ట్రాలకు సమాచారం పంపింది. కరెంటు కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి వీలు లేదని, గురువారం అర్ధరాత్రి నుంచే దీన్ని అమల్లోకి

మిగతా 12వ పేజీలో ▶

ఇదం జగత్



సూక్ష్మ సేద్యం విస్తరిస్తోంది

ఈ ఏడాది రూ.1,395 కోట్లతో మరో 3.75 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం

- కానీ, 4.18 లక్షల ఎకరాల్లో పరికరాల కోసం 1.34 లక్షల మంది ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్
- 90% సబ్సిడీ మీద బిందు సేద్య పరికరాల సరఫరా
- తుంపర సేద్య పరికరాలూ జోరుగా పంపిణీ
- ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి దిగుబడులు పెరిగే అవకాశం



వైఎస్సార్ జిల్లా గెడ్డంవారిపల్లిలో డ్రిప్ పరికరాలతో పంటకు నీరు పెడుతున్న దృశ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సూక్ష్మసేద్యం విస్తరిస్తోంది. ప్రభుత్వం చేస్తున్న కృషి కారణంగా బిందు, తుంపర సేద్య పరికరాల కోసం రైతుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. రైతుభరోసా కేంద్రాల్లో రికార్డు స్థాయిలో రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. దీంతో క్షేత్రస్థాయి పరిశీలన, సర్వే, అంచనాల తయారీ, మంజూరు ప్రక్రియతో పాటు పరికరాల అమరిక వేగం పుంజుకుంది. ఫలితంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచే దిగుబడులు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అదనంగా 26 లక్షల టన్నుల దిగుబడులు

దేశవ్యాప్తంగా సూక్ష్మసేద్యంలో మొదటి స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 12 లక్షల మంది రైతులు 34.70 లక్షల ఎకరాల్లో బిందు.. 12.98 లక్షల ఎకరాల్లో తుంపర సేద్యం చేస్తున్నారు. సూక్ష్మ సేద్యానికి

మిగతా 3వ పేజీలో ▶

ఈయన పేరు ఆర్. రామ్మోహన్‌రెడ్డి. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం ఎస్.పేరేముల గ్రామానికి చెందిన ఈయన తనకున్న 3.57 ఎకరాల్లో కంది, ఆముదం పంటలు సాగుచేసే వారు. 90 శాతం సబ్సిడీపై బిందు పరికరాల కోసం ఆర్బీకేలో నమోదు చేసుకున్నారు. సర్వేచేసి బిందు సేద్యానికి అనువైనదిగా గుర్తించారు. తన వాటాగా రూ.44,343 చెల్లించారు. దీంతో గతానికంటే భిన్నంగా నేడు ఎలాంటి సిఫార్సుల్లేకుండా దరఖాస్తు చేయగానే వెంటనే పరికరాలు అమర్చారు. ఇప్పుడు కొత్తగా బత్తాయి మొక్కలు వేసుకున్నారు. దీంతో రైతు రామ్మోహన్‌రెడ్డి ఎంతో ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



సంక్రాంతి నుంచి 'ఫ్యామిలీ డాక్టర్'



- వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- సంక్రాంతి నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి..
- మండలంలోని పీహెచ్‌సీలకు ఇద్దరేసి వైద్యులు
- ప్రతి వైద్యుడు రోజు మార్చి రోజు గ్రామాల సందర్శన
- ప్రతి గ్రామానికి నెలలో రెండుసార్లు వైద్యుడు
- ఈ విధానం ద్వారా మెజారిటీ జబ్బులకు గ్రామాల్లోనే వైద్యం

12లో

క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్ కృష్ణాష్టమి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం శుభాకాంక్షలు తెలిపారు. 'మానవాళికి కర్తవ్యబోధ చేసిన భగవద్గీత.. సన్మార్గానికి కలకాలం అండగా ఉంటుంది. అటువంటి భగవద్గీతను ప్రసాదించిన భగవాన్ శ్రీకృష్ణుడి పుట్టినరోజు అందరికీ పర్వదినం. ప్రపంచానికి గీతను బోధించి, ప్రేమ తత్వాన్ని పంచిన శ్రీకృష్ణుని కృపా కటాక్షాలు మనందరిపై సదా ఉండాలని కోరుకుంటున్నాను' అని సీఎం పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి నాయీ బ్రాహ్మణుల కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణులను, వారి సామాజిక వర్గాన్ని కించపరిచే కొన్ని పదాలపై ప్రభుత్వం నిషేధం విధిస్తూ జీవో జారీ చేయడంపై వారు సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం వారు ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. తమ ఆత్మగౌరవాన్ని కాపాడారంటూ వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎంను కలిసిన వారిలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామదాసు, కె.శ్రీదేవి, నందిని తదితరులు ఉన్నారు.

ఐఏఎఫ్‌లోకి మెడ్‌టెక్ జోన్ ప్రవేశం



సాక్షి, విశాఖపట్నం: ఇంటర్నేషనల్ అక్రిడేషన్ ఫోరమ్ (ఐఏఎఫ్)లో ఏపీ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) ప్రవేశించింది. మెడ్‌టెక్ జోన్ తమ అసోసియేషన్ మెంబర్‌గా సభ్యత్వం పొందినట్లు ఐఏఎఫ్ గురువారం ప్రకటించింది. దేశం నుంచి ఐఏఎఫ్ అసోసియేషన్ మెంబర్‌గా అర్హత సాధించిన మొట్టమొదటి టెక్నాలజీ క్లస్టర్‌గా మెడ్‌టెక్ జోన్ నిలిచింది. ప్రపంచంలో వ్యాపార వాణిజ్య అవసరాలకు సహకారం అందిస్తూ..ఎలాంటి రిస్క్ లేకుండా వాణిజ్య వృద్ధిని పెంపొందించేందుకు ఐఏఎఫ్.. మెడ్‌టెక్ జోన్‌కి ఎగుమతి దిగుమతుల్లో సహకారం అందించనుంది.

ఉద్యోగుల క్రమశిక్షణ వ్యవహారాల ట్రిబ్యునల్ రద్దు

ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అధికారుల క్రమశిక్షణ వ్యవహారాల ట్రిబ్యునల్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ చట్టాన్ని రద్దు చేయడం ద్వారా ఇప్పటికే తీసుకున్న చర్యలపై ఎటువంటి ప్రభావం ఉండదని, ప్రస్తుతం విచారణలో ఉన్న కేసులను ఏపీ విజిలెన్స్ కమిషన్‌కు బదలాయిస్తామని జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్, హెచ్‌ఆర్‌ఎం) తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ట్రిబ్యునల్ కార్యాలయాన్ని మూసివేసి అక్కడ ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్స్ వంటి ఇతర సామగ్రిని వెలగపూడిలోని రిజిస్ట్రార్ కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు తరలించాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు, రేపు వర్ష సూచన

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడిందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఈ అల్పపీడనం శుక్రవారం ఉదయానికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.


'సచివాలయ వ్యవస్థ ద్వారా బాలల హక్కుల పరిరక్షణ'

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు చెప్పారు. మంగళగిరిలోని కమిషన్ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్యాచరణ చేపడతామని చెప్పారు. బాలలపై అధిక ఒత్తిడి లేకుండా విద్యావిధానం ఉండేలా కమిషన్ పర్యవేక్షిస్తుందన్నారు. విద్యార్థులు ఆత్మహత్యల నివారించాల్సిన అవసరం ఉందన్నారు.

ఫేక్ బాబుపై చర్యలు తీసుకోవాల్సిందే

- మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్

సాక్షి, అమరావతి: రాజకీయాల కోసం వ్యవస్థలను దిగజార్చే చంద్రబాబు చివరకు అశ్లీలాన్ని కూడా ఫేక్ వీడియోల ద్వారా వాడుకోవడమే కాకుండా తన దిగజారుడు రాజకీయాల కోసం అమెరికా సంస్థలను కూడా అడ్డగోలుగా వాడుకుంటూ దొరికిపోయారని మాజీ మంత్రి పేర్ని నాని దుయ్యబట్టారు. ఒక వెనుకబడిన వర్గానికి చెందిన ఎంపీ పేరు మీద అశ్లీల వీడియోను సృష్టించి, దాన్ని ఎల్లో మీడియా ద్వారా ప్రసారం చేసి.. దిగజారుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం చంద్రబాబుకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. తప్పుడు వీడియోలు సృష్టించి, వాటిని ప్రచారం చేసిన చంద్రబాబు, లోకేశ్‌తో పాటు ఎల్లో మీడియాపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు నాయుడుకు దేవుడు సిగ్గు అన్నది ఇవ్వడం మర్చిపోయినట్లున్నారని, అందుకే సిగ్గు, శరం ఏమాత్రం లేకుండా రాజకీయాల కోసం ఏదిపడితే అది మాట్లాడించడం, ప్రచారం చేయడం అలవాటుగా మారిందన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పేర్ని నానిఇంకా ఏమన్నారంటే..



పోతిని ప్రసాద్ ఎవరు?

- టీడీపీకి చెందిన నిఖార్సైన ఒకావిడ మాట్లాడుతూ.. ఈ సర్టిఫికెట్ కూడా కమ్మోళ్లు ఇచ్చారా అంటూ ఎకసెక్కాలు ఆడింది. మరి, ఈ సర్టిఫికెట్ ఇచ్చింది కమ్మోళ్లే కదా! పోతిని ప్రసాద్ కమ్మే కదా? ఇతను ఎవరు? ఆయన ఎవరికి సోదరుడు, ఆయనకు ఏం పని? మీకంత దమ్ము ఉంటే చంద్రబాబు నాయుడే ఎక్లిప్స్ సంస్థకు లేఖ రాయొచ్చు కదా? దొంగలతో ఈ పనులు చేయించడం ఎందుకు? ఇంతకూ పోతిని ప్రసాద్ ఎవరో చంద్రబాబు సమాధానం చెప్పాలి.
- 'పోతిని ప్రసాద్ అనే వ్యక్తి సో అండ్ సో ఐడీతో నాకు ఒక వీడియో పంపించాడు. వీడియోలో ఉన్నది మరో ఫోన్‌కాల్‌తో రికార్డు చేసిన వీడియో. అది ఒరిజినలా? కాదా? అని అడిగారు. ఒక ఫోన్‌లో ఉన్న వీడియోను మరో ఫోన్ ద్వారా రికార్డు చేసిన వీడియో ఒరిజినల్ అని చెప్పాను. ఆ రిపోర్టును మార్చి ఇవ్వాలని అడిగాడు. నేను ఆలోచించుకునేలోపే దానిని మార్చి బయటకు వైరల్ చేశారు. నేను ఇచ్చినట్టు ప్రచారం అవుతున్న సర్టిఫికెట్ ఒరిజినల్ కాదు. అది ఎడిట్ చేసిన దొంగ సర్టిఫికెట్' అని' ప్రొఫెసర్ జిమ్ స్టాఫర్డ్ స్పష్టంగా మెయిల్ చేశారు. దీనిపై టీడీపీ స్పందన ఏంటి?

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..

- ఫేక్ వీడియోను తయారు చేసినందుకు టీడీపీని, పోస్టు చేయించినందుకు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లను, నిజ నిర్ధారణ చేయకుండా అశ్లీల వీడియోను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేసినందుకు, పదేపదే ఈ అశ్లీలాన్ని చూడలేక ప్రజలు అల్లాడిపోయే వరకు ప్రసారం చేసిన టీడీపీ అనుకూల టీవీ చానళ్లను, ఆ చానళ్ల యాజమాన్యాలను, దొంగ వీడియోలు చూపించి ఫేక్ రిపోర్టులు చూపిస్తూ ప్రెస్‌మీట్ పెట్టిన టీడీపీ నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరుతోంది.
- ఆ రిపోర్టు తాము ఇవ్వలేదని, అది అబద్ధమని అమెరికా సంస్థే చెబుతున్నప్పుడు టీడీపీ, ఎల్లో మీడియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ తరఫున ఫిర్యాదు చేయాలనుకుంటున్నాం.
- టీడీపీ, చంద్రబాబు, లోకేష్, పట్టాభి, అనిత... వీరంతా కుట్ర పూరితంగా అమెరికా సంస్థను అడ్డం పెట్టుకుని తప్పుడు ప్రచారం చేయడం వాస్తవమా? కాదా? నివేదికను ట్యాంపర్ చేయించడం చంద్రబాబు చేసిన నేరం కాదా?

పవన్.. పాచిపోయిన లడ్డూ రుచి చూపించావా?

- పవన్ కల్యాణ్ మాటకు నిబద్ధత లేదు. పూటకో మాట, రోజుకో వేషం. పవన్ కల్యాణ్ వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం చేకూరింది?
- ఎన్నికల ముందు మోదీని తిట్టావు. మళ్లీ మోదీ చంకనెక్కావు. ఏ రాజకీయ అవసరం కోసం? మోదీకి ఏమైనా పాచిపోయిన లడ్డూ రుచి చూపించావా? మళ్లీ కొత్తగా లడ్డూ వండించావా? ఆ రోజు 11 రోజులు అన్నం తినలేదన్నావు కదా? మరచిపోయావా?
- పవన్ లాంటి విద్యార్థి.. స్కూల్‌లో ఏ వ్యాసం రాయమన్నా.. ఆవు కథ రాసినట్టు.. అధికారంలో ఉన్నా జగన్‌నే.. లేకపోయినా జగన్‌నే తిట్టడం ఎవరి కోసం?

ఏఐబీపీ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయండి

- కేంద్ర జలశక్తి శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ) కింద కేంద్ర ఆర్థిక సాయంతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్ర జలశక్తి శాఖ సూచించింది. ప్రాజెక్టులు, వాటి కింద కాల్వల పనులను నూరు శాతం పూర్తి చేసేందుకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేసింది. గురువారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ వివిధ రాష్ట్రాల అధికారులతో ఢిల్లీ నుంచి సమీక్ష నిర్వహించారు. ఏపీలోని గుండ్లకమ్మ, తోటపల్లి, తాడిపూడి, పుష్కర, ఎర్రకాల్వ ప్రాజెక్టుల పనులపై సమీక్షించారు. ముఖ్యంగా వంద ఎకరాల్లోపే భూసేకరణ పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఇటీవల వర్షాల వల్ల పనులకు ఆటంకం ఏర్పడిందని.. కొన్నింటిని మార్చి నాటికి, మిగతావి జూన్ నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర అధికారులు తెలిపారు.

చంద్రబాబు దర్శకత్వంలో.. టీడీపీ సమర్పిస్తున్న ది డర్టీ పిక్చర్..!

మొదటి పేజీ తరువాయి

వైఎస్సార్ కాంగ్రెస్‌పై బురద జల్లటానికి ఆఖరికి అమెరికాకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్‌ను కూడా తప్పుదోవ పట్టించారని ఆ సంస్థే స్వయంగా వెల్లడించింది. ఆ బూతు వీడియో కాల్‌ను ఒరిజినల్ మాదిరిగా మార్ఫింగ్ చేయడానికి చంద్రబాబు నాయుడి టీమ్ ఎంతగా కృషి చేసిందో సదరు ఫోరెన్సిక్ ల్యాబ్ అధిపతి జిమ్ స్టాఫర్డ్ స్వయంగా వివరిస్తూ ఏపీ సీఐడీకి లేఖ రాశారు. ఈ విషయాన్ని సీఐడీ అదనపు డీజీ సునీల్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. లేఖలోని వివరాల ప్రకారం టీడీపీ నేతలు ఈ బూతు చిత్రాన్ని ఎలా సమర్పించారంటే...

మొదట్లో ఓ వీడియోను తీసుకున్నారు. చంద్రబాబు నాయుడి దర్శకనిర్మాణంలో దాన్ని ఎడిట్ చేసి, మార్ఫింగ్ చేసి... అనంతపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను దెబ్బతీసేలా... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురద జల్లటానికి పనికివచ్చేలా తమకు కావలసినట్లు మార్చుకున్నారు. దీన్ని ఒక ఫోన్‌లో ప్లే చేస్తూ... ఆ ఫోన్లో ప్లే అవుతున్న వీడియోను మరో ఫోన్ ద్వారా ఎలాంటి అంతరాయాలూ లేకుండా షూట్ చేశారు. ఎందుకంటే అలా షూట్ చేసినపుడు అందులో మధ్యలో ఆగటం, ఎడిట్ చేసినట్లు కనిపించటం వంటివేమీ ఉండవు. ఇదిగో... ఇలా షూట్ చేసిన వీడియోను తమ పార్టీకి చెందిన ప్రసాద్ పోతిని అనే వ్యక్తి ద్వారా అమెరికాలోని ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆ ల్యాబ్.. తనకు పంపిన వీడియోను చూసింది. ''మేం చూసిన వీడియో ఒరిజినలే. కాకపోతే దాన్ని ఒక ఫోన్లో ప్లే చేస్తుండగా మరో ఫోన్ కెమెరా ద్వారా షూట్ చేశారు. అలా షూట్ చేసిందే మాకు పంపించారు. మా చేతికి ఏదైతే వచ్చిందో అందులో ఎలాంటి ఎడిటింగ్ జరగలేదు'' అని తమ నివేదికలో జిమ్ స్టాఫర్డ్ స్పష్టంగా పేర్కొన్నారు. అయితే తమకు అందిన దాని గురించే తాము చెప్పామని... తమకు ఒరిజినల్ వీడియో పంపించినట్లు తాము చెప్పలేదని, మార్ఫింగ్ చేసి... ఎడిట్ చేసిన వీడియోను ఒక ఫోన్లో ప్లే చేస్తూ... దాన్ని వేరే ఫోన్‌తో షూట్ చేసి ఉండొచ్చని స్టాఫర్డ్ స్పష్టంగా చెప్పారు కూడా. నిజానికి అనంతపురం ఎస్పీ ఫక్కీరప్ప చెప్పింది కూడా ఇదే. వైరల్ అవుతున్న వీడియో ఒరిజినల్ కాదని!!.



మాట్లాడుతున్న సీఐడీ అదనపు డీజీ పీవీ సునీల్ కుమార్

మెయిల్‌ను మార్చమని అడిగిన టీడీపీ..

నిజానికి ఎక్లిప్స్ ఫోరెన్సికల్ ల్యాబ్ చెప్పినదాంట్లో టీడీపీకి అనుకూలమేమీ లేదు. దీంతో ల్యాబ్ హెడ్ జిమ్ స్టాఫర్డ్‌ను ప్రసాద్ పోతిని సంప్రదించారు. తమకు పంపిన మెయిల్‌ను కాస్త మార్చాలని అడిగారు. దానికి స్టాఫర్డ్ వెంటనే సమాధానమివ్వలేదు. ఈలోగా చంద్రబాబు నాయుడి టీమ్ ఆ పని చేసేసింది. మెయిల్‌ను ట్యాంపర్ చేసేసింది. జిమ్ స్టాఫర్డ్ ఇచ్చిన నివేదికలో కొన్ని పదాలను తొలగించేసి... అది ఒరిజినల్ వీడియో అంటూ అమెరికన్ ల్యాబ్ ధ్రువీకరించిందని, ఇంకా ఏం సాక్ష్యాలు కావాలంటూ యావత్తు తెలుగుదేశం బృందం ఎక్కడికక్కడ మీడియా ముఖంగా ఆక్రందనలు మొదలెట్టింది. షరా మామూలుగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 తదితర బాబు బాకా మీడియా సంస్థలు దీన్ని బ్రహ్మాండం బద్దలైపోయినట్లుగా... ''అమెరికా సంస్థే తేల్చింది'' అంటూ పతాక శీర్షికల్లో వండి వార్చేశాయి.

ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా నిజాన్ని ఎన్నాళ్లు దాచగలరు? అందుకే ఈ వ్యవహారంలో మీరేం చెప్పారు? అది ఒరిజినల్ వీడియో అని చెప్పారా? అని అడిగిన సీఐడీకి... ఎక్లిప్స్ ల్యాబొరేటరీస్ లేఖ పంపింది. అందులోని నిర్ఘాంతపోయే నిజాలతో... తెలుగుదేశం పార్టీ నిర్మించి సమర్పించిన డర్టీ పిక్చర్ వ్యవహారం బయటపడింది. అంతే కాదు!! తమ నివేదికను ట్యాంపర్ చేసిన ప్రసాద్ పోతిని పైన, ఆ నివేదికను ప్రచారంలోకి తీసుకువచ్చిన వారిపైన చర్యలు కూడా తీసుకుంటామని జిమ్ స్టాఫర్డ్ చెప్పటం... ఈ వ్యవహారంలో చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని చెప్పాలి.

ఆర్‌ఆర్‌ఆర్‌లోని సీన్‌ను రికార్డు చేస్తే...

ఓ చిన్న ఉదాహరణ చూస్తే పై సంఘటనకు అతికినట్లు సరిపోతుంది.

- ఇటీవల వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ఓ సీన్‌లో పులులు, సింహాలు, ఎలుగుబంట్లు ఓ వ్యాన్ నుంచి దూకినట్టుగా చూపిస్తారు. అవి నిజమైన పులులు, సింహాలు కావు. గ్రాఫిక్స్ ద్వారా నిజమేననే భ్రమ కలిగించేలా చేశారు. ఆ సినిమాను థియేటర్‌లో ప్రదర్శిస్తుంటే ఎవరైనా నిజమే అనుకుంటారు. మరి అలా తెరపై ప్లే అవుతున్న సినిమాను తమ మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి... ఆ వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారనుకోండి. ఆ సీన్‌లో ఉన్నవి నిజమైన పులులు, సింహాలో కాదో చెప్పమన్నారనుకోండి. ఆ ల్యాబ్ ఏం చేస్తుంది?
- ఆ మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసిన క్లిప్ (తమకు వచ్చినది) మాత్రమే ఒరిజినల్ అని ఏ ల్యాబైనా చెబుతుంది. సినిమా థియేటర్లో తెరపైన ప్రదర్శించిన సీన్‌లో ఉన్న పులులు, సింహాలు నిజమైనవో కావో ఆ వీడియోను చూసి ఏ ఫోరెన్సిక్ ల్యాబ్ కూడా చెప్పలేదు. అలా చెప్పాలంటే ఆ సినిమా డిజిటల్ రీల్‌ను ఫోరెన్సిక్ సంస్థకు పంపించాలి. ప్రస్తుతం ఎంపీ మాధవ్ పేరుతో కొందరు వైరల్ చేసిన వీడియో క్లిప్ కూడా అలాంటిదే.

ఇదండీ... జరిగిన కథ

- ఓ పురుషుడు, ఓ మహిళ సంభాషణకు సంబంధించిన వీడియో కాల్ ఒక ఫోన్లో ప్లే అవుతుండగా... దాన్ని మరో వ్యక్తి తన మొబైల్ ఫోన్ ద్వారా రికార్డ్ చేశారు. ఆ వీడియోలో ఉన్నది ఎంపీ గోరంట్ల మాధవ్ అనే అభియోగాలు మోపారు. కానీ తాను ఆ వీడియోలో ఉన్నట్టుగా కొందరు మార్ఫింగ్ చేశారని ఎంపీ మాధవ్ చెప్పారు.
- మీడియాలో ప్రసారమైన ఆ వీడియోను ప్రసాద్ పోతిని అనే వ్యక్తి అమెరికాలోని ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి.. ఆ వీడియో ఒరిజినలే అని ఆ ల్యాబ్‌కు చెందిన జిమ్ స్టాఫర్డ్ ధ్రువీకరించినట్టుగా ఓ సర్టిఫికెట్‌ను మరికొందరితో కలిసి మీడియాలో వైరల్ చేశారు.
- ఈ అంశంపై అమెరికాలోని ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను సీఐడీ విభాగం సంప్రదించగా.. జిమ్ స్టాఫర్డ్ స్పందిస్తూ... ఆ వీడియో ఒరిజినల్ అని తాము ధ్రువీకరించలేదన్నారు. తమకు పంపిన వీడియో క్లిప్‌ను మాత్రమే ఒరిజినల్ అన్నామని, దానికి మాతృక అయిన వీడియోను తాము ధ్రువీకరించలేదని... ఈ మేరకు ఎలాంటి నివేదికా ఇవ్వలేదని స్పష్టంగా చెప్పారు. ఆ అసలైన వీడియో క్లిప్ పంపితేనే అది ఒరిజినలో కాదో చెప్పగలమని కూడా ఆ సంస్థ ప్రసాద్ పోతినికి స్పష్టం చేసింది.

ట్యాంపర్ చేసిన నివేదికతో దుష్ప్రచారం

- ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ఇచ్చిన నివేదికతో ప్రసాద్ పోతిని సంతృప్తి చెందలేదు. తాము ఆశించినట్టుగా ఆ వీడియో ఒరిజినలే అని నివేదిక ఇవ్వాలని జిమ్ స్టాఫర్డ్‌ను కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించలేదు. దీంతో ఎక్లిప్స్ ల్యాబ్ ఇచ్చిన నివేదికను ప్రసాద్ పోతిని ట్యాంపర్ చేశారు. అలా మార్చిన నివేదికను ఆయనతోపాటు కొందరు మీడియాలో వైరల్ చేశారు. అయితే ఆ సర్టిఫికెట్ తాము జారీ చేసింది కాదని జిమ్ స్టాఫర్డ్ ఏపీసీఐడీకి మెయిల్ ద్వారా తెలిపారు.
- వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారానికి ఇలా తప్పుడు నివేదికను ప్రచారంలోకి తేవటంపై సీఐడీ అధికారి సునీల్ కుమార్ స్పందిస్తూ... ''ఏదైనా సంస్థ ఇచ్చిన సర్టిఫికెట్‌ను యథాతథంగా వెల్లడించాలి. అంతేగానీ అందులో మార్పులు చేయడం చట్ట ప్రకారం నేరం. అందుకు బాధ్యులైన వారిపై ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం అని సీఐడీ ఏడీజీ సునీల్‌కుమార్ తెలిపారు.

టీడీపీ పెద్ద ఫేక్

- ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబూ ఫేక్
- మంత్రి జోగి రమేష్ మండిపాటు



కొత్తపేట: 'తెలుగుదేశం పార్టీ పెద్ద ఫేక్.. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడూ ఫేక్.. అలాంటి బాబుకు ఫేక్ ప్రచారం చేయడం అలవాటే' అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. ఎంపీ గోరంట్ల మాధవ్ వీడియో ఫేక్ అయినప్పటికీ, అది ఒరిజినల్ అంటూ.. అమెరికాలోని ఓ ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ఇచ్చిందంటూ టీడీపీ దుష్ప్రచారం చేస్తుండటంపై తీవ్రంగా మండిపడ్డారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన టీడీపీ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. గోరంట్ల మాధవ్ ఫేక్ వీడియోను పట్టుకుని.. ఒక ఫేక్ సర్టిఫికెట్ సృష్టించుకుని గవర్నర్ దగ్గరకు వెళ్లటం దారుణం అని చెప్పారు. 'వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేవు కాబట్టి ఇలాంటి ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేయడం టీడీపీకి అలవాటుగా మారింది. అది ఒరిజినల్ కాదని అమెరికాలోని ఆ ఫోరెన్సిక్ ల్యాబ్ వారే స్వయంగా ఈ మెయిల్ ద్వారా తెలిపారు. చంద్రబాబు, టీడీపీ నేతలపై తగు చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరుతున్నాం' అని తెలిపారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు ఏ విధంగా టీడీపీకి ఫేక్ అధ్యక్షుడయ్యారో అందరికీ తెలుసని చెప్పారు.

బాబు జీవితమంతా గ్రాఫిక్సే

- నాడు అమరావతిపై.. నేడు వైఎస్సార్‌సీపీ నాయకులపై..
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



సాక్షి, అమరావతి/రాజమహేంద్రవరం: నాడు టీడీపీ అధికారంలో ఉండగా రాజధాని అమరావతిపై గ్రాఫిక్స్ సృష్టించిన చంద్రబాబు నేడు వైఎస్సార్‌సీపీ నాయకులపై గ్రాఫిక్స్ సృష్టిస్తూ ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. ఆయన జీవితమంతా గ్రాఫిక్సేనని ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపీ గోరంట్ల మాధవ్‌పై ఫేక్ వీడియో రూపొందించింది టీడీపీనేనని ఇప్పుడు తేటతెల్లమైందని స్పష్టం చేశారు. కుట్ర రాజకీయాలకు చంద్రబాబు దేశంలోనే ఒక చిరునామా అని తెలిపారు. నాడు ఎన్టీ రామారావును సీఎం పదవి నుంచి దింపడం కోసం లక్ష్మీపార్వతిని సాకుగా చూపి కుట్ర చేశారన్నారు. ప్రతి ఒక్కరిని మోసం చేసి, ఎదగాలనుకోవడం చంద్రబాబు నైజం అని ధ్వజమెత్తారు. 'ఎంపీ మాధవ్‌పై టీడీపీ వారే ఒక ఫేక్ వీడియో రూపొందించారు. వారే విదేశాలకు పంపి అప్‌లోడ్ చేశారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో వైరల్ చేసి, వారే ట్రోల్ చేశారు' అని మండిపడ్డారు. ఇందుకు కారకులైన టీడీపీ నేతలందరిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాపు ఉద్యమంలో ముద్రగడ కుటుంబాన్ని హింసిస్తే పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడలేదని మంత్రి ప్రశ్నించారు.

టీడీపీ కుట్ర బట్టబయలు

- ఫేక్ సర్టిఫికెట్‌తో దొరికిపోయిన బాబు అండ్ గ్యాంగ్: మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: ఆ ఫోరెనిక్స్ రిపోర్టు తాను ఇచ్చింది కాదని అమెరికాలోని ల్యాబ్‌కు చెందిన జిమ్ స్టాఫర్డ్ స్వయంగా స్పష్టం చేయడంతో టీడీపీ కుట్ర బట్టబయలైందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రిపోర్టును మార్చడానికి ఆయన సమ్మతించక పోవడంతో ఏకంగా సర్టిఫికెట్‌నే మార్చడం టీడీపీ దుర్మార్గ రాజకీయాలకు నిదర్శనమన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను ఇబ్బంది పెట్టారని ఏ మహిళా.. ఎటువంటి ఫిర్యాదు చేయకపోయినా ఒక మార్ఫింగ్ వీడియోతో చంద్రబాబు అండ్ కో నీచ రాజకీయాలకు తెరతీశారని దుయ్యబట్టారు. సాంకేతికతను ఉపయోగించుకుని కుట్రలకు తెరతీయడంలో దిట్ట అయిన చంద్రబాబు, లోకేశ్ గ్యాంగ్ ఎంతటి నీచానికైనా ఒడిగడతారని మండిపడ్డారు. తప్పుడు రిపోర్ట్‌తో దొరికిపోయిన బాబు అండ్ గ్యాంగ్‌పై చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆ వీడియో చూశామని టీడీపీకి చెందిన కొందరు మహిళలు సభ్యత మరచి.. అడ్డగోలుగా మాట్లాడుతుండడం పట్ల సభ్య సమాజం తల దించుకుంటోందని అన్నారు. మహిళలతో అశ్లీల నృత్యాలు చేస్తున్న లోకేశ్ చిత్రాలు చూసి కూడా ఏమీ మాట్లాడని చంద్రబాబు అండ్ కోను ఏమనుకోవాలని నిలదీశారు. చంద్రబాబుకు మతి భ్రమించిందని, ఆయన్ను మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

బాబు, ఎల్లో మీడియా సెల్ఫ్ గోల్

- ఫేక్ వీడియో వ్యవహారంపై మాజీ మంత్రి కొడాలి నాని
- మహిళలను అడ్డుపెట్టుకుని చంద్రబాబు నీచ రాజకీయాలు
- పదవులేమో మీ కులపోళ్లకు.. అశ్లీలతపై మాట్లాడేందుకు దళితులా?
- మోదీ చేతులు పట్టుకుని ఐదుసార్లు క్షమాపణ కోరిన బాబు
- లోకేశ్ బతుకే ఫేక్.. అతనొక చిన్న 420
- బాబు పడేసే చిల్లర కోసం వాగుతున్న పవన్ కల్యాణ్

సాక్షి, అమరావతి: ఎంపీ మాధవ్‌పై ఫేక్ వీడియో, ఫేక్ సర్టిఫికెట్‌తో చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా సెల్ఫ్ గోల్ చేసుకుందని మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరావు(నాని) అన్నారు. మహిళలను అడ్డుపెట్టుకుని చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు టీడీపీ నేతలు ప్రతి రోజూ ఏదో ఒక కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కుల, మతాల పేరుతో చంద్రబాబు చిచ్చు పెట్టాలని చూస్తున్నారన్నారు. ఆయనకు తోడు ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మాధవ్ వీడియోపై



ఎవరూ ఫిర్యాదు చేయక పోయినా, ప్రభుత్వంపై బురద చల్లేందుకు టీడీపీ పనికిమాలిన రాజకీయాలు చేస్తోందని నిప్పులు చెరిగారు. నాని ఇంకా ఏమన్నారంటే..

బాబు ఫేక్ రాజకీయం

- ఎంపీ గోరంట్ల మాధవ్ పేరుతో సర్క్యులేట్ అవుతున్న వీడియో వ్యవహారంలో.. అమెరికాలోని ఎక్లిప్స్ లేబొరేటరి నుంచి టీడీపీ వారు ఒక ఫేక్ నివేదిక తీసుకొచ్చి హడావుడి చేశారు. తీరా అది ఫేక్ అని, ఆ విషయం ఎక్లిప్స్ లేబొరేటరీ చీఫే ఈ మెయిల్ ద్వారా వెల్లడించినట్టు సీఐడీ చీఫ్ సునీల్ కుమార్ చాలా స్పష్టంగా చెప్పారు.
- సీఎం జగన్‌ను ప్రజా క్షేత్రంలో ఎదుర్కోలేక, ఆయన అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుండటాన్ని జీర్ణించుకోలేక ఏదో రకంగా బురద చల్లాలనే టీడీపీ పన్నాగం బట్టబయలైంది.
- చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, టీడీపీని మోస్తున్న ఎల్లో మీడియా.. సీఎం జగన్‌పై ప్రతిక్షణం విషం కక్కుతూ, ఎలాగైనా చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలని, తద్వారా, రాష్ట్రాన్ని లూటీ చేసి, వీళ్ల కుటుంబాల ఆస్తులు పెంచుకోవాలని పదే పదే కుట్రలు చేస్తున్నారు.
- సీఎం జగన్ క్రిస్టియన్ అని, డీజీపీ, హోం మంత్రి, ఎస్పీలు క్రిస్టియన్లు అని, కాబట్టే రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని.. వీళ్లే దాడులు చేయించి, వీళ్లే మతాల గురించి మాట్లాడి ఈ ప్రభుత్వంపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారు. కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెడితే.. ఒక దళిత మంత్రి, ఒక బీసీ ఎమ్మెల్యే ఇళ్లపై దాడులు చేసి, ఆఖరికి కోనసీమలో కులాల మధ్య, మతాల మధ్య చంద్రబాబు అండ్ కో చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారు.

అశ్లీలం గురించి మాట్లాడేందుకు వారే కనిపించారా?

- టీడీపీలో పదవులేమో చెందిన కమ్మ కులం వారికి ఇస్తారు. కృష్ణా జిల్లా విషయానికొస్తే.. అక్కడ జెడ్పీ చైర్మన్ పదవిని కమ్మ వర్గానికి చెందిన గద్దె అనురాధకు.. మేయర్ పదవేమో బాబు సామాజిక వర్గానికి చెందిన చెందిన కేశినాని నాని కూతురికి అని చెప్పాడు. అశ్లీల వీడియోల గురించి మాట్లాడాల్సి వస్తే మాత్రం దళిత మహిళలు అనిత, గ్రీష్మలే కనిపిస్తారా?
- ఢిల్లీలో మోదీ చేతులు పట్టుకుని ఐదు సార్లు చంద్రబాబు క్షమాపణలు కోరారు. రాష్ట్రానికి వచ్చి రివర్స్‌లో బాబును మోదీ బతిమిలాడుకున్నాడని ఎల్లో మీడియాలో రాతలు రాయించుకున్నాడు. బాబు ఒక ఐరన్ లెగ్. లోకేశ్ బతుకే ఫేక్. బాబు 420 అయితే, లోకేశ్ చిన్న 420. తండ్రీ కొడుకులకు ఇక రాజకీయ జీవితం ఉండదు. బాబు పడేసే చిల్లర కోసం వారి దత్తపుత్రుడు వాగుతున్నాడు.

ఫేక్ రిపోర్ట్.. ఫేక్ పార్టీ.. ఫేక్ లీడర్

- ఫేక్ వీడియోతో టీడీపీ అనైతిక రాజకీయం
- ఎమ్మెల్సీ పోతుల సునీత

సాక్షి, అమరావతి: టీడీపీ సిగ్గు, ఎగ్గు లేకుండా ఫేక్ వీడియోలు, ఫేక్ సర్టిఫికెట్‌లతో అనైతిక రాజకీయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజమెత్తారు. ఆ పార్టీ ఫేక్ అని, దాని అధ్యక్షుడు చంద్రబాబు కూడా ఫేక్ అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పాలన చూసి కడుపు మంటతో టీడీపీ దుష్ట రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీ మాధవ్‌పై ఫేక్ వీడియో రూపొందించి, దుష్ప్రచారం చేసిన, సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులు అనిత, పట్టాభి.. ఫేక్ వీడియోలను పదేపదే ప్రసారం చేసిన ఎల్లోమీడియా చానళ్లు, పత్రికలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, తన పని తాను చేసుకుపోతుందనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

మనుగడ కోసం టీడీపీ నీచ రాజకీయం

- ఇలాంటి ఫేక్ వీడియోలతో రాజకీయాలు సాధ్యం కాదని టీడీపీ ఇప్పటికైనా గుర్తించాలి. సీఎం జగన్ ఏపీని దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పేదల



సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆదరణ కోల్పోయిన టీడీపీ.. మనుగడ కోసం ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ వీడియోలతో నీచ రాజకీయం చేస్తోంది.

- టీడీపీ వారే ఫేక్ వీడియో సృష్టించి, దాన్ని లండన్‌కు పంపి, టీడీపీకి చెందిన ఐ టీడీపీ గ్రూప్ ద్వారా దాన్ని అప్‌లోడ్ చేసి, సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఆ తర్వాత ఆ వీడియోను అమెరికాలోని ఒక ల్యాబ్‌కు పంపామని, ఆ వీడియో వాస్తవమని నివేదిక వచ్చిందని రచ్చ చేశారు. తీరా ఆ నివేదిక తాము ఇవ్వలేదని సదరు ల్యాబ్ వారు స్పష్టం చేయడంతో టీడీపీ బండారం బయట పడింది.
- తద్వారా రాష్ట్రంలో టీడీపీ ఏ స్థాయిలో దుర్మార్గమైన రీతిలో రాజకీయం చేస్తోందన్నది అందరికీ అర్థమైంది. చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలే. ఎప్పుడూ ఎవరో ఒకరితో పొత్తు పెట్టుకుని రాజకీయాలు చేశారు. ఇప్పుడు మళ్లీ బీజేపీ ప్రాపకం కోసం వెంపర్లాడుతున్నారు.
- రాష్ట్రంలో మహిళలు ఉన్నారని కూడా చూడకుండా, ఒక బీసీ నేత, స్వయంగా ఎంపీపైనే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ విధంగా సీఎం జగన్‌పై నిందలు మోపుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. పిచ్చిపిచ్చిగా మాట్లాడిన అనిత, పట్టాభిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి.

క్లుప్తంగా

ఎక్కువ ఫీజు వసూలు చేస్తే చర్యలు

ఉన్నత విద్యాసంస్థలకు ఏపీహెచ్ఈఆర్ఎంసీ హెచ్చరిక

సాక్షి, అమరావతి: విద్యార్థుల నుంచి ఎక్కువ ఫీజు వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలను ఏపీ ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీహెచ్ఈఆర్ఎంసీ) హెచ్చరించింది. ఈ మేరకు అన్ని విద్యాసంస్థలకు కమిషన్ మెంబర్ సెక్రటరీ, సీఈవో డాక్టర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డి లేఖ రాశారు. యాజమాన్యాలు ఎక్కువ ఫీజు వసూలు చేయడం, సర్టిఫికెట్లు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేయడం సహా పలు అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కమిషన్‌కు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి విద్యాసంస్థ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను అందరికి కనిపించేలా విద్యాసంస్థల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని సూచించారు. నిర్దేశించిన ఫీజు కన్నా అధికంగా వసూలు చేస్తే ఏపీహెచ్ఈఆర్ఎంసీ 2019, ఏపీ విద్యాసంస్థల (రెగ్యులేషన్ ఆఫ్ అడ్మిషన్స్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ క్యాపిటేషన్ ఫీ)–1983 చట్టాల్లోని నిబంధనలను అనుసరించి శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కోర్సు పూర్తయిన విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యాసంస్థలు అట్టిపెట్టుకోరాదని పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థుల నుంచి ముందస్తుగా ఫీజు వసూలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. కమిషన్ ఆకస్మిక తనిఖీలు చేసి విద్యార్థులతో మాట్లాడుతుందని, ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించినట్లు తమదృష్టికి వస్తే ఆయా విద్యాసంస్థలకు పెనాల్టీ విధించడంతోపాటు సమస్య తీవ్రతను బట్టి అఫిలియేషన్‌ను రద్దుచేయడానికి సిఫార్సు చేస్తామని ఆయన తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి



ఉద్యోగసంఘాల నేతలతో వెన్నపూస రవీంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న అనంతపురం, కడప, కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో గురువారం ఆయన ఉద్యోగ సంఘాల నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీ రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి వెన్నపూస గోపాల్‌రెడ్డి ఉద్యోగ నేతగా చాలాకాలం పని చేశారని చెప్పారు. తనకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, సెక్రటరీ జనరల్ వైవీ రావు, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు, రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, బి.కిషోర్ కుమార్, ఆర్‌వీ రాజేష్, రమేష్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు జయబాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లాలంటే సమస్యలు వస్తాయి

- విలేజ్ క్లినిక్‌లలో వైద్యం అందించేలా నిబంధనలు ఉండాలి
- ప్రభుత్వ వైద్యుల సంఘం వినతి

సాక్షి, అమరావతి: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లాలంటే చాలా సమస్యలు వస్తాయని, విలేజ్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు వైద్యం అందించేలా నిబంధనలు ఉండాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబును కోరారు. వీరు గురువారం మంగళగిరిలో కృష్ణబాబును కలిశారు. వైద్య సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు మంచానికి పరిమితమై కదల్లేని స్థితిలో ఉన్న రోగులకు మాత్రమే వైద్యులు ఇంటికి వెళ్లి సేవలందించేలా వీలు కల్పించాలని కోరారు. వైద్య విధాన పరిషత్ రీస్ట్రక్చరింగ్‌లో కోల్పోయిన సీఏఎస్ పోస్టులను సూపర్ న్యూమరరీ పోస్టులుగా పరిగణించాలన్నారు. జిల్లాల స్థానికతకు సంబంధించిన ఉత్తర్వులు తక్షణమే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పెషలిస్ట్ వైద్యులకు పదవీ విరమణ వయస్సును 65 సంవత్సరాలకు పెంచాలని కోరారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న కారు.. ఒకరు మృతి

మేదరమెట్ల: ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. విజయవాడ వైపు వెళుతున్న ట్రావెల్స్ బస్సు మేదరమెట్ల వద్ద ఆగింది. ఈ సమయంలో అదే వైపు వెళుతున్న కారు.. బస్సు వెనుక వైపు బలంగా ఢీకొంది. దీంతో కారులోని ఒకరు మృతి చెందగా.. నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

విద్యాభివృద్ధి కార్యక్రమాలు ఏపీలో అద్భుతం

ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయం
- దేశంలో ఎక్కడాలేని విధంగా పథకాలు
- గోవా రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఉన్నత విద్యాశాఖ ప్రశంసలు


గోవా నుంచి వచ్చిన ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీలో అమలుచేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయని గోవా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రతినిధులు ప్రశంసించారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా ఈ కార్యక్రమాలు నిలుస్తున్నాయన్నారు. గోవా స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్, డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు, గురువారం ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌ను సందర్శించారు. జాతీయ విద్యా విధానం–2020 అమలులో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ విధానాలను పరిశీలించారు. మల్టీ డిసిప్లినరీ, ప్రవేశ పరీక్షల నిర్వహణ, డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఇంటర్న్‌షిప్, న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్, ఎన్బీఏ ర్యాంకింగ్స్‌లో ఏపీ చేపడుతున్న చర్యల గురించి మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ప్రతినిధి బృందానికి వివరించారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువు తర్వాత ఎగ్జిట్ అండ్ ఎంట్రీ ఆప్షన్, ఆపై పరిశోధనతో నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను ఏపీ ఎలా ప్రవేశపెట్టిందో తెలిపారు. ప్రొఫెషనల్, సంప్రదాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో 10 నెలల తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌ను ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ, జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీలు ఇంటర్న్‌షిప్‌ల పురోగతిని పర్యవేక్షిస్తున్నాయని ఆయన చెప్పారు. పరిశ్రమలతో విద్యా సంస్థల అనుసంధానం కోసం 'ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ కనెక్ట్ పోర్టల్'ను ఏర్పాటుచేశామన్నారు. ఎల్ఎంఎస్ పోర్టల్ ద్వారా, అమెజాన్ వెబ్ సర్వీసెస్, సేల్స్‌ఫోర్స్, మైక్రోసాఫ్ట్ మొదలైన బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, నాస్కామ్ సహకారంతో 1.75 లక్షల మందికి ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లను అందిస్తున్నట్లు హేమచంద్రారెడ్డి వివరించారు. ప్రొఫెషనల్ కోర్సులలో ప్రవేశానికి వివిధ ప్రవేశ పరీక్షల నిర్వహణ, సంప్రదాయ డిగ్రీ ప్రోగ్రామ్‌ల కోసం ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాల నిర్వహణ గురించి కూడా ఆయన వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనా అభినందనలు

ఇక పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్ అయిన జగనన్న విద్యా దీవెనతో పాటు జగనన్న వసతి దీవెన కింద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని గోవా బృందం అభినందించింది. రాష్ట్రంలోని ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 86 శాతం మంది విద్యార్థులకు ఇది ప్రయోజనం చేకూరుతుండడం అద్భుతమని.. దేశంలో ఎక్కడా ఇలాంటి పథకాల్లేవని కొనియాడింది. నూతన విద్యా విధానం–2020ని అమలుచేయడంలో ఏపీ కృషిని బృందం ప్రశంసించింది. అలాగే, రూ.32.కోట్లతో ప్రత్యేక పోర్టల్ ద్వారా రాష్ట్రంలోని 3.5 లక్షల మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లను అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రశంసించింది. మండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ కె. రామ్మోహనరావు, కార్యదర్శి ప్రొ. సుధీర్ ప్రేమ్‌కుమార్ కూడా బృందంతో సంభాషించారు.

గోవా బృందంలో టీచింగ్ లెర్నింగ్ అండ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ, స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ప్రొఫెసర్ నియాన్ మార్ఫ్సెన్, హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ (అకడమిక్స్) ప్రొ. ఎఫ్ఎం నదాఫ్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్, స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వందనా నాయక్, ఉన్నత విద్యా డైరెక్టరేట్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సందేశ్ గాంకర్, సిద్ధి భండాంకర్, మెలాన్సీ మస్కరెన్హాస్, నెట్‌వర్క్ సిస్టమ్ ఇన్‌చార్జి డారిల్ పెరీరా తదితరులు పాల్గొన్నారు.

24శాతం మేర వేతనాలు పెంపు

ఎన్‌హెచ్ఎం ఒప్పంద ఉద్యోగులకు హామీ

సాక్షి, అమరావతి: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఒప్పంద ఉద్యోగులకు 24 శాతం మేర వేతనాలు పెంపు చేపడతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖాధికారులు హామీ ఇచ్చారు. మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపు డిమాండ్‌తో కొద్దిరోజులుగా ఎన్‌హెచ్ఎం ఒప్పంద ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. ఈక్రమంలో వైద్యశాఖ అధికారుల రెండో విడత చర్చలు గురువారం ముగిశాయి. మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపునకు నిబంధనలు సహకరించడం లేదని.. అయినప్పటికీ ఉద్యోగులకు న్యాయం చేస్తూ 24% మేర వేతనాల్లో పెంపు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఇందుకు నేతలు సుముఖత వ్యక్తంచేశారు. తక్కువ వేతనాలు ఉన్న స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, ఫార్మాసిస్ట్, డీఈఓలకు అదనంగా సాయం చేయాలని కోరారు. తక్కువ వేతనాలున్నవారికి అదనంగా సాయం చేయడానికి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఎన్‌హెచ్ఎం ఎండీ నివాస్ తెలిపారు. అధికారులిచ్చిన హామీమేరకు తమ ఆందోళనను వాయిదా వేస్తున్నామని ఒప్పంద ఉద్యోగుల జేఏసీ సలహాదారు పోతురాజు శ్రీనయ్య 'సాక్షి'కి తెలిపారు.

సూక్ష్మ సేద్యం విస్తరిస్తోంది

▶ మొదటి పేజీ తరువాయి

మరో 28.35 లక్షల ఎకరాలు అనువైనవి కాగా.. దశల వారీగా దీనిని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా.. తొలివిడత కింద 2022–23లో రూ.1,395 కోట్లతో 3.75 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని విస్తరించడం ద్వారా 1.70 లక్షల మంది రైతులకు లబ్ధిచేకూర్చాలని నిర్ణయించారు. తద్వారా అదనంగా 26 లక్షల టన్నుల దిగుబడులతో రూ.1,500 కోట్లకు పైగా జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్: అదనపు స్థూల విలువ) సాధించవచ్చునని అంచనా వేస్తున్నారు.


అనంతపురంలో అత్యధికంగా..

ఇక రాష్ట్రవ్యాప్తంగా ఐదెకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 5–10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం, ప్రకాశం మినహా కోస్తా జిల్లాలకు చెందిన 5–12.5 ఎకరాల్లోపు రైతులకు 50 శాతం రాయితీతో బిందు.. 50 శాతం రాయితీపై రాష్ట్రవ్యాప్తంగా తుంపర పరికరాలు అందిస్తున్నారు. పరికరాల సరఫరాకు 37 కంపెనీలు ముందుకొచ్చాయి. ఇప్పటివరకు 3,60,120 ఎకరాల్లో బిందు పరికరాల కోసం 1,13,757 మంది.. 57,817 ఎకరాల్లో తుంపర పరికరాల కోసం 20,080 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అత్యధికంగా అనంతపురం జిల్లాలో 1.02 లక్షల ఎకరాలకు 28,339 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 76,140 ఎకరాలకు 22,827 మంది, ప్రకాశం జిల్లాలో 37,245 ఎకరాలకు 12,759 మంది, వైఎస్సార్ జిల్లాలో 35,780 ఎకరాలకు 11,097 మంది దరఖాస్తు చేసుకున్నారు.

డిసెంబర్ నాటికి లక్ష్య సాధన


క్షేత్రస్థాయి పరిశీలనలో అర్హుల గుర్తింపు, అంచనాల తయారీ చురుగ్గా సాగుతోంది. అర్హుల ఎంపిక ప్రక్రియ 90 శాతం పూర్తయ్యింది. అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో అర్హత పొందిన రైతులకు తుంపర పరికరాల పంపిణీ చురుగ్గా సాగుతోంది. బిందు పరికరాల కోసం ఇప్పటికే 20 వేల ఎకరాల్లో సర్వే పూర్తికాగా, 5వేల ఎకరాల్లో అమరిక పూర్తయ్యింది. అమరిక ప్రక్రియను డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వారం రోజుల్లోనే పరికరాలిచ్చారు




నేను 2.5 ఎకరాల్లో మిరప సాగుచేస్తున్నా. 50 శాతం రాయితీపై తుంపర పరికరాలు తీసుకున్నాను. ఆర్బీకేలో దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే పొలానికి తీసుకొచ్చి ఇచ్చారు. మిరప సాగు తర్వాత అపరాల సాగుకు వినియోగిస్తా.
– శ్యామల సత్యనారాయణరెడ్డి, రామచంద్రపురం, ఎన్టీఆర్ జిల్లా

డ్రిప్‌తో రూ.75వేల నికర ఆదాయం




నాకు నీటి సౌకర్యం ఉన్న ఐదెకరాల పొలం ఉంది. డ్రిప్ లేకపోతే ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలు ఖర్చవుతుంది.డ్రిప్ ఉంటే రూ.15వేలు సరిపోతుంది. ఆదాయం కూడా ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.75వేల వరకు వస్తుంది.
– చుక్కా లక్ష్మీనారాయణ, రేకులకుంట, అనంతపురం జిల్లా

బుడ్డశనగ కూడా వేస్తున్నా..



నేను 2.44 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నా. సబ్సిడీపై తుంపర పరికరాలు ఇటీవలే అమర్చారు. వీటి ద్వారా వేరుశనగ పంటే కాకుండా బుడ్డశనగ ఇతర పంటలను కూడా సాగుచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నా.
– సి. రామసుబ్బారెడ్డి, గడ్డంవారిపల్లి, వైఎస్సార్ జిల్లా

ఈసారి దిగుబడులు పెరుగుతాయి



సూక్ష్మ సాగునీటి పథకం కింద తుంపర, బిందు పరికరాల కోసం రైతుల నుంచి ఊహించని రీతిలో స్పందన వచ్చింది. పెద్దఎత్తున రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అర్హుల గుర్తింపు, అంచనాల తయారీ, పరికరాల అమరిక చురుగ్గా సాగుతోంది. డిసెంబర్ కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఖచ్చితంగా దిగుబడులు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం.
– డాక్టర్ సీబీ హరనాథరెడ్డి, పీడీ, ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు



నేను 4.91 ఎకరాల్లో నేరేడు పంట సాగుచేస్తున్నా. ఆర్బీకేలో దరఖాస్తు చేయగానే సర్వేచేసి మంజూరు ఆర్డర్ ఇచ్చారు. ఈ మధ్యే పొలంలో పరికరాలు అమర్చారు. వీటి వినియోగంతో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు కృషిచేస్తా. – చమరాతి ప్రమీలమ్మ, ఓడివీడు, అన్నమయ్య జిల్లా

నిర్ణీత గడువులోగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ: మంత్రి మేరుగ



సాక్షి, అమరావతి: నిర్ణీత గడువులోగా విజయవాడ స్వరాజ్ మైదానంలో బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే అంబేడ్కర్ జయంతి నాడు విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రిపగలు నిర్విరామంగా పనులు చేసేందుకు మైదానంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రభుత్వాఫీసుల్లోనూ ఫేస్ రికగ్నిషన్ యాప్

- తొలిదశ కింద విద్యాశాఖలో అమలు
- ఉపాధ్యాయ సంఘాలతో భేటీ అనంతరం మీడియాతో మంత్రి బొత్స


ఉపాధ్యాయ సంఘాల నేతల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: త్వరలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవస్థను తీసుకు రానున్నామని.. అందులో భాగంగా తొలుత విద్యాశాఖలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయవాడలో గురువారం ఉపాధ్యాయ సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల అటెండెన్స్ నమోదు కోసం రూపొందించిన యాప్ వినియోగంలో ఉన్న అపోహలు, ఎదురవుతున్న ఇబ్బందులపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. సమావేశం అనంతరం బొత్స మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు అందరూ ఈ ఫేస్ రికగ్నిషన్ యాప్‌నే వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగా తొలుత విద్యాశాఖలో దీనిని ప్రవేశపెట్టామన్నారు. అటెండెన్స్ యాప్ విషయంలో ఉపాధ్యాయులు ఎంతమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టంచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వమని మంత్రి అన్నారు. విద్యార్థుల బాగోగులు, మంచి ప్రమాణాలతో విద్యను అందించడమే లక్ష్యంగా, పూర్తి సానుకూల దృక్పథంతోనే విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని, వాటిని అమలుచేయడంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని అధిగమించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని బొత్స తెలిపారు. విద్యాశాఖలో ఉపాధ్యాయుల అటెండెన్స్‌కు సంబంధించిన యాప్ విషయంలో కొంత సమాచార లోపం వచ్చిందని.. దానిని సరిదిద్దే క్రమంలో ఆయా సంఘాలతో సమావేశం నిర్వహించి వారి సందేహాలను నివృత్తిచేసే చర్యలు చేపట్టామన్నారు. వారి అభ్యంతరాలను పరిగణనలోనికి తీసుకుని కొన్ని మార్పులు చేర్పులు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. పాఠశాలకు ఆలస్యంగా వస్తే ఆ రోజును సెలవుగా పరిగణిస్తారన్న ప్రచారంపై మంత్రి స్పష్టతనిస్తూ.. ఉద్యోగుల హాజరు విషయంలో ఏళ్ల తరబడి ఉన్న నిబంధనలనే అమలుచేస్తున్నామని, కొత్తగా ఏమీ చేర్చలేదన్నారు. మూడు సార్లకు మించి నాలుగోసారి ఆలస్యంగా వస్తే హాఫ్ డే లీవ్ కింద పరిగణించడం తప్ప కొత్త నిబంధనలేమీ పెట్టలేదని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్రంలో 1.83 లక్షల మంది ఉపాధ్యాయులు ఉంటే, ఇంతవరకు దాదాపుగా లక్ష మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారని, మిగిలిన వారందరూ కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని వినియోగాన్ని అలవాటు చేసుకునేందుకు 15 రోజులను ట్రైనింగ్ పీరియడ్‌గా పరిగణించాలని నిర్ణయించామన్నారు.

5 జూనియర్ కాలేజీలు క్లస్టర్ కళాశాలలుగా మార్పు

మరోవైపు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, నెల్లూరు, అనంతపురంలోని ఐదు జూనియర్ కాలేజీలను గుర్తించి వాటిని క్లస్టర్ జూనియర్ కాలేజీలుగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. వీటిల్లో వర్చువల్ క్లాస్ రూమ్స్, లాంగ్వేజ్‌ల్యాబ్స్, డిజిటల్ బోర్డ్స్ ఇతర ఆధునిక మౌలిక సదుపాయాల ఏర్పాటుపై చర్చించారు. ఇంటర్ విద్యాశాఖ సర్వీస్ అంశాలపై ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ప్రిన్సిపాళ్ల పదోన్నతుల సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా పలు ఆదేశాలు జారీచేశారు. కొత్తగా విశాఖపట్నంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి ఆమోదం తెలిపారు. నాడు–నేడు కింద ఉన్న అన్ని జూనియర్ కళాశాలల్లోని అన్ని తరగతులకు డిజిటల్ బోర్డుల ఏర్పాటుకు మంత్రి అంగీకరించారు. సమావేశంలో మండలి కార్యదర్శి శేషగిరిబాబు కూడా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నాయకులు

పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ విజయసాయిరెడ్డి


మద్దుల రాజాయాదవ్ నేతృత్వంలో పార్టీలో చేరినవారితో ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడు మద్దుల రాజాయాదవ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలు, బీసీ నాయకులు గురువారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలో వారికి విజయసాయిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పనిచేయాలని పార్టీలో చేరినట్టు మద్దుల రాజాయాదవ్ చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలలో పార్టీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషిచేస్తానని తెలిపారు.

అర్హులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ


వినతులు స్వీకరిస్తున్న ప్రవీణ్ ఆదిత్య

రంపచోడవరం: అర్హులైన అందరికీ పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింప చేస్తామని పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో పోలవరం ముంపు బాధితుల సమస్యలపై సబ్ కలెక్టర్ కట్టా సింహాచలంతో కలిసి గురువారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ.. దరఖాస్తులన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి ప్యాకేజీ వర్తింపజేస్తామని చెప్పారు. భూమికి సంబంధించిన మూడు దరఖాస్తులు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి 12 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

ఇక ఫ్యూజులు కాలవు

- విద్యుత్ సమస్యలకు ఎంసీసీబీతో చెక్
- నూతన సాంకేతికతను ప్రవేశ పెడుతున్న ఏపీసీపీడీసీఎల్
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు కాలిపోయే పరిస్థితి నుంచి విముక్తి
- తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి విజయవాడలో ఏర్పాటు
- తొలివిడతలో 40 వేల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద..


ఎంసీసీబీ అమర్చిన ట్రాన్స్ ఫార్మర్


ఎంసీసీబీ సర్క్యూట్

సాక్షి, అమరావతి: సీరియస్‌గా టీవీ సీరియల్ చూస్తున్నప్పుడు కరెంటు పోతే వచ్చే అసహనం అంతా ఇంతా కాదు. గాలిలేదు.. వానలేదు.. కరెంటెందుకు పోయిందోననుకుంటూ వెంటనే పక్కింటివాళ్లకు ఉందోలేదో చూస్తుంటాం. తీరా వీధిలో కొందరికి ఉండి మనతోపాటు కొందరికి లేదని గుర్తించాక అప్పుడు అర్థమవుతుంది.. ఫ్యూజు కాలిపోయిందని. వెంటనే కరెంట్ ఆఫీసుకు ఫోన్‌చేస్తే విద్యుత్ సిబ్బంది వచ్చి ఫ్యూజ్ ఏ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పోయిందో పరిశీలిస్తారు. కానీ ఎందుకు కాలిపోయిందో తెలియాలంటే మాత్రం ఆ లైన్లన్నీ వెదకాలి. దానికి చాలా సమయం పడుతుంది. ఇలాంటి ఇబ్బందులను తప్పించేందుకు, ప్రమాదాలను అరికట్టేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదే మినియేచర్ కాంటాక్ట్ సర్క్యూట్ బ్రేకర్ (ఎంసీసీబీ). విజయవాడలో ఎంసీసీబీల ఏర్పాటును మొదలుపెట్టారు. ప్రస్తుతం 40 వేల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వీటిని ఏర్పాటు చేస్తామని, దశలవారీగా డిస్కం పరిధిలోని అన్ని జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేస్తామని ఏపీసీపీడీసీఎల్ చెబుతోంది.

నాణ్యత, రక్షణ

విజయవాడలోని ముఖ్యకూడళ్లలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజు బాక్సుల స్థానంలో రెండువైపుల ఎంసీసీబీ ఉండే కేబుళ్లు అమర్చారు. విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడినప్పుడు ఇవి యాక్టివేట్ అవుతాయి. సమస్య ఉన్న లైనుకు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపేస్తాయి. లైనులో ఎక్కడ సమస్య వచ్చిందనే విషయాన్ని కూడా సూచిస్తాయి. దీంతో వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు అవకాశం కలుగుతుంది. మరోవైపు ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాల నివారణకు రక్షణ కంచె ఏర్పాటు చేయడం ఒక్కటే పరిష్కారమార్గంగా ఉంది. ఆ కంచె కూడా వివిధ కారణాల వల్ల పాడైపోతోంది. అది గమనించకుండా అటు వెళ్లిన మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడాల్సి వస్తోంది. ఎంసీసీబీ వ్యవస్థలో రెండువైపులా ఇన్సులేటెడ్ కేబుళ్లు ఉండటం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉండదు.

మేమే ముందు



ఒక్కో ఎంసీసీబీకి దాదాపు రూ.10 వేలు ఖర్చవుతోంది. వీటిని అతి తక్కువ ప్రదేశంలో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు రక్షణ లభించడంతోపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి వీలు కలుగుతుంది. దీంతో లైన్‌లాస్ తగ్గి అంతిమంగా డిస్కంకు, వినియోగదారులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. అదీగాకుండా తుప్పుపట్టిన ఇనుప ఫ్యూజుబాక్సుల స్థానంలో ఎంసీసీబీతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లు చూడ్డానికి బాగుంటాయి. నగర సుందరీకరణలో ఇవి కూడా భాగమవుతున్నాయి. ఏపీ, తెలంగాణల్లో ఎంసీసీబీలను మా డిస్కంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చాం.

– జె.పద్మాజనార్దనరెడ్డి, సీఎండీ, ఏపీసీపీడీసీఎల్

20 నుంచి దూరదర్శన్ సప్తగిరిలో 'స్వరాజ్యం'

దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రంగనాథం వెల్లడి



సాక్షి, అమరావతి/విజయవాడ కల్చరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా జాతీయోద్యమం, మహనీయుల జీవితాలు, వారి త్యాగాలతో నిర్మించిన 'స్వరాజ్యం' అనే మెగా సీరియల్‌ను ఈ నెల 20 నుంచి తెలుగులో ప్రసారం చేయనున్నట్లు విజయవాడ దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.రంగనాథం తెలిపారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సీరియల్ ప్రసారాన్ని ఈనెల 5న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారని.. హిందీలో ప్రసారం అవుతోందని తెలిపారు. ఈనెల 20 నుంచి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, ఒడియా, అస్సామీలో కూడా ప్రసారం కానుందని చెప్పారు. తెలుగులో సప్తగిరి చానల్‌లో ప్రతి శనివారం రాత్రి 8 నుంచి 9 గంటల వరకు 75 వారాల పాటు ప్రసారం చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి 8 గంటలకు.. బుధ, గురువారాల్లో మధ్యాహ్నం 2 గంటలకు కూడా ప్రసారం చేస్తామన్నారు. త్వరలో ఓటీటీలోకి కూడా ఈ సీరియల్‌ను తీసుకువచ్చే అవకాశముందన్నారు. స్వరాజ్యం సీరియల్ ఆడియో వెర్షన్.. ఆలిండియా రేడియోలో ప్రతి శనివారం ఉదయం 11 గంటలకు ప్రసారం చేస్తామని ప్రోగ్రామ్ హెడ్ వసుమతి రాజన్ తెలిపారు.

డాక్టర్ సుందరాచారికి అరుదైన గౌరవం

ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీకి ఎన్నిక



లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్వీ.సుందరాచారికి అరుదైన గౌరవం దక్కింది. న్యూరాలజీ విభాగంలో రెండున్నర దశాబ్దాలుగా అందిస్తోన్న సేవలకు గాను 'ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ' (ఎఫ్ఏఏఎన్)కు ఆయన ఎన్నికయ్యారు. న్యూరాలజీ విభాగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ఇలాంటి గౌరవం దక్కుతుంది. ఎఫ్ఏఏఎన్‌కు న్యూరాలజిస్ట్‌గా రోగులకు అందించిన సేవలు, బోధనా నైపుణ్యాలు, పరిశోధనలు, కమ్యూనికేషన్స్, విభాగాల అభివృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. సుందరాచారి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో న్యూరాలజీ హెచ్‌వోడీగా ఉన్న సమయంలో స్లీప్ ల్యాబ్‌తో పాటు, స్ట్రోక్ యూనిట్‌ను అభివృద్ధి చేశారు. న్యూరాలజీలో 4 పీజీ సీట్లు కూడా తీసుకువచ్చారు. ఈ క్రమంలో సుందరాచారిని ఫెలోగా ఎంపిక చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ వద్ద గతంలో ఫెలోగా ఎన్నికైన ఇద్దరు వైద్యులు సిఫార్సు చేశారు. దీంతో అక్కడ నిపుణుల బృందం అన్ని కోణాల్లో పరిశీలించి డాక్టర్ సుందరాచారిని ఎఫ్ఏఏఎన్‌గా ఎంపిక చేసింది. భారత్‌లో ఈ గుర్తింపు అతికొద్ది మందికి మాత్రమే ఉంది.

వైఎస్సార్ బీమాతో పీఎంఎఫ్‌బీవై అనుసంధానం

రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ సమావేశంలో నిర్ణయం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఈ–క్రాప్ ప్రామాణికంగా నోటిఫైడ్ పంటలు సాగు చేసే రైతులందరికీ వైఎస్సార్ ఉచిత పంటల బీమాతో అనుసంధానిస్తూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను అమలుచేస్తున్నట్లు పీఎంఎఫ్‌బీవై సీఈఓ, జాయింట్ కమిషనర్ (క్రెడిట్) రితేష్ చౌహాన్ వెల్లడించారు. రెండేళ్లగా ఈ–క్రాప్ ఆధారిత వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అధ్యయనం చేశామన్నారు. ఈ–క్రాప్ నమోదుతో పాటు ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో ఏపీలో అందిస్తున్న సేవలు ఆదర్శనీయంగా ఉన్నాయన్నారు. 2022–23 వ్యవసాయ సీజన్‌లో డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం–పీఎంఎఫ్‌బీవై అమలుకు సంబంధించిన విధి విధానాలు, కార్యాచరణ రూపకల్పనపై చర్చించేందుకు మంగళగిరిలోని ఏపీఐఐసీ సమావేశ మందిరంలో రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ సమావేశం గురువారం వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ కమిషనర్ పూనమ్ మాలకొండయ్య అధ్యక్షతన జరిగింది. వివిధ బీమా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన ఈ సమావేశంలో రితేష్ చౌహాన్ మాట్లాడుతూ.. సీఎం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని పీఎంఎఫ్‌బీవై అమలుపై జాతీయ స్థాయిలో పలు మార్పులు చేశామన్నారు.

పకడ్బందీగా ఉచిత పంటల బీమా

పూనం మాలకొండయ్య మాట్లాడుతూ.. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానిస్తూ పకడ్బందీగా అమలుచేస్తున్నామని చెప్పారు. వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ మాట్లాడుతూ.. 2020, 2021లలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద రైతులకు పంటల బీమా క్లెయిమ్‌లు చెల్లించామన్నారు. కేంద్ర అభ్యర్థన మేరకు ఇక నుంచి ఈ పథకాన్ని డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం–పీఎంఎఫ్‌బీవైగా నామకరణం చేసి అమలుచేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పథకం అమలుపై త్వరలో టెండర్లు పిలవబోతున్నామన్నారు. నోటిఫైడ్ పంటలు వేసుకున్న రైతులు క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేసుకుంటే చాలు ఈ పంటల బీమా పథకం వారికి వర్తిస్తుందన్నారు.

సంక్షేమాభివృద్ధికి సలాం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం ఉత్సాహంగా కొనసాగింది. గ్రామ గ్రామానా ప్రజలు ఎదురేగి నాయకులకు స్వాగతం పలికారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఇంటికి వచ్చి సమస్యల గురించి అడుగుతుండటంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని సమస్యల పరిష్కారంపై నాయకులు అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేశారు.


శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరించి బ్రోచర్ అందజేస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి


విశాఖ జిల్లా భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంలో లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో మహిళకు సంక్షేమ కరపత్రం అందజేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఇక గురి తప్పదు !

దేశంలోనే తొలిసారిగా విశాఖలో కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్

సాక్షి, విశాఖపట్నం : లక్ష్యం.. శత్రువు.. ఎంత దూరంలో ఉన్నా టార్గెట్ మిస్ కాకూడదు. ఎదురు దాడి చేసేందుకు శత్రువుకు మరో అవకాశం ఇవ్వకూడదు. బుల్లెట్ దిగిందా.. లేదా.. అనే సందేహం లేకుండా టార్గెట్ ఫినిష్ చేయడమే లక్ష్యంగా భారత నావికాదళం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. సైనికులు తమ లక్ష్య ఛేదనలో రాటుదేలేలా దేశంలోనే తొలి కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్(సీఐఎస్ఆర్)ని విశాఖపట్నంలోని తూర్పు నావికాదళ ప్రధాన కేంద్రంలో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఐఎన్ఎస్ కర్ణ బేస్‌లో ఆరు లైన్లతో లైవ్ ఫైరింగ్ రేంజ్‌ని నిర్మించింది.

స్కిల్స్ పెంపొందించడం కోసం..

నావికాదళ సభ్యులకు ఫైరింగ్ స్కిల్స్ పెంపొందించడం కోసం భారత నావికాదళం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో లైవ్ ఫైరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసింది. ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రికార్డు సమయంలో 120 రోజుల్లోనే ఈ కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్(సీఐఎస్ఆర్)ని నిర్మించడం విశేషం. ప్రతిష్టాత్మక ఈ షూటింగ్ రేంజ్‌ని గురువారం ఈఎన్సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా లాంఛనంగా ప్రారంభించారు.

సీఐఎస్ఆర్ విశేషాలివీ..

దేశంలో కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌ని ఏర్పాటు చేసిన తొలి సైనిక విభాగంగా ఐఎన్ఎస్ కర్ణ రికార్డు సృష్టించింది. సీఐఎస్ఆర్ ఏర్పాటుతో తూర్పు నావికాదళ సిబ్బంది షూటింగ్ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడనుంది. ఈ సీఐఎస్ఆర్‌లో 25 మీటర్ల రేంజ్‌లో ఆరు లైన్లని ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని ఎయిర్ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో నియంత్రించే విధంగా నిర్మించారు. నౌకాదళం వినియోగిస్తున్న ప్రైమరీ, సెకండరీ ఆయుధాలను ఎలా వినియోగించాలనేది సీఐఎస్ఆర్ ద్వారా నేర్చుకునే అవకాశం ఉంటుంది.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం : 19 : ఆగస్టు : 2022



విజేతలకు అవార్డులు

కృష్ణలంక: విజయవాడ బాలోత్సవం భవన్‌లో గురువారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలకు అవార్డులు అందజేశారు.



సభా ప్రాంగణంలో చేనేత స్టాల్స్

సీఎం వైఎస్ జగన్ హాజరయ్యే బహిరంగ సభా ప్రాంగణంలో చేనేత, కలంకారి స్టాళ్లు ఏర్పాటు చేయాలని అధికారులను చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునిత ఆదేశించారు. -8లో▸



క్రీడా స్ఫూర్తి.. భవితకు దీప్తి

డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో హెల్త్ యూనివర్సిటీ 22వ ఇంటర్ కాలేజ్ ఉమెన్ గేమ్స్ మీట్‌ను వర్సిటీ వీసీ డాక్టర్ శ్యాంప్రసాద్ ప్రారంభించారు. -8లో▸

కృష్ణా నదిలో కొనసాగుతున్న వరద ప్రవాహం



జలహోరు

కృష్ణా డెల్టాకు పుష్కలంగా సాగునీరు



కంకిపాడు మండలం ఉప్పలూరు గ్రామంలో కళకళలాడుతున్న వరి చేలు

- నిరంతరాయంగా కృష్ణానదిలో నీటి ప్రవాహం
- రెండేళ్లుగా పట్టిసీమ నీరే అవసరం రాని వైనం
- ఈ ఏడాది జూన్ 10వ తేదీ నుంచే కాలువలకు సాగు నీటి విడుదల
- ఇప్పటికే కృష్ణా డెల్టాలో 80 శాతానికి పైగా వరినాట్లు



నా పేరు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి. పామర్రు గ్రామంలో 1.5 ఎకరాల సొంత భూమి ఉంది. మరో 40 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా. గత ప్రభుత్వంలో సాగునీరు సరిగా అందేది కాదు. పంట చేలకు నీటి తడులు అందించేందుకు ఆయిల్ ఇంజిన్లను ఆశ్రయించాల్సి వచ్చేది. ఫలితంగా సాగు ఖర్చులు పెరిగేవి. నీటి ఎద్దడితో సరైన దిగుబడులు రాక పండిన పంటకు గిట్టుబాటు ధర లేక, విక్రయించే పరిస్థితి లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాగునీటి కొరత లేదు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎన్నో రకాల సేవలు అందుతున్నాయి. ఇప్పుడు వ్యవసాయం పండగలా మారింది.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా డెల్టా పచ్చందాలు అద్దుకుంది. ఎటుచూసినా పంట పొలాలు కళకళలాడుతూ కనువిందు చేస్తున్నాయి. అదునుకు కురుస్తున్న వర్షాలు.. ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణమ్మ డెల్టాను సస్యశ్యామలం చేసింది. పట్టిసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు నీరు అవసరమే లేకుండా పంట కాలువలు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. రైతులు రెట్టించిన ఉత్సాహంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

అప్పుడు కష్టం.. ఇప్పుడు సంబరం

తెలుగుదేశం పార్టీ ఐదేళ్ల పాలనలో కృష్ణా డెల్టా తీవ్ర సాగునీటి ఎద్దడి ఎదుర్కొంది. పంట కాలువలకు సాగునీటిని ఆలస్యంగా వదిలేవారు. ఆ నీరు అరకొరే కావడంతో ఆయిల్ ఇంజిన్లతో పొలాకు మళ్లించాల్సి వచ్చేది. పంట చేతికి వచ్చే సమయంలో తుపానులు చుట్టుముట్టి నష్టాలు మిగిల్చేవి. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ప్రకాశం బ్యారేజీకి మళ్లించినా డెల్టా అవసరాలు తీరేవి కావు. ఇదంతా గతం. ఇప్పుడు ఖరీఫ్ సాగుకు కృష్ణా నది నీరే జీవ జలంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూన్ పదో తేదీనే కాలువలకు సాగు నీరు విడుదల చేశారు. కృష్ణా డెల్టా పరిధిలో ఇప్పటికే 80 శాతానికి పైగా వరినాట్లు పూర్తయ్యాయి.

వరిసాగు ముమ్మరం

జిల్లాలో ఈ ఏడాది కాలువలకు ముందుగానే నీరు విడుదల చేయడంతో వరి నాట్లు తుది దశకు చేరాయి. కృష్ణా జిల్లాలో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1,82,861 హెక్టార్లు. 1,71,076 హెక్టార్ల వరి సాగయ్యేది. ఈ ఖరీఫ్‌లో ఇప్పటికే 1,39,595 హెక్టార్లలో వరి సాగవుతోంది. ఈ నెలాఖరు నాటికి వరి నాట్లు వంద శాతం పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 25,099 హెక్టార్లలోనే వరి సాగవడం గమనార్హం. వరి ముందుగా సాగవటం వల్ల తుపానులు సంభవించే నాటికి పంట చేతికి అందుతుంది. రెండో పంట (రబీ)గా మినుము, పెసరను ముందుగా సాగు చేయడం వల్ల దిగుబడులు పెరుగుతాయి. ఆ తరువాత వేసవి పంటలను సాగుచేసుకునే అవకాశం ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువకు సైతం నీరు విడుదల చేయడంతో ఎన్టీఆర్ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సైతం రైతులు వరి సాగుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల ఇలా... (టీఎంసీల్లో)

సంవత్సరం	సముద్రంలోకి విడుదలచేసిన నీరు	కాలువలకు ఇచ్చిననీరు
2018–19	39.04	153.05
2019–20	797.13	178.80
2020–21	1278.12	182.48
2021–22	501.36	170.36
2022–23	192.82	37.82

(జూన్‌నుంచి ఇప్పటివరకు)



పుష్కలంగా నీరు



కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు పుష్కలంగా సాగు నీటిని విడుదల చేస్తున్నాం. ఇంత వరకు పట్టిసీమ పంపులను ఆన్‌చేయాల్సిన అవసరం రాలేదు. కృష్ణా నదిలో జూన్ నుంచే ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. కాలువలకు అవసరమైన మేర నీరు విడుదల చేస్తున్నాం. చివరి ఆయకట్టుకూ ఇబ్బంది లేకుండా నీటిని పంపిణీ చేస్తున్నాం.

– తిరుమలరావు, ఎస్‌ఈ, నీటిపారుదల శాఖ, విజయవాడ

అధిక దిగుబడులు వస్తాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రారంభం నుంచి వర్షాలు సకాలంలో పడుతున్నాయి. ప్రభుత్వం కాలువల ద్వారా పంట పొలాలకు పుష్కలంగా సాగునీటిని అందిస్తోంది. కృష్ణా డెల్టాలోని వరి పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా దిగుబడులు వస్తాయని రైతులు అందరం ఆశిస్తున్నాం.

– బి.మాధవరెడ్డి, రైతు, పామర్రు



పారదర్శక సేవలకు ఐఎస్‌ఓ గుర్తింపు

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీని వరించిన ఐఎస్‌ఓ 9001:2015, ఐఎస్‌ఓ 14001:2015 సర్టిఫికెట్లు
- దేశంలోనే ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన తొలి హెల్త్ యూనివర్సిటీగా గుర్తింపు
- అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, రీసెర్చ్ విభాగాల్లో నాణ్యమైన సేవలు



ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులను అభినందిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పారదర్శక సేవలు అందిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఐఎస్‌ఓ గుర్తింపు లభించింది. దేశంలోని ఆరోగ్య విశ్వ విద్యాలయాల్లో తొలి సారిగా ఐఎస్‌ఓ గుర్తింపు పొంది ఘనకీర్తి దక్కించుకుంది. అడ్మిషన్లు, అకడమిక్, రీసెర్చ్, ఎగ్జామ్స్ తదితర విభాగాల్లో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంతోపాటు సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుంది. వీటన్నింటిని గుర్తించిన ఐఎస్‌ఓ సర్టిఫికెషన్ బృందం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఐఎస్‌ఓ 9001:2015 గుర్తింపు వచ్చింది. అంతేకాదు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, వర్షపు నీటి నిర్వహణ వంటి అంశాల్లో ఐఎస్‌ఓ 14001:2015 గుర్తింపు దక్కింది. ఈ రెండు సర్టిఫికెట్లను యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చేతుల మీదుగా వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావుకు ఐఎస్‌ఓ సర్టిఫికెషన్ అధికారి శివయ్య అందజేశారు.

అడ్మినిస్ట్రేషన్‌లో మేటి

రెండు నెలల కిందట రిటైర్డ్ జిల్లా జడ్జితో కలిసి నలుగురు సభ్యుల బృందం ఐఎస్‌ఓ సర్టిఫికెషన్ కోసం హెల్త్ యూనివర్సిటీలో పరిశీలన జరిపింది. అకడమిక్, అడ్మిషన్లు, ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్, ఇంజినీరింగు, ఐటీ డిపార్ట్‌మెంట్, డిజిటల్ లైబ్రరీ, స్టోర్స్ వంటి విభాగాలను ఆ బృందం సందర్శించింది. ఆయా విభాగాల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించిన బృందం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు గుర్తించి ఐఎస్‌ఓ సర్టిఫికెషన్‌కు సిఫార్సు చేసింది. ఎలాంటి అవకతవకలకూ తావు లేకుండా అడ్మిషన్లు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించింది.

పర్యావరణ పరిరక్షణలో...

అడ్మినిస్ట్రేషన్లలో పారదర్శకంగా వ్యవహరించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలోనూ హెల్త్ వర్సిటీ ముందంజలో ఉంది. యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటి పచ్చదనం పెంచడంతోపాటు, వర్షపు నీరు వృథా కాకుండా నేలలో ఇంకిపోయే వసతి కల్పించారు. విద్యుత్ ఆదా చేసేందుకు సోలార్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలకు గాను మరో ఐఎస్‌ఓ సర్టిఫికెట్ లభించింది.

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రజని ప్రశంసలు

ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన సేవలు అందిస్తూ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఐఎస్‌ఓ సర్టిఫికెషన్ పొందడంతో వర్సిటీ అధికారులను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ప్రశంసించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ వైద్య విద్యలో మరిన్ని సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. ఐఎస్‌ఓ వంటి అరుదైన గుర్తింపు లభించడం సంతోషకరమన్నారు.

ఐఎస్‌ఓ గుర్తింపుతో గౌరవం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1986లో ఏర్పాటు చేసిన డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వ విద్యాలయంగా గుర్తింపు ఉంది. ఇప్పుడు దేశంలో ఉన్న ఆరోగ్య విశ్వ విద్యాలయాల్లో మొదటగా ఐఎస్‌ఓ సర్టిఫికెషన్ పొంది మరో గౌరవాన్ని దక్కించుకుంది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా అడ్మిషన్లను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. రీసెర్చ్, ఎగ్జామ్స్ విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం. మేము అందిస్తున్న సేవలకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ లభించడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్, వైస్ చాన్స్‌లర్, హెల్త్ యూనివర్సిటీ

సచివాలయాల్లో ఆధార్ సేవలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సచివాలయ సిబ్బందికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లు అందజేసిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆధార్‌లో మార్పులు, చేర్పుల ప్రక్రియను గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్‌లో సచివాలయ సిబ్బందికి గురువారం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ప్రజలు పోస్టాఫీసులు, కార్వే సెంటర్, మీ–సేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఆయా కేంద్రాలకు వెళ్లేందుకు దూర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని పేర్కొన్నారు. సచివాలయాల్లో ఆధార్ సేవలను తీసుకొచ్చి మార్పులు, చేర్పుల ప్రక్రియను సులభతరం చేశామని వివరించారు. జిల్లాలో ఇప్పటికే పది సచివాలయాల ద్వారా ఆధార్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. మరో 55 సచివాలయాల్లో ఈ ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించామని పేర్కొన్నారు. విజయవాడలో 25, రూరల్ మండలంలో నాలుగు సచివాలయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మిగిలిన చోట్ల మండలానికి రెండు సచివాలయాలలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జగ్గయ్యపేట మండలంలోని తక్కెళ్లపాడు సచివాలయం ద్వారా అత్యాధునిక డిజిటల్ సర్వీసులను అందించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన డిజిటల్ అసిస్టెంట్ కె.జయస్వరూప్‌ను కలెక్టర్ ఢిల్లీరావు అభినందించి ప్రసంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి బి.వి.రామకృష్ణ, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.అనూరాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

పోలీస్ కమిషనర్ టి.కె.రాణా

విజయవాడ స్పోర్ట్స్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లాలో భక్తులు ఏర్పాటు చేసుకునే పందిళ్లు, మండపాలకు శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ముందస్తుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలని పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సూచించారు. విజయవాడలోని సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పక్కనున్న పోలీస్ సేవా కేంద్రం(యూపీఎస్‌సీ)లో నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యాలయంలో సిబ్బంది ప్రతి రోజూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటలకు వరకు దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో కృష్ణాష్టమి

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. శుభకృత్ నామ సంవత్సర బహుళ అష్టమి శుక్రవారం దేవస్థాన ప్రాంగణంలో కృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. గోపూజ కూడా నిర్వహిస్తారు. రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడికి షోడశోపచార పూజలు చేస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాజగోపురం ఎదుట దేవస్థాన పురాణ పండితులతో ఉపన్యాసం, సాయంత్రం 6.30 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం జరుగుతాయని పేర్కొన్నారు.

ఉట్టిపడిన ఉత్సవం



విజయవాడ ఇస్కాన్ టెంపుల్ వద్ద ఉట్టి ఉత్సవం





చిలిపి చేష్టల చిన్ని కృష్ణులు.. ముద్దులొలికే చిట్టి గోపికల వేషధారణతో కృష్ణాష్టమి శోభ ముందే వచ్చింది. చూడముచ్చటైన చిన్ని కృష్ణుడి విగ్రహాలు విక్రయాల కోసం ముఖ్య కూడళ్లలో కొలువుదీరాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో గురువారమే కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉట్టికొట్టే వేడుకలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మాజీ మేయర్ గోవిందరాజులు కన్నుమూత



గోవిందరాజులు (ఫైల్)

భవానీపురం (విజయవాడ పశ్చిమ): మాజీ మేయర్ లంకా గోవిందరాజులు (91) గురువారం కన్నుమూశారు. విద్యాధరపురం కబేళా సెంటర్‌లో తన కుమారులతో కలిసి ఉంటున్న ఆయన మధ్యాహ్నం రెండు గంటలకు తుది శ్వాస విడిచారు. వృద్ధాప్య సమస్యలతో మూడేళ్లుగా బాధపడుతున్నారు. గోవిందరాజులుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి శశిరేఖ గతంలోనే కన్నుమూశారు. విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పడిన అనంతరం 1981లో జరిగిన తొలి కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన 27వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచారు. 1984–85లో మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మూడు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికైన గోవిందరాజులు స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా, డెప్యూటీ మేయర్‌గా, మేయర్‌గా సేవలు అందించారు.

దాసరి భవన్‌లో నివాళులు

గోవిందరాజులు భౌతికకాయాన్ని సాయంత్రం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు సీపీఐ నగర కార్యాలయం దాసరి భవన్ వద్ద ఉంచారు. పార్టీ నాయకులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, పి.దుర్గా భవాని, వై.చెంచయ్య, సీహెచ్ కోటేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు ఆయన భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, సీపీఎం నేతలు సీహెచ్ బాబూరావు, ఉమామహేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంతాపం తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం : ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో చేరేందుకు రెండో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ చేపట్టామని కౌన్సెలింగ్ కన్వీనర్ కనకారావు గురువారం తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 24 తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 0866–2475575, 94906 39639, 91602 49343 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాఫ్ట్‌బాల్ ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లు ఎంపిక


సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి కృష్ణాజిల్లా బాల బాలికల జట్లు

అవనిగడ్డ: ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ జట్లను గురువారం ఎంపిక చేశారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శి మత్తి హరగోపాల్, కాకర్ల పవన్ కుమార్ పర్యవేక్షణలో సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి పటిష్ట బందోబస్తు

కోర్టు నూతన భవన సముదాయాన్ని పరిశీలించిన సీపీ టీ.కె.రాణా


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ టి.కె.రాణా

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ సూర్యారావుపేటలో నూతనంగా నిర్మించిన జిల్లా కోర్టు నూతన భవన సముదాయ ప్రారంభోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. నూతనంగా నిర్మించిన భవన సముదాయ ప్రాంగణాన్ని సీపీ రాణా గురువారం పరిశీలించారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించి బందోబస్తుపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20వ తేదీ శనివారం జరిగే కోర్టు భవనాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తారన్నారు. వీరితో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ప్రముఖులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. మిగిలిన శాఖల అధికారులను సమన్వయం చేసుకుని భద్రతా లోపానికి తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కోర్టు న్యాయమూర్తి అరుణ సారిక, ఎంఎస్‌జే కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి శ్రీనివాసఆంజనేయమూర్తి, డీసీపీలు విశాల్‌గున్ని, సీఎస్ డబ్ల్యు డీసీపీ ఉదయరాణి, ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ మోహన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్, ఏడీసీపీలు, ఏసీపీలు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేసేందుకు ఆమోదం తెలిపిందని డీఈవో తాహెరాసుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నైట్ కాలేజీల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు రాష్ట్రస్థాయి అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తగిన ధ్రువీకరణ పత్రాలతో అర్హత కలిగి, ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను సంబంధిత తనిఖీ అధికారులతో సిఫార్సు చేసి, తగిన ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయంలో అందజేయాలన్నారు. మెయిల్ ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలించమని చెప్పారు.

తిరిగిరాని పయనం

- ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు స్నేహితులు దుర్మరణం
- పెట్రోలు లీకై వ్యాపించిన మంటల్లో బైక్ దగ్ధం
- మృతుల కళ్లు దానం చేసిన తల్లిదండ్రులు


కారు ఢీకొన్న ప్రమాదంలో దగ్ధమవుతున్న బైక్


స్నేహితులు చిన్నం ప్రశాంత్, షేక్ బాషా (ఫైల్)

జూపూడి(ఇబ్రహీంపట్నం): అమ్మా.. వెళ్లొస్తా అంటూ కాలేజీకి బయలు దేరిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు.. స్నేహితుడిని కళాశాల వరకూ దింపుదామనుకున్న మరో యువకుడు మధ్యలోనే పయనాన్ని ముగించేశాడు. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది.

మలుపు తిరుగుతున్న సమయంలో..

జూపూడి గ్రామానికి చెందిన షేక్ బాషా (19), చిన్నం ప్రశాంత్ (18) బైక్‌పై ఇబ్రహీంపట్నం వైపు వెళ్లేందుకు గ్రామంలోని డివైడర్ మధ్య మలుపు తిరుగుతున్నారు. ఈ సమయంలో వేగంగా దూసుకొచ్చిన కారు వీరి బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో పెట్రోల్ లీకై బైకు దగ్ధమైంది. బైకుపై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడి తీవ్రగాయాల పాలయ్యారు. వీరిని స్థానిక నిమ్రా వైద్యశాలకు తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం గొల్లపూడిలో ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మరణంలోనూ వీడని స్నేహం..

జూపూడి భీమేశ్వర కాలనీకి చెందిన చిన్నం శేఖర్, గాయత్రి కుమారుడు ప్రశాంత్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఇంటి సమీపంలోని షేక్ బాజీ కుమారుడు షేక్ బాషాతో ప్రశాంత్ స్నేహం చేస్తున్నాడు. ప్రశాంత్ కళాశాలకు వెళ్లేందుకు ఉదయం బయలుదేరగా అటు వైపు వెళ్తున్న స్నేహితుడు బాషా బైక్‌పై ఎక్కాడు. ఇరువురు తల్లిదండ్రులకు టాటా చెప్పిన 5 నిమిషాల్లోనే గ్రామంలో ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రయోజకులై ఆదుకుంటారనుకున్న బిడ్డలు కళ్లముందే మృతి చెందడంతో శోక సముద్రంలో మునిగిపోయారు. ఎస్ఐ శ్రీనివాస్ మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు, ఆ కారు డ్రైవర్ పోలీసులు అదుపులో ఉన్నారు.

మృతి చెందిన యువకుల కళ్లు దానం..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితులు షేక్ బాషా, చిన్నం ప్రశాంత్ కళ్లను తాడిగడపకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు దానం చేశారు. మృతుల తల్లిదండ్రులు షేక్ బాజీ, షహీనా, శేఖర్, గాయత్రీ అంగీకారం మేరకు ఎల్‌వీ వైద్యశాల వైద్య సిబ్బంది మృతుల కళ్లను సేకరించారు. తమ బిడ్డలు ఈలోకంలో లేకపోయినా వారి నేత్రాలతో కొందరికి కంటిచూపు కలుగుతుందనే ఆశాభావం తల్లిదండ్రులు వ్యక్తం చేశారు.

• బీసీ సంక్షేమ సౌధం

రాష్ట్రంలో బీసీల ఆత్మ గౌరవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ పరిధిలోని బీసీ సంక్షేమ భవనం. 139 బీసీ కులాలకు గానూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్లకు సంబంధించిన చైర్మన్‌లు, అధికారులు అందరూ ఈ భవనంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటారు. మొత్తం 13,340 ఎస్ఎఫ్‌టీ వర్కింగ్ స్పేస్ ఉన్న ఈ భవనంలో ఐదు ఫ్లోర్లు ఉన్నాయి. ప్రతి ఫ్లోర్‌లో 12 మంది చైర్మన్లకు చాంబర్లు, బీసీ సంక్షేమ శాఖకు చెందిన ఏడుగురు అధికారుల చాంబర్లు, దాదాపు 100 మందికి సరిపోయే మినీ కాన్ఫరెన్స్ హాల్ ఉన్నాయి. టాప్ ఫ్లోర్ టెర్రస్‌పై 300 మంది పట్టే కాన్ఫరెన్స్ హాల్ ఉంది.

- భవానీపురం(విజయవాడ పశ్చిమ)


గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవనం, (ఇన్‌సెట్) బీసీ సంక్షేమ భవన్‌లో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ఉండే చాంబర్‌లు ఇవి

క్రీడా స్ఫూర్తి.. భవితకు దీప్తి

- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ శ్యాం ప్రసాద్
- వర్సిటీ 22వ ఉమెన్ గేమ్స్ మీట్ ప్రారంభం


ఉమెన్స్ గేమ్స్ మీట్ ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ శ్యాం ప్రసాద్, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు

గన్నవరం రూరల్: ప్రతి ఒక్కరికీ క్రీడా స్ఫూర్తి అవసరమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యాం ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో హెల్త్ యూనివర్సిటీ 22వ ఇంటర్ కళాశాలల ఉమెన్ గేమ్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వీసీ మాట్లాడుతూ హెల్త్ వర్సిటీ క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. క్రీడా స్ఫూర్తితో భవిష్యత్‌లో రాణించి ఉత్తమ విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు వీసీ, సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు ఎదుట మార్చ్ నిర్వహించి, క్రీడా ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలోని 29 మెడికల్ కళాశాలలు, 24 డెంటల్ కళాశాలలు నుంచి వచ్చిన 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

తొలి రోజు పోటీలు ఇలా..

మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో తొలి రోజు గురువారం బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల జట్టు ఆంధ్ర మెడికల్ కళాశాల జట్టుపై గెలుపొందగా.. టేబుల్ టెన్నిస్‌లో డాక్టర్ సుధా నాగేశ్వరరావు డెంటల్ కళాశాల జట్టు సిబార్ కళాశాల జట్టుపై.. జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ జట్టు నారాయణ డెంటల్ జట్టుపై విజయం సాధించిందని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. అలాగే త్రోబాల్‌లో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు విష్ణు డెంటల్ కళాశాల జట్టుపై.. ఎస్ఎంసీ విజయవాడ జట్టు నారాయణ మెడికల్ కళాశాల జట్టుపై విజయ ఢంకా మోగించిందని చెప్పారు. జెమ్స్ శ్రీకాకుళం జట్టు సిబార్ డెంటల్ గుంటూరుపై.. అనిల్ నీరుకొండ డెంటల్ జట్టు శ్రీ వెంకటేశ్వర జట్టుపై విజయం సాధించాయని ఆయన వివరించారు.

విజేతలకు అభినందన

ఇటీవల విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రోలర్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు గెలుచుకున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రోలర్ స్పోర్ట్స్ జట్లను వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యాం ప్రసాద్ ఈ కార్యక్రమం ప్రారంభంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు ప్రత్యేక అతిథిగా పాల్గొని క్రీడాకారులకు సందేశమిచ్చి వారిని పరిచయం చేసుకున్నారు. అకాడమీ కార్యదర్శి పి.లక్ష్మణరావు, డాక్టర్ పిసిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవి తదితరులు పాల్గొన్నారు.

సభా ప్రాంగణంలో చేనేత స్టాల్స్

అధికారులకు చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత ఆదేశం


సీఎం సభా ప్రాంగణం వద్ద అధికారులతో మాట్లాడుతున్న సునీత, రఘురాం, కలెక్టర్ రంజిత్

పెడన : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభా ప్రాంగణంలో చేనేత, కలంకారి స్టాల్స్ ఏర్పాటు చేయాలని చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, చేనేత జౌళి శాఖ కమిషనర్ ఎం.ఎం.నాయక్, కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాలతో కలిసి తోటమూలలోని సీఎం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు ఇస్తూ దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం నాలుగో విడత నిధులు పంపిణీ చేస్తారని చెప్పారు. అందుకు ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ వద్ద చేనేత, కలంకారి స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఏడీ రఘునందను ఆదేశించారు. రూట్ మ్యాప్‌ను పరిశీలించిన ఆమె భద్రత విషయంలో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జాషువాకు సూచించారు. వీఐపీలు, ఇతర వాహనాల పార్కింగ్ ప్రాంతాలను స్పష్టంగా తెలియజేసేలా సూచిక బోర్డులను, సభకు హాజరయ్యే వారికి తాగునీరు, పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. అంతా కలిసి సీఎం సభను విజయవంతం చేయడానికి కలిసికట్టుగా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కిషోర్, పద్మావతి, విజయ్‌కుమార్, ఇన్‌చార్జి డీపీవో జీవీ సూర్యనారాయణ, డీఎస్పీ మసూంబాషా, తహసీల్దార్లు మధుసూదనరావు, గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్ను రాణి పాల్గొన్నారు.

అసభ్య వీడియోలతో బెదిరింపులు.. ఇద్దరు అరెస్ట్

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ఓ మహిళ న్యూడ్ వీడియోతో వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం మచిలీపట్నం దిశ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజమండ్రికి చెందిన ఓ మహిళ తన వ్యాపార అవసరాల కోసం ఫైనాన్స్ వ్యాపారి హన్సకుమార్‌ని కొంత నగదు అప్పు అడగ్గా.. అతను న్యూడ్ వీడియో కాల్ చేస్తే ఇస్తానని చెప్పాడు. దీంతో ఆ మహిళ తప్పని పరిస్థితుల్లో న్యూడ్ వీడియో చాట్ చేసింది. దీన్ని స్క్రీన్ రికార్డు చేసిన హన్సకుమార్ దాన్ని విజయవాడ కానూరులోని తన బంధువు చందుకు షేర్ చేయగా అతను ఆ వీడియోని పోర్న్ వెబ్‌సైట్‌లో పెట్టి బ్లాక్ మెయిల్‌కు దిగాడు. దీంతో బాధిత మహిళ మచిలీపట్నం దిశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరినీ అరెస్ట్ చేసినట్టు దిశ డీఎస్పీ రాజీవ్ కుమార్ మీడియాకు తెలిపారు.

విద్యుత్ స్తంభాలను తొలగించండి


పెడన : హెలి ప్యాడ్ స్థలం సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తాత్కాలికంగా తొలగించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా విద్యుత్‌శాఖాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పెడన శివారు, బందరు మండలం హుస్సేన్‌పాలెం శివారులో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్‌ను సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్‌తో కలిసి పరిశీలించారు. హెలి ప్యాడ్ నుంచి ప్రధాన రహదారి వరకు రోడ్డు నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 19-8-2022

ఫ్యాషన్

ఆభరణ మోహనం






టెంపుల్ జ్యువెలరీ
దేవతామూర్తుల ఆభరణాలలో రాధా కృష్ణుల రూపుతో ఉండే నెక్లెస్‌లు, హారాలు చూడగానే ముచ్చటగొలుపుతుంటాయి. నెమలి పింఛాల అందం, మురళీలోలుడుగా దర్శనమిచ్చే డిజైన్లు అన్నింటికన్నా ముందుంటాయి. అందుకు గోపికా వల్లభుడిలో ఉండే ఆకర్షణ అసలైన కారణం.



దారాల జతలు.. మట్టి కోటలు
రంగు రంగుల దారాలను ముడులు వేస్తూ, కృష్ణుడి పెండెంట్‌ను దానికి జత చేస్తే ఆ సింగారాన్ని చూడటానికి రెండు కళ్లూ సరిపోవనిపిస్తుంది. వీటికే కొన్ని గవ్వలు, కొన్ని మువ్వలు జత చేస్తే ఫ్యాషన్ జ్యువెల్రీ అదుర్స్ అనిపించక మానదు. టెర్రకోట జ్యువెలరీలో కృష్ణుడు పెట్టని కోటలా హుందాగా మెరిసిపోతాడు.

రంగులలో చిత్రమై
సిల్వర్‌లో సింగారమై
దారాలతో జత కట్టి
బంగారంగా మెరిసిపోయే
కృష్ణ సౌందర్యాన్ని ఎన్ని వర్ణాల రూపు కట్టినా తనివి తీరదు.
ఎన్ని విధాల వివరించినా మాటలు చాలవు.
అందుకే ఆభరణాల డిజైన్‌లలో ప్రేమాన్వితమై వేల కాంతులను వెదజల్లుతున్నాడు.







పెయింటింగ్ చిత్రాలు
కృష్ణుడు ఉంటే రాధను వేరుగా చూపలేరు చిత్రకారులు. ఆ అందాన్ని ఫ్యాబ్రిక్, ఉడెన్.. మీద పెయింటింగ్‌గా కన్నయ్యను చిత్రించి, దండలలో కూర్చితే వెస్ట్రన్-ట్రెడిషన్ రెండు వేషధారణల్లోనూ సూపర్బ్ అనిపిస్తాడు.



చిహ్నాలూ సుందరమే
కృష్ణుడు రూపుతోనే ఆభరణాలను ధరించాలనేమీ లేదు. ఆ కిరీటి ధరించే నెమలి పింఛం, మురళీ, గోవు .. చిహ్నాలు కూడా ఆభరణమై మగువుల మదిని దోచుకుంటున్నాయి. వీటితో ఎన్నో సృజనాత్మక ఆభరణాలు రూపు కడుతున్నాయి.

సిల్వర్ సింగారం
వెండి ఆభరణాలలో కృష్ణుడి రూపుతో డిజైన్ ఉంటే సంప్రదాయ వస్త్రాలకంరణే కాదు, పాశ్చాత్య దుస్తుల మీదకూ అందంగా నప్పుతాయి.

రోజుకు ఉన్నది ఇరవై నాలుగ్గంటలు.
పాతిక గంటలు చేసినా తరగనన్ని పనులు.
ఇదీ నేటి ఫాస్ట్ లైఫ్... బతుకు చిత్రం.
ప్రతి ఒక్కరికీ ఒత్తిడి పెరుగుతోంది.
మెదడు తన వంతుగా హెచ్చరిక చేస్తుంది.
గమనించే తీరిక ఉండదు మనిషికి.
ఊపిరి సలపనివ్వనన్ని పనులు.
ఆరోగ్యాన్ని హరిస్తున్న బిజీ లైఫ్‌లో
ధ్యాసతో ఊపిరి పీల్చమంటున్నారు అర్పిత.

శ్వాసపై ధ్యాస



అర్పితా కె గుప్తా

మోడరన్ లైఫ్‌లో మనిషి జీవితం... మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నట్లు కూడా గమనించలేని స్థితిలోనే ఎక్కువ భాగం గడిచిపోతోంది. కొన్నిసార్లు సమస్య మానసికమైనదా, శారీరకమైనదా అనే స్పష్టత కూడా ఉండదు. డాక్టర్ దగ్గరకు వెళ్లి టెస్టులు చేయించుకుని మందులతో నయం చేసుకోవాల్సిన అనారోగ్యం కూడా చాలా సందర్భాల్లో ఉండదు. అలాగని మనశ్శాంతి కోసం ధార్మిక సత్సంగాలతో కాలం గడిపే విశ్రాంత జీవనమూ కాదు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో పరుగులు తీయక తప్పదు. ఈ పరిస్థితికి సమాధానం డివైన్ స్పేస్‌లో దొరుకుతోంది. ఒత్తిడుల మధ్య జీవిస్తూనే తేలికగా జీవించగలగడం ఎలాగో తెలిపే ఒక వేదిక ఇది... అంటున్నారు అర్పితా గుప్తా. విభిన్నమైన రంగాన్ని ఎంచుకుని సమాజ హితం కోసం పని చేస్తున్న అర్పితా గుప్తా పరిచయం.

గాలి పీల్చడం తెలియాలి!

''సైకాలజీ, ఫిలాసఫీ, స్పిరిచువాలిటీ కలగలిసిన వేదిక ఇది. కెరీర్‌లో కొనసాగుతూనే వారానికో గంట సమయం కేటాయించుకోవడం అన్నమాట. మా నాన్న డాక్టర్, అమ్మ టీచర్. మా ఇంట్లో ఎవరూ ఈ ఫీల్డ్‌లో లేరు. అవుట్ ఆఫ్ ది బాక్స్ ఆలోచించడం అలవాటైంది నాకు. మొదటి నుంచి అలాగే ఉండేదాన్ని. పుట్టింది పెరిగింది హైదరాబాద్‌లోనే. ఇంటర్‌లో ఉన్నప్పుడు మా ఫ్రెండ్స్ కొంతమంది పార్ట్‌టైమ్ జాబ్‌లు చేయడం చూసి నేను కూడా ఒక ఇరిగేషన్ కంపెనీలో చేరాను. డిగ్రీ వరకు అంతే... చదువు ఉద్యోగం రెండూ. పెళ్లి తర్వాత చదువు, ఉద్యోగం రెండూ మానేసి ఇంట్లో ఉన్నాను. నాకు అది ఒక టర్నింగ్ పాయింట్. 1998-99 సంవత్సరాల్లో రేకీ సాధన ట్రెండింగ్‌లో ఉండేది. పక్కింటి ఆవిడ వెళ్తూ నన్ను పిలిచింది. ఆ ప్రాక్టీస్‌తో నా ఆలోచనా ధోరణి మారిపోయింది. త్రీ లెవెల్స్ వరకు ప్రాక్టీస్ చేసి మానేశాను. ఓ ఏడాది పాటు మళ్లీ గృహిణిగా, పిల్లల్ని పెంచుకుంటూ రొటీన్ లైఫ్. అయితే ఆ గ్యాప్‌లో ఫ్రెండ్స్, బంధువులు తలనొప్పి, మైగ్రేన్, డయాబెటిక్, ఎసిడిటీ వంటి సమస్యలకు రెమిడీ అడిగేవారు. శ్వాస తీసుకోవడం కరెక్ట్‌గా వస్తే జీవక్రియలన్నీ సక్రమంగా ఉంటాయి. గంట నుంచి ఒకటిన్నర గంట హీలింగ్ సెషన్ లో శ్వాస సాధన చేయించడమే వైద్యం. ఇంట్లో మూడు వారాలు ప్రాక్టీస్ చేస్తే ఇక అదే అలవాటయిపోతుంది. ఇలా మొదలైన సర్వీస్ ఆ తర్వాత చారిటబుల్ ట్రస్ట్‌గా రూపాంతరం చెందింది.

భయం కాదు... భరోసానివ్వాలి!

కొంతమందికి క్లోజ్‌డ్ లిఫ్ట్ అంటే భయం. బలవంతంగా తీసుకు వెళ్లినా కూడా ఊపిరాడనట్లు సతమతమవుతారు. ఇంట్లో వాళ్లు జాగ్రత్త కొద్దీ 'లిఫ్ట్‌లోకి వెళ్లకు, నీకు ఊపిరాడదు' అని భయపెడుతుంటారు. లిఫ్ట్‌లో ఏ ప్రమాదమూ రాదని ధైర్యం చెప్పాలి. వారిలో ఆ భయాన్ని పోగొట్టాలంటే ఆత్మీయంగా మాట్లాడాలి. మాటల్లో మాటలుగా ఎప్పటికో అసలు విషయం బయటపడుతుంది. చిన్నప్పుడు ఎప్పుడో తలుపులు, కిటికీలు మూసి ఉన్న గదిలో బంధీ అయి ఉక్కిరి బిక్కిరి కావడం వంటివేవో కారణాలు ఉంటాయి. ఒక పేషెంట్ కోసం గంట-రెండు గంటలు కేటాయించడం డాక్టర్‌లకు సాధ్యం అయ్యేపని కాదు. అంతేకాదు, ఇలాంటి ఫోబియాలున్న వాళ్లలో చాలామంది పేషెంట్ అనిపించుకోవడం ఇష్టం లేక డాక్టర్ దగ్గరకు వెళ్లరు. ఒక స్నేహితురాలిగా వాళ్లకు ఇష్టమైన టాపిక్ మాట్లాడుతూ వాళ్లంతట వాళ్లే ఓపెన్ అయ్యేలా చూడాలన్నమాట.

- అర్పితా కె గుప్తా,
ఫైర్ పర్సన్, డివైన్ స్పేస్ చారిటబుల్ ట్రస్ట్,
సైనిక్‌పురి, సికింద్రాబాద్

అవి బంధాలే- బంధనాలు కాదు!

ఇటీవల అమ్మాయిల్లో చాలా మంది పెళ్లంటే భయపడుతున్నారు. పెళ్లి చేసుకున్నప్పటికీ భర్తతో అన్యోన్యంగా ఉండలేకపోతున్నారు. బాల్యంలో సెక్సువల్ అబ్యూస్‌కి గురి కావడమే ప్రధాన కారణం అయి ఉంటుంది. మగవాళ్ల మీద ఏహ్య భావం పేరుకుపోయి ఉంటుంది. భర్తతో సరిగ్గా మెలగలేకపోతుంటారు. ఈ పరిస్థితులు అనేక అపార్థాలకు, విడాకులకు దారి తీస్తున్నాయి. ఆ అమ్మాయి ఓపెన్ అయ్యే వరకు ఆమెకు ఆలంబనగా నిలవాలి. మొదట తన దేహాన్ని తాను ప్రేమించుకునేటట్లు కౌన్సెలింగ్ ఇవ్వాలి. వైవాహిక జీవితాన్ని స్వాగతించడానికి మానసికంగా సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఇక మధ్య వయసు గృహిణుల్లో... ఎంప్టీనెస్ట్ సిండ్రోమ్ చాలా పెద్ద సమస్య. ఆర్థిక సమస్యలు ఉండవు, ఆరోగ్య సమస్యలూ ఉండవు. ఏమీ తోచని స్థితి నుంచి దేహంలో ఏదో ఒక అనారోగ్యం ఉన్నట్లు



భావిస్తుంటారు. పిల్లలు పెద్దయి చదువు, ఉద్యోగాలతో వేరే ప్రదేశాలకు వెళ్లిపోయిన తర్వాత ఇంట్లో భార్యాభర్తలు మాత్రమే మిగులుతారు. మగవాళ్లు దాదాపుగా రోజంతా బయట పనుల్లో నిమగ్నమై ఉంటారు. ఆడవాళ్లు ఇంట్లో రోజంతా ఒంటరిగా గడపలేక ఏదో కోల్పోయినట్లవుతారు. అలాంటి వాళ్లను 'మీకు ఏ కూర ఇష్టం' అంటే వెంటనే సమాధానం చెప్పలేరు. భర్త ఇష్టాలు, పిల్లల ఇష్టాలను టక్కున చెప్పేస్తుంటారు. తమకంటూ జీవితం ఉందనే వాస్తవాన్ని కూడా గ్రహించకుండా యాభైఏళ్లపాటు జీవించేసి ఉంటారు. సెల్ఫ్ లవ్ అనే భావనే ఉండదు వాళ్ల మనసులో. మన సమాజం ఆడవాళ్లను అలా పెంచేసింది మరి. అలాగే ఆఫీసుల్లో ఆడవాళ్లకు ఎమోషనల్ అబ్యూజ్ మరో రకమైన సమస్య. ఇవన్నీ ఇలా ఉంటే... అత్తగారి హోదా వచ్చేటప్పటికి విచిత్రంగా మారిపోతుంటారు. 'మేము వీకెండ్ సినిమాకు వెళ్తే మా అత్తగారు ఒప్పుకునే వారు కాదు. ఎంత బాధగా అనిపించేదో' అని గుర్తు చేసుకుంటూ తాను మాత్రం కోడలి విషయంలో అలా ఉండకూడదు... అని నిర్ధారించేసుకుంటారు. ఇక కోడలితో 'సండే సినిమాకు వెళ్లండి' అని పదే పదే చెబుతుంటారు. సినిమాకు వెళ్లాలని ఆ కోడలికి ఉందా లేదా అనే ఆలోచన ఉండదు. ఇలాంటి ఎన్నో సున్నితమైన సమస్యలకు పరిష్కారం తమంతట తాముగా తెలుసుకోగలిగినట్లు చేయడమే నా సర్వీస్. నేనిచ్చే పాతిక ప్రశ్నలకు సమాధానాలు నిజాయితీగా రాసుకుంటే చాలు... బంధాలు అనుబంధాలుగా ఉండాలి తప్ప బంధనాలుగా ఉండకూడదని వాళ్లే తెలుసుకుంటారు. కుటుంబ బంధాలు బలపడతాయి'' అని చెప్పారు అర్పితా గుప్తా.

– వాకా మంజులారెడ్డి
– ఫొటోలు: నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని
కృష్ణునికి ప్రియమైన అటుకులు, నెయ్యితో విభిన్న రకాల నైవేద్యాలను
సమర్పిద్దాం... రుచులను ఆస్వాదిద్దాం..

వందే కృష్ణం ప్రియం

ప్రోటీన్ లడ్డు



కావలసినవి: వెన్న – టేబుల్ స్పూను, జీడిపప్పు పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు, కిస్‌మిస్ – మూడు టేబుల్ స్పూన్లు, పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు, బెల్లం తరుగు – అరకప్పు, అటుకులు – రెండు కప్పులు, యాలకులు – ఆరు.

తయారీ: • జీడిపప్పు, కిస్‌మిస్‌లను వెన్నలో వేయించాలి. ఇవి వేగిన తరువాత కొబ్బరి తురుము వేసి దోరగా వేయించాలి • కొబ్బరి కూడా వేగాక బెల్లం వేయాలి • మరో బాణలిలో అటుకులను దోరగా వేయించి, యాలకులు వేసి మిక్సీజార్‌లో పొడిచేసి పెట్టుకోవాలి • బెల్లం కరిగిన తరువాత అటుకుల పొడి వేసి చక్కగా కలుపుకుని లడ్డులా చుట్టుకుంటే ప్రొటీన్ లడ్డు రెడీ.

పోహా కేసరి



కావలసినవి: అటుకులు – అరకప్పు, నెయ్యి – మూడున్నర టేబుల్ స్పూన్లు, పంచదార – అరకప్పు, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను, కిస్‌మిస్ – పదిహేను, ఫుడ్ కలర్ – చిటికెడు, యాలకుల పొడి – పావు టీస్పూను.

తయారీ: • అటుకులను దోరగా వేయించి రవ్వలా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి • టేబుల్ స్పూన్ నెయ్యిలో జీడిపప్పు, కిస్‌మిస్‌లను బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి • ఇదే బాణలిలో అటుకుల రవ్వను కూడా రెండు నిమిషాలపాటు వేయించాలి. తరువాత కప్పు నీళ్లు పోసి ఉండలు లేకుండా కలుపుతూ ఉడికించాలి • రవ్వ ఉడికిన తరువాత పంచదార, ఫుడ్ కలర్ వేసి మగ్గనివ్వాలి • పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు మిగిలిన నెయ్యి మొత్తం వేసి తిప్పాలి • నెయ్యి పైకి తేలేంత వరకు తిప్పుతూ ఉండాలి. నెయ్యి పైకి తేలిన తరువాత వేయించి పెట్టుకున్న జీడిపప్పు, కిస్‌మిస్‌లు, యాలకులపొడి వేసి తిప్పి దించేయాలి.

బాజిల్ బెల్లతరాయ్



కావలసినవి
అటుకులు – నాలుగు కప్పులు, **పచ్చి కొబ్బరి తురుము** – కప్పు, **బెల్లం తురుము** – అరకప్పు, **ఉప్పు** – చిటికెడు, **నెయ్యి** – టేబుల్ స్పూను, **నువ్వులు** – టేబుల్ స్పూను, **యాలకుల పొడి** – పావు టీస్పూను.

తయారీ: • ముందుగా అటుకులపై కొద్దిగా నీళ్లు చల్లుకుని తడిచేయాలి • ఒక గిన్నెలో బెల్లం తురుము, కొబ్బరి తురుము, యాలకులపొడి వేసి బాగా కలుపుకోవాలి. • ఇవన్నీ చక్కగా కలిపాక తడిచేసిన అటుకులు, నువ్వులు, నెయ్యి వేసి మరోసారి చేతితో అన్నీ బాగా కలిపి సర్వ్ చేసుకోవాలి.

అవల్ పుట్టు



కావలసినవి: **అటుకులు** – అరకప్పు, **బెల్లం** – అరకప్పు, **పచ్చికొబ్బరి తురుము** – రెండు టేబుల్ స్పూన్లు, **జీడిపప్పు పలుకులు** – ఆరు, **యాలకుల పొడి** – పావు టీస్పూను, **నెయ్యి** – రెండు టీస్పూన్లు, **ఉప్పు** – చిటికెడు.

తయారీ: • అటుకులను మూడు నిమిషాలపాటు రంగు మారకుండా దోరగా వేయించుకుని, చల్లారాక మిక్సీ జార్‌లో వేసి రవ్వలా గ్రైండ్ చేయాలి • రవ్వను వెడల్పాటి పాత్రలో పోసుకుని, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. దీనిలో కొద్దికొద్దిగా వేడి నీళ్లు చల్లుతూ కలుపుకోవాలి. రవ్వ మరీ మెత్తగా కాకుండా గుప్పెట్లో పట్టుకుని వత్తితే ఉండయ్యేంత మెత్తగా కలిపి పదినిమిషాలు పక్కన పెట్టుకోవాలి • టీస్పూను నెయ్యిలో జీడిపప్పుని బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించి పక్కనపెట్టుకోవాలి • ఇప్పుడు మందపాటి పాత్రలో బెల్లం, పావు కప్పు నీళ్లుపోసి మరిగించాలి. బెల్లం కరిగిన వెంటనే ద్రావణాన్ని వడగట్టాలి • వడగట్టిన ద్రావణాన్ని ఉండపాకం రానివ్వాలి. పాకం రాగానే స్టవ్ ఆపేసి.. తడిపిపెట్టుకున్న అటుకుల రవ్వ వేసి తిప్పాలి • రవ్వను చక్కగా కలుపుకున్న తరువాత జీడిపప్పు, కొబ్బరి తురుము, మిగిలిన నెయ్యి వేసి అందంగా గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి.

ఆలూ - అటుకుల కచోరి



కావలసినవి: **అటుకులు** – కప్పు, **బ్రెడ్‌స్లైసులు** – నాలుగు, **ఉప్పు** – రుచికి సరిపడా, **మిరియాల పొడి** – టీస్పూను, **బంగాళ దుంప** – ఒకటి, **నిమ్మరసం** – టీస్పూను, **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా. **స్టఫింగ్: వేయించిన పల్లీలు** – కప్పు, **పచ్చిమిర్చి** – నాలుగు (సన్నగా తరగాలి), **అల్లం** – అంగుళం ముక్క (సన్నగా తురుముకోవాలి), **కారం** – టీస్పూను, **ఆమ్‌చూర్ పొడి** – టీస్పూను, **ఉప్పు** – రుచికి సరిపడా, **నిమ్మరసం** – టీస్పూను.

తయారీ: • ముందుగా అటుకులను కడిగి, ఐదునిమిషాలు నానబెట్టి నీటిని ఒంపేసి పక్కన పెట్టుకోవాలి • బంగాళ దుంపను ఉడికించి, తొక్కతీసి చిదుముకొని పక్కన పెట్టుకోవాలి • బ్రెడ్‌స్లైస్ అంచులను తీసేసి ముక్కలుగా తరగాలి • పెద్దగిన్నెలో అటుకులు, మిరియాల పొడి, చిదుముకున్న దుంప, బ్రెడ్‌స్లైస్ ముక్కలు వేసి కలపాలి • రుచికి సరిపడా ఉప్పు, నిమ్మరసం వేసి పిండిముద్దలా కలిపి పక్కన పెట్టుకోవాలి • స్టఫింగ్‌కోసం తీసుకున్న పదార్థాలన్నింటిని ఒక గిన్నెలో వేసి చక్కగా కలిపి పక్కన పెట్టుకోవాలి • పిండిముద్దను కావాల్సిన పరిమాణంలో ఉండలు చేసుకుని మధ్యలో స్టఫింగ్‌ను నింపి అంచుల నుంచి బయటకు రాకుండా కచోరీలా వత్తుకోవాలి • పిండి మొత్తాన్ని ఇలా వత్తుకున్న తరువాత కచోరీలను కరకరలాడుతూ, గోల్డెన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్ ఫ్రై చేసి సర్వ్ చేసుకోవాలి.

సంక్రాంతి నుంచి 'ఫ్యామిలీ డాక్టర్'

వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని వచ్చే నెల మొదటి వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తామని, సంక్రాంతి నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని చెప్పారు. ఆయన గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఈ విధానంలో ప్రతి మండలానికి రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉంటారన్నారు. పీహెచ్‌సీలోని ప్రతి వైద్యుడు రోజు మార్చి రోజు 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ)తో వెళ్లి గ్రామాల్లో వైద్య సేవలందిస్తారని చెప్పారు. ఇందుకోసం పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాలను వైద్యులకు మ్యాపింగ్ చేశామన్నారు. 104 ఎంఎంయూ వాహనంతో కలిసి వైద్యుడు ప్రతి గ్రామాన్ని నెలలో రెండుసార్లు సందర్శిస్తారని తెలిపారు. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న 656 వాహనాలకు అదనంగా మరో 434 వాహనాలు కొంటున్నట్లు చెప్పారు. ఇవి నవంబర్ నెలాఖరుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని, డిసెంబర్ నుంచి ప్రతి గ్రామానికి 104 వాహనం రెండు సార్లు వెళుతుందని వివరించారు. పీహెచ్‌సీలో వైద్యుడు సెలవు పెట్టినప్పుడు వైద్య సేవలకు ఇబ్బంది కలగకుండా సమీపంలోని సీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఇంకా ఇబ్బంది ఏర్పడితే సమీప ఏరియా, జిల్లా ఆస్పత్రుల వైద్యులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అదే విధంగా పీహెచ్‌సీ వైద్యులకు సీయూజీ ఫోన్ నంబర్లు కేటాయించి, వాటిని విలేజ్ క్లినిక్‌లలో ప్రదర్శిస్తామని చెప్పారు. ప్రజలు అవసరమైనప్పుడు ఆ నంబర్లలో ఫ్యామిలీ వైద్యుడిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని విజయవంతం చేయడానికి ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫ్యామిలీ వైద్యుడి విధానం అమలులోకి వస్తే అధిక శాతం జబ్బులకు గ్రామంలోనే వైద్య సేవలు అందుతాయని, ప్రజలకు పెద్దాస్పత్రులకు వెళ్లే భారం తప్పుతుందని వివరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ చికిత్సలు పెంచుతాం

ప్రస్తుతం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల కోసం ఖర్చు చేస్తున్న నిధుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల వాటా 25 శాతం ఉంటోందని చెప్పారు. వచ్చే ఆరు నెలల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వనరులు మెరుగుపరచడం ద్వారా ఈ వాటాను 50 శాతానికి పైగా పెంచుతామన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ వైద్యుల్లో నైపుణ్యం పెంపు, సమన్వయం ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాల్లో వైద్య శాఖ కార్యకలాపాలను వైద్య కళాశాలల పరిధిలోకి తేనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య రంగం బలోపేతానికి ప్రభుత్వం 42 వేలకు పైగా వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టిందన్నారు. త్వరలో మరో 4 వేల నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఏపీ శాక్స్ పీడీ నవీన్‌కుమార్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ పాల్గొన్నారు.

ప్రధాన ఆస్పత్రుల్లో బ్లడ్, ఆక్సిజన్ బ్యాంకులు

సాక్షి, అమరావతి: ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రులన్నింటిలో బ్లడ్‌బ్యాంకులు, ఆక్సిజన్ బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను వైద్యశాఖకు అందించింది. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ వీటిని ప్రధాన ఆస్పత్రులకు అందచేస్తామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ఫెడరేషన్ నుంచి ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీకి వచ్చిన 4,965 పల్స్ ఆక్సీమీటర్లు, 600 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను రాష్ట్ర వైద్యశాఖకు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, కుటుంబసంక్షేమ కమిషనర్ జె.నివాస్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి అరుదైన గౌరవం



మంత్రి రజని, ఐఎస్‌వో ప్రతినిధి శివయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న అధికారులు

- రెండు కేటగిరీల్లో ఐఎస్‌వో గుర్తింపు
- సర్టిఫికెట్లు ప్రదానం చేసిన మంత్రి విడదల రజని

లబ్బీపేట(విజయవాడ తూర్పు): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అరుదైన గౌరవం లభించింది. అత్యుత్తమ పనితీరుతో దేశంలోని ఆరోగ్య విశ్వవిద్యాలయాల్లో తొలిసారిగా రెండు కేటగిరీల్లో ఐఎస్‌వో గుర్తింపు పొంది రికార్డు సృష్టించింది. అడ్మిషన్స్, అకడమిక్, రీసెర్చ్, ఎగ్జామ్స్ వంటి విషయాల్లో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడమే కాకుండా, టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ముందుంది. వీటన్నింటిని గుర్తించిన ఐఎస్‌వో సర్టిఫికేషన్ బృందం యూనివర్సిటీకి ఐఎస్‌వో 9001–2015 గుర్తింపునిచ్చింది. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం నిర్వహణకు యూనివర్సిటీ పెద్దపీట వేయడంతో ఐఎస్‌వో 14001–2015 గుర్తింపు లభించింది. విజయవాడలోని యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని పాల్గొని ఐఎస్‌వో 9001–2015, ఐఎస్‌వో 14001–2015 గుర్తింపు పత్రాలను వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావుకు అందజేశారు.

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం: రజని

ఈ సందర్భంగా మంత్రి విడదల రజని మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగాన్ని మరింత పటిష్టపరిచి, ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రంలో కొత్తగా 16 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిలో ఐదు కళాశాలల్లో వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తారని వివరించారు. ఆస్పత్రుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు వైద్యులు, సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు. హెల్త్ యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయడం వల్లే ప్రతిష్టాత్మక ఐఎస్‌వో గుర్తింపు లభించిందన్నారు.

వారి పేర్లు చెప్పకపోతే

చంపేస్తాం

- వల్లభనేని, కొడాలి పేర్లు చెప్పాలి.. లేకపోతే సుపారీ ఇచ్చి చంపేస్తామంటూ బెదిరింపులు
- ఈడీ విచారణకు సహకరిస్తున్నా: 'సాక్షి'తో చీకోటి ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్: క్యాసినో వ్యవహారంలో, ఈడీ విచారణలో మాజీ మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పేర్లు చెప్పాలని పదేపదే బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని చీకోటి ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారి పేర్లు చెప్పకపోతే ఓ ప్రమాదకరమైన వెబ్‌సైట్ ద్వారా తనని చంపేందుకు సుపారీ ఇస్తున్నట్టు బెదిరిస్తున్నారని చీకోటి ప్రవీణ్ 'సాక్షి'కి చెప్పారు. బెదిరింపుల వెనక అక్కడి ప్రతిపక్ష పార్టీ ఉందా లేదా ఆ పార్టీ ముసుగులో ఎవరైనా చేస్తున్నారా అన్నది పోలీసుల విచారణలో తేలుతుందన్నారు. తాను రాష్ట్రంలో కాకుండా లీగల్‌గా క్యాసినో ఎక్కడ నడుస్తుందో అక్కడే వ్యాపారం చేస్తున్నట్టు వెల్లడించారు. తనకు వ్యక్తిగతంగా స్నేహితులుగా ఉన్నంత మాత్రాన వారికి సంబంధంలేని వ్యవహారాల్లో వాళ్ల పేర్లు చెప్పడం పద్ధతి కాదంటూ చీకోటి చెప్పుకొచ్చారు. అదేవిధంగా నేపాల్ క్యాసినో వ్యవహారంలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు తప్ప పెద్దగా ఎవరు రాలేదని, పలువురు సినీ ప్రముఖులకు తాను కోట్ల రూపాయలు చెల్లించినట్టు వస్తున్న వార్తల్లో నిజంలేదని స్పష్టంచేశారు. ఈ లెక్కల వ్యవహారాలు పూర్తిగా ఈడీకి వివరించినట్టు తెలిపారు. తాను ఈడీ విచారణకు సహకరిస్తున్నానని తెలిపారు.

చంద్రబాబు పాపం.. డిస్కంలకు శాపం

▶ మొదటి పేజీ తరువాయి

తెస్తున్నామని అందులో పేర్కొంది.

మొదటి వాయిదా చెల్లించినా..

ఏపీ డిస్కంలు విద్యుదుత్పత్తిదారులకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ.17,060 కోట్లు కాగా గడువు అనంతరం బకాయిలు రూ.412.69 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. 45 రోజుల గడువు తరువాత బకాయి ఉంటే నిషేధం విధిస్తామని కేంద్రం ఇటీవల ప్రకటించింది. మొత్తం బకాయిలను 12 వాయిదాల్లో చెల్లించేలా లేట్ పేమెంట్ సర్ చార్జ్ (ఎల్‌పీఎస్) పథకంలో ఏపీ ఇటీవలే చేరింది. మొదటి వాయిదాగా ఈ నెల 6న రూ.1,422 కోట్లను చెల్లించింది. ఈలోగానే కేంద్రం నిషేధిత రాష్ట్రాల జాబితాలో ఏపీని చేర్చింది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఇక్కడి అవసరాలకు సరిపోనప్పుడు ఆ లోటును పూడ్చుకోవడానికి ఎనర్జీ ఎక్స్ఛేంజీ నుంచి కొనుగోలు చేస్తుంటారు. అదే విధంగా మన దగ్గర విద్యుత్ మిగిలితే దానిని ఎనర్జీ ఎక్స్ఛేంజీలో విక్రయిస్తుంటారు. ఇప్పుడు కేంద్రం నిషేధం విధించడంతో ఏపీతో పాటు 13 రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలు, అమ్మకాలు జరపలేవు. ప్రస్తుతం రాష్ట్రంలో 180 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతున్నందున కేంద్రం విధించిన నిషేధం ప్రభావం ఏపీపై అంతగా ఉండకపోవచ్చునని, అయినప్పటికీ తాము కేంద్రానికి లేఖ రాస్తామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ 'సాక్షి' ప్రతినిధికి తెలిపారు.

ఆ అప్పులే కారణం..

టీడీపీ హయాంలో 2014లో రూ.29,703 కోట్లుగా ఉన్న విద్యుత్ రంగం మొత్తం అప్పులు 2019 నాటికి రూ.68,596 కోట్లకు చేరాయి. ఇవి కాకుండా పవర్ జనరేటర్లకు డిస్కంల బకాయిలు రూ.2,893.23 కోట్ల నుంచి రూ.21,540.96 కోట్లకు పెరిగాయి. టీడీపీ హయాంలో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని బిల్లుల్లో సర్దుబాటు చేసుకునే అవకాశాన్ని డిస్కంలకు ఇవ్వలేదు. దీంతో 2014–19 మధ్య దాదాపు రూ.20 వేల కోట్లు డిస్కంలు నష్టపోవాల్సి వచ్చింది. టీడీపీ సర్కారు దాదాపు 8 వేల మెగావాట్ల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు (పీపీఏ) అధిక ధర (యూనిట్ రూ. 4.84 + ఇతర ఛార్జీలు అదనం) చొప్పున కుదుర్చుకుంది. దీనివల్ల డిస్కంలు ఏటా రూ.3,500 కోట్ల చొప్పున 25 ఏళ్ల పాటు భారం మోయాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో తీసుకున్న రుణాలపై వడ్డీలు చెల్లించడం కోసం అదనంగా రూ.38,836 కోట్ల మేర రుణాలను ఆర్థిక సంస్థల నుంచి డిస్కంలు తీసుకోవాల్సి వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు ఆదుకునేందుకు మూడేళ్లలోనే దాదాపు రూ.40 వేల కోట్లు సాయంగా అందించింది. మరోవైపు విద్యుత్ కొనుగోలు ఖర్చులు తగ్గించే చర్యలు చేపట్టింది.

'ఐఈఎక్స్'కు రాష్ట్రాలు వెంటనే చెల్లించాల్సిన బకాయిలు

రాష్ట్రం	బకాయి (రూ.కోట్లలో)
తెలంగాణ	1,380.96
తమిళనాడు	926.16
రాజస్థాన్	500.66
జమ్మూకశ్మీర్	434.81
ఆంధ్రప్రదేశ్	412.69
మహారాష్ట్ర	381.66
కర్ణాటక	355.20
మధ్యప్రదేశ్	229.11
జార్ఖండ్	214.47
బిహార్	173.50
ఛత్తీస్‌గఢ్	27.49
మణిపూర్	29.94
మిజోరాం	17.23

జీపీఎస్‌తో రిటైర్మెంట్ భరోసా

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి
- సీపీఎస్ కంటే మెరుగైన విధంగా జీపీఎస్ అమలు
- మంత్రి బొత్స సత్యనారాయణ
- ఉద్యోగ సంఘాలు సహకరించాలి: సజ్జల

సాక్షి, అమరావతి : ఉద్యోగుల పదవీ విరమణ తర్వాత హాయిగా జీవించే భరోసాను ప్రభుత్వం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ద్వారా కల్పిస్తుందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో పాత పెన్షన్ విధానం అమలు చేయడం కష్టంతో కూడుకున్నదని చెప్పారు. ఈ క్రమంలో సీపీఎస్‌తో ఉద్యోగులకు కలిగే మేలు కంటే మెరుగ్గా ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొస్తుందన్నారు. గురువారం సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణలతో కూడిన మంత్రి వర్గ ఉప సంఘం.. ఉద్యోగ సంఘాల నాయకులు, ఏపీసీపీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులతో ఐదు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించింది. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల్లో ఆందోళనను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. సమస్యను పరిష్కరించేందుకు మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించారని తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారి అభిమతానికి అనుగుణంగానే అందరి అభిప్రాయంతోనే ముందుకు వెళ్తామన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సీపీఎస్ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. వారి డిమాండ్లకు అనుగుణంగా పరిష్కారం చేయలేకపోతే.. ప్రత్యామ్నాయం ద్వారా వారిని ఒప్పించి సంతోష పెడతామన్నారు. ఉద్యోగుల నుంచి వచ్చిన ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకుని సబ్ కమిటీలో ఇతర మంత్రులు, అధికారులతో చర్చించి ఉద్యోగులతో మరోసారి భేటీ అవుతామని మంత్రి తెలిపారు.

ఉద్యోగులకు ప్రభుత్వం వ్యతిరేకం కాదు

ఉద్యోగులకు ప్రభుత్వం ఏమాత్రం వ్యతిరేకం కాదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఉద్యోగ సంఘాలు కూడా ప్రభుత్వానికి పూర్తిగా సహకరించాలని కోరారు. కాగా, 'సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను కచ్చితంగా పునరుద్ధరించాలి. జీపీఎస్‌ను ఏ ఒక్క ఉద్యోగ సంఘం ఒప్పుకోదు. చర్చల ద్వారా సానుకూలంగా సమస్య పరిష్కారానికి మా సహకారం అందిస్తాం. ఉద్యోగ విరమణ తర్వాత సామాజిక భద్రత కల్పించే పెన్షన్ విధానమే మాకు కావాలి. అలా చేస్తే ప్రభుత్వాన్ని జీవిత కాలం మర్చిపోలేం. ప్రభుత్వం ఓపీఎస్ విధానం తీసుకొచ్చేందుకు ఆశాభావం వ్యక్తం చేసినట్టు అనిపించింది. కానీ సీపీఎస్ ఉద్యోగుల విద్రోహదినం సెప్టెంబర్ 1వ తేదీన యథావిధిగా నిర్వహిస్తాం' అని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బండి శ్రీనివాసరావు, బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆర్.అప్పలరాజు, మరియదాసు, కె.సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి(హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్, జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్, హెచ్‌ఆర్) హెచ్.అరుణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సినిమా


బర్త్ డే గిఫ్ట్



● చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు శుభవార్త. ఈ నెల 22న ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా తన ఫ్యాన్స్‌కి బర్త్ డే గిఫ్ట్ ఇవ్వనున్నారు చిరంజీవి. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'గాడ్ ఫాదర్' టీజర్‌ని 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, చిరంజీవి పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. మోహన్ రాజా దర్శకత్వంలో కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్‌బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం దసరాకి విడుదల కానుంది. సల్మాన్ ఖాన్, నయనతార, పూరి జగన్నాథ్, సత్యదేవ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: నీరవ్ షా, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వాకాడ అప్పారావు.

కార్నివాల్ ఫెస్టివల్‌కి రండి: ''అన్నయ్య (చిరంజీవి) బర్త్‌డే సందర్భంగా ఈ నెల 22న హైదరాబాద్ హైటెక్స్‌లో 'కార్నివాల్ ఫెస్టివల్' నిర్వహిస్తున్నాం'' అని నటుడు, నిర్మాత నాగబాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''ప్రతి సంవత్సరం అన్నయ్య బర్త్‌డేని శిల్పకళా వేదికలో చేసేవాళ్లం. అయితే ఈ ఏడాది ఫ్యాన్స్ కోసం హైటెక్స్‌లో 'కార్నివాల్ ఫెస్టివల్' నిర్వహిస్తున్నాం. ఈ వేడుకలో చిరంజీవిగారి గురించి ఎవరికీ తెలియని విషయాలు పంచుకుంటాను. ఈ ఫెస్టివల్‌కి మా ఫ్యామిలీ నుంచి అందరు హీరోలు హాజరవుతారు. అలాగే ఇతర హీరోలు, ఆయన్ను అభిమానించేవారు కూడా పాల్గొంటారు. ఈ ఫెస్టివల్‌కి అన్ని ప్రాంతాల మెగా అభిమానులు తప్పకుండా రావాలి'' అన్నారు.



● నాగార్జున

తమ హగనే అంటే...

ఇంటర్‌పోల్ ఆఫీసర్ విక్రమ్ కత్తి పట్టారు. అది కూడా విలువైన జపనీస్ ఉక్కుతో తయారు చేయబడిన 'తమ హగనే' కత్తితో రంగంలోకి దిగారు. విక్రమ్ ఎందుకు కత్తి పట్టాల్సి వచ్చిందో తెలియాలంటే 'ది ఘోస్ట్' రిలీజ్ వరకూ ఆగాల్సిందే. నాగార్జున ఇంటర్‌పోల్ ఆఫీసర్‌గా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ది ఘోస్ట్'. సోనాల్ చౌహాన్, గుల్ పనాగ్, అనిఖా సురేంద్రన్ ఇతర పాత్రల్లో నటించారు. నారాయణ్‌దాస్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు, శరత్ మరార్ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 5న రిలీజ్ కానుంది. 'ది ఘోస్ట్'లో నాగార్జున పట్టుకున్న కత్తి (తమ హగనే) గురించి ఓ ప్రోమో ద్వారా క్లారిటీ ఇచ్చింది చిత్రబృందం. ''తమ హగనే' అనేది జపనీస్ పదం. తమ అంటే విలువైనదని, హగనే అంటే ఉక్కు అని అర్థం. ఈ చిత్రంలోని యాక్షన్ సీన్స్‌లో తమ హగనేని వాడారు నాగార్జున'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రం ట్రైలర్ ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జి, సంగీతం: మార్క్ కె రాబిన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: మోహన్, వెంకటేశ్వరరావు చల్లగుళ్ల.

సినిమా నంబర్.. రిలీజ్ డేట్ ఒకటే!

'అతడు, ఖలేజా' వంటి చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మూడో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించనున్న ఈ చిత్రం విడుదల తేదీ ఫిక్స్ అయింది. వేసవి కానుకగా 2023 ఏప్రిల్ 28న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కాగా మహేశ్‌బాబుకు ఇది 28వ చిత్రం. ఈ సినిమా విడుదల తేదీ కూడా 28 కావడం విశేషం. ఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నిర్మించనున్న మరో ప్రతిష్ఠాత్మక చిత్రమిది. 'మహర్షి' తర్వాత మహేశ్‌తో పూజా హెగ్డే మరోసారి నటించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభిస్తాం. మా చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా, పీఎస్ వినోద్ ఛాయాగ్రాహకుడిగా, తమన్ సంగీత దర్శకునిగా పనిచేయనున్నారు'' అన్నారు.



● మహేశ్‌బాబు

కమర్షియల్ జిన్నా

విష్ణు మంచు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జిన్నా'. ఇషాన్ సూర్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సన్నీ లియోన్, పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్లు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. తెలుగు, తమిళ, మలయాళం, హిందీలో తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే కోన వెంకట్ అందించారు.'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: ఛోటా కె. నాయుడు.



● విష్ణు మంచు

ఆ పాత్ర ఎనర్జీ ఇస్తోంది

''సీతారామం' చిత్రంలో ఇంటరాగేషన్ అధికారి పాత్ర లభించడం హ్యాపీ. ఇది చిన్న పాత్రే అయినా రష్మిక– సుమంత్‌ల కాంబినేషన్‌లో చేసిన కీలక సన్నివేశం కావడంతో నా పాత్ర గురించి అందరూ ప్రశంసిస్తుండటం ఓ కొత్త ఎనర్జీ ఇస్తోంది'' అని నటుడు మధు నంబియార్ అన్నారు. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సీతారామం'. సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదలైంది. ఈ చిత్రంలో ఇంటరాగేషన్ అధికారి పాత్ర చేసిన మధు నంబియార్ మాట్లాడుతూ– ''ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం చేసి వచ్చాక నటుడిగా మారాను. 'సర్కారువారి పాట', 'గంధర్వ', 'దర్జా'.. ఇలా 20 చిత్రాల్లో చేశాను. 'సీతారామం'లో చాన్స్ ఇచ్చిన నిర్మాతలు అశ్వనీదత్, స్వప్నదత్, ప్రియాంక దత్‌గార్లకు, హను రాఘవపూడికి, రవితేజ చెరుకూరికి థ్యాంక్స్. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'ఖుషి', నందమూరి చైతన్య కృష్ణ చిత్రాలతో పాటు మరో నాలుగు సినిమాల్లో, ఓ వెబ్ సిరీస్‌లో చేస్తున్నాను. విలక్షణమైన నటుడు అని ప్రేక్షకులతో, క్రమశిక్షణ కలిగిన యాక్టర్ అని పరిశ్రమతో అనిపించుకోవాలన్నదే నా లక్ష్యం'' అన్నారు.



● మధు నంబియార్

ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో సినిమాలు

– నిర్మాత 'దిల్' రాజు



● దామోదర ప్రసాద్, 'దిల్' రాజు, బసిరెడ్డి, సి. కల్యాణ్, ప్రసన్న కుమార్

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం షూటింగ్‌లు నిలిపివేయాలని ప్రొడ్యూసర్స్ గిల్డ్ నిర్ణయం తీసుకోవడం, అందుకు నిర్మాతల మండలి కూడా ఆమోదించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 1 నుంచి చిత్రీకరణలు నిలిపివేశారు. అప్పటినుంచి తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఆధ్వర్యంలో పలు సమావేశాలు జరిగాయి. గురువారం ఓ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ – ''ఇక నుంచి విడుదలయ్యే ప్రతి సినిమా 8 వారాల తర్వాతే ఓటీటీలో విడుదల కావాలి. ఓటీటీల్లో సినిమా విడుదల చేసే విషయమై నిర్మాతలందరం ఒక నిర్ణయానికి వచ్చాం. ప్రస్తుతం విడుదలకు సిద్ధమవుతున్న, చిత్రీకరణ జరుపుకొంటున్న సినిమాలన్నీ థియేటర్లో విడుదలైన 8 వారాల తర్వాతే, అంటే 50 నుంచి 60 రోజుల తర్వాతే ఓటీటీలో వస్తాయి. ఇప్పటికే అగ్రిమెంట్ అయిన వాటిని కూడా పరిశీలిస్తున్నాం. అంతే కాకుండా థియేటర్, మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరలు, తినుబండారాల ధరలు ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరాం. అందుకు థియేటర్ల యాజమాన్యం అంగీకరించారు. వీపీఎఫ్ చార్జీల విషయంలో నేడు (శుక్రవారం) ఎగ్జిబిటర్లతో జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటాం. అదే విధంగా సినిమా చిత్రీకరణల్లో ఎందుకు వృథా ఖర్చు అవుతుందనే అంశంపై మాట్లాడుతున్నాం. ముఖ్యంగా నిర్మాణ వ్యయం తగ్గించేందుకు ఎలా వ్యవహరించాలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)తో ఒక అగ్రిమెంట్ చేసుకున్నాం. ఈ నెల 1వ తేదీన నిలిపివేసిన సినిమా షూటింగ్‌లు ఎప్పటినుంచి ప్రారంభమవుతాయనే విషయాన్ని త్వరలో వెల్లడిస్తాం. తెలుగు చిత్ర పరిశ్రమ తీసుకున్న నిర్ణయాలపై హిందీ చిత్ర పరిశ్రమ కూడా గమనిస్తోంది. దక్షిణాదిలోని మిగతా పరిశ్రమలన్నీ మనం తీసుకున్న నిర్ణయాల కోసం ఎదురు చూస్తున్నాయి. నిర్మాతలందరూ కలిసి ఏయే నిర్ణయాలు తీసుకున్నారని మమ్మల్ని అడుగుతున్నారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీ తీసుకున్న నిర్ణయాన్ని అందరూ గౌరవించారు'' అన్నారు.

మహా మాస్



● రవితేజ, శ్రీలీల

రవితేజ, శ్రీ లీల జంటగా నటిస్తున్న చిత్రం 'ధమాకా'. ఈ చిత్రం నుంచి మొదటి సింగిల్ 'జింతాక్' లిరికల్ వీడియో గురువారం విడుదలయింది. మహామాస్ అనేలా ఈ పాట ఉంది. చిత్ర సంగీతదర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ మాస్ నంబర్‌కి స్వరాలందించడంతో పాటు పాడారు కూడా. ఫీమేల్ వాయిస్‌కి మంగ్లీ గొంతు కలిపారు. ''రవితేజ, శ్రీలీల మాస్ డ్యాన్స్ ఈ పాటకు ఆకర్షణగా నిలుస్తుంది. సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని విజువల్ వండర్‌లా ఈ పాటను చిత్రీకరించారు'' అని చిత్రబృందం పేర్కొంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

కామెడీ మెకానిక్



● మణి, రేఖ

మణి సాయితేజ, రేఖ నిరోషా జంటగా ముని సహేకర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మెకానిక్'. 'ట్రబుల్ షూటర్' అనేది ట్యాగ్ లైన్. మున్నా (ఎమ్. నాగ మునెయ్య), కొండ్రాసి ఉపేందర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''గ్రామీణ నేపథ్యంలో ఒక బర్నింగ్ ప్రాబ్లమ్ నేపథ్యంలో వినోదానికి పెద్ద పీట వేస్తూ, సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. తనికెళ్ల భరణి, నాగ మహేష్, సూర్య, ఛత్రపతి శేఖర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, కెమెరా: ఎస్.వి. శివరాం.

స్వచ్ఛమైన ప్రేమ



● తేజ్, అఖిల

తేజ్ కూరపాటి, అఖిల ఆకర్షణ జంటగా వెంకట్ వందెల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నా వెంటపడుతున్న చిన్నాడెవడమ్మా'. జీవీఆర్ ఫిల్మ్ మేకర్స్ సమర్పణలో ముల్లేటి నాగేశ్వరరావు నిర్మాణ సారథ్యంలో ముల్లేటి కమలాక్షి, గుబ్బల వేంకటేశ్వరరావు నిర్మించారు. సెప్టెంబర్ 2న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ముల్లేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ– ''పల్లెటూరి నేపథ్యంలో చక్కటి ప్రేమకథతో యూత్‌కు కావాల్సిన అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం. సెప్టెంబర్ 2న మా సినిమా విడుదలకు డిస్ట్రిబ్యూటర్లతో మాట్లాడితే, థియేటర్లు అందుబాటులో ఉన్నాయి'' అన్నారు. ''ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్‌కు, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది'' అన్నారు ముల్లేటి కమలాక్షి, గుబ్బల వేంకటేశ్వరరావు. ''అందమైన, పవిత్రమైన ప్రేమ ఎలా ఉంటుందో అలాంటి స్వచ్ఛమైన ప్రేమకథను ఈ సినిమాలో చూపించాం'' అన్నారు వెంకట్ వందెల.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲ 38	60,298	
నిఫ్టీ ▲ 12	17,957	

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్‌	12,978	▲	40
డోజోన్స్‌	33,902	▼	78
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,542	▲	26
డాక్స్‌	13,697	▲	70
షాంఘై	3,275	▼	15
నికాయ్‌	28,942	▼	281

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

మార్కెట్లోకి కొత్త ఆల్టో కే10

ధర రూ. 3.99–5.83 లక్షలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్‌ దిగ్గజం మారుతీ సుజుకీ తాజాగా చిన్న కారు ఆల్టో కే10 సరికొత్త వెర్షన్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ. 3.99–5.83 లక్షలుగా (ఎక్స్‌–షోరూం) ఉంటుంది. ఆధునిక కే–సిరీస్‌ ఇంజిన్‌తో నడిచే ఈ కారు లీటరుకు 24.9 కిలోమీటర్ల వరకూ మైలేజీ ఇస్తుందని కంపెనీ ఎండీ



హిసాషి తకెయుచి తెలిపారు. సుజుకీ ప్లాట్‌ఫాం, పవర్‌ట్రెయిన్‌, టెక్నాలజీని ఉపయోగించి ఈ కారును దేశీయంగానే డిజైన్‌ చేసి, అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఆల్టో బ్రాండు వరుసగా పదహారేళ్ల పాటు 2020 వరకూ అమ్మకాల్లో అగ్రస్థానంలో కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. స్పోర్ట్స్‌ యుటిలిటీ వాహనాల విక్రయాలు పెరుగుతున్నా ఇప్పటికీ చాలా మంది కస్టమర్లు హ్యాచ్‌బ్యాక్‌లను ఎంచుకుంటున్నారని తకెయుచి తెలిపారు. ఈ నేపథ్యంలో చిన్న కార్ల విభాగంలో మరిన్ని కొత్త ఉత్పత్తులు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

నష్టాల్లోంచి లాభాల్లోకి..

- స్వల్ప లాభాలతో గట్టెక్కిన సూచీలు
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఆఖరి గంటలో అధిక వెయిటేజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్‌ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. తొలి సెషన్‌లో 314 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్‌ చివరికి 38 పాయింట్ల లాభంతో 60,298 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా అయిదో రోజూ లాభాల ముగింపు. నిఫ్టీ 92 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 12 పాయింట్ల స్వల్ప లాభంతో 17,957 వద్ద నిలిచింది. ఈ సూచీ వరుసగా ఎనిమిదోరోజూ లాభపడి గడచిన 20 నెలల్లో అతిపెద్ద ర్యాలీ చేసింది. ప్రైవేట్‌ బ్యాంక్స్‌, మెటల్‌, ఎఫ్‌ఎంసీజీ, ఆర్థిక షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా.., ఆటో, ఐటీ, ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంక్స్‌ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రూపాయి విలువ 19 పైసలు క్షీణించి 79.64 వద్ద స్థిరపడింది.

బీఎస్‌ఈ మార్కెట్‌ విలువ సరికొత్త రికార్డ్‌

ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ(మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌) రూ. 280.58 లక్షల కోట్లకు చేరింది. ఇది సరికొత్త రికార్డ్‌ కావడం విశేషం.

ఓటీటీ.. ఇంకాస్త చౌకగా!

షరతులు వర్తిస్తాయి

- ప్రస్తుతానికి ధరల యుద్ధానికి విశ్రాంతి
- సబ్‌స్క్రిప్షన్‌ ఆదాయంపై కష్టమవుతున్న మనుగడ
- మధ్యలో ప్రకటనలివ్వటం ద్వారా ఆదాయార్జనపై దృష్టి
- అవసరమైతే దీనికోసం సబ్‌స్క్రిప్షన్‌ ధరలు తగ్గింపు!
- వచ్చే ఏడాది మొదటి నుంచీ నెట్‌ఫ్లిక్స్‌లో ప్రకటనలు
- అదే తరహాలో తెలుగు ఓటీటీ 'ఆహా' కూడా...
- ఫ్రీ, ప్రీమియం కలిపి ప్రీమియం అందిస్తున్న డిస్నీ
- జీ, ఊట్‌, ఎంఎక్స్‌ ప్లేయర్‌, సోనీ లివ్‌దీ అదేదారి
- అమెజాన్‌ భిన్నం... ఈ వ్యవహారానికి దూరం



(మంథా రమణమూర్తి)

మిగిలిన దేశాలు వేరు. ఇండియా వేరు. ఇక్కడ రేటే రాజు. నాణ్యత, సర్వీసు వీటన్నిటిదీ ఆ తరువాతి స్థానమే. ధర కాస్త తక్కువగా ఉంటే... ఓ అరకిలోమీటరు నడిచైనా వెళ్లి తెచ్చుకునే మనస్తత్వం సగటు భారతీయ వినియోగదారుది. వినోదాన్ని నట్టింట్లోకి తీసుకొచ్చిన ఓటీటీ సంస్థలన్నీ ఇపుడిపుడే ఈ వాస్తవాన్ని అర్థం చేసుకుంటున్నాయి. కోవిడ్‌ కాలంలో వీక్షకుల సంఖ్య పెంచుకోవటమే లక్ష్యంగా ఎడాపెడా ఆఫర్లిచ్చేసి... కంటెంట్‌ కోసం వందల కోట్లను ఖర్చు చేసిన ఓటీటీలు... పరిస్థితులిపుడు సాధారణ స్థాయికి రావటంతో ఆదాయంపై దృష్టి పెట్టాయి. లాభాలు రావాలంటే సబ్‌స్క్రిప్షన్‌ ఫీజు మాత్రమే సరిపోదనే ఉద్దేశంతో... సినిమాలు, షోల మధ్యలో ప్రకటనలు ప్రసారం చేసి భారీ ఆదాయాన్ని ఆర్జించేలా ప్రణాళికలు వేస్తున్నాయి. దీనికోసం ఉచితం... ప్రీమియం.. పే–పర్‌ వ్యూ వంటి పలు మోడళ్లను వీక్షకులకు అందుబాటులో ఉంచనున్నాయి. ఇదే జరిగితే... ఓటీటీ యుగంలో మరో దశ మొదలైనట్లే. వినియోగదారులకు మరింత నాణ్యమైన కంటెంట్‌... మరింత తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

నెట్‌ఫ్లిక్స్‌కు తత్వం బోధపడింది....

ప్రపంచ ఓటీటీ రారాజు నెట్‌ఫ్లిక్స్‌లో... ఎన్నటికీ ప్రకటనలు ఉండవని సీఈఓ రీడ్‌ హేస్టింగ్స్‌ కొన్నాళ్ల కిందటి వరకూ పదేపదే చెప్పారు. 2011 నుంచీ ప్రతి ఏటా రెండంకెలకు తగ్గని ఆదాయ వృద్ధి... అసలు సబ్‌స్క్రయిబర్లు తగ్గటమనేదే లేని చరిత్ర నెట్‌ఫ్లిక్స్‌ది. అదే ధీమాతో ఇటీవల రేట్లు పెంచేసి, పాస్‌వర్డ్‌ షేరింగ్‌కు ప్రత్యేక ఛార్జీలు విధించారు. దీంతో జనవరి–మార్చి త్రైమాసికంలో నెట్‌ఫ్లిక్స్‌కు 2 లక్షల మంది గుడ్‌బై కొట్టేశారు. ఇది ఊహించని షాక్‌. ఒక్కసారిగా షేరు పడిపోవటమే కాదు... వందల కొద్దీ ఉద్యోగాలూ పోయాయి. ఏప్రిల్‌– జూన్‌లోనూ ఈ షాక్‌ కొనసాగింది. ఏకంగా 10 లక్షల మంది మైనస్‌ కావటంతో సంస్థ పునరాలోచనలో పడింది. సబ్‌స్క్రిప్షన్‌ ఆదాయంపైనే ఆధారపడితే కష్టమని... అవసరమైతే చార్జీలు తగ్గించి ప్రకటనలు కూడా ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. 'ప్రకటనల విషయంలో కాస్త పరిణతి ఉన్న మార్కెట్లలో ముందు మొదలుపెడతాం' అన్నారు రీడ్‌. యాడ్‌ మార్కెట్‌ విషయంలో ఇండియా పరిణితి చెందిందో లేదో తెలీదు గానీ.. ఇక్కడ వచ్చే ఏడాది మొదటి నుంచీ నెట్‌ఫ్లిక్స్‌ తెరపైప్రకటనలు మాత్రం కనిపించబోతున్నాయి.

అమెజాన్‌కు ఆ అవసరం లేదా?

ప్రకటనతో కూడిన వీడియో ఆన్‌ డిమాండ్‌ (ఏవీవోడీ) సేవలపై స్ట్రీమింగ్‌ దిగ్గజాల్లో ఒకటైన అమెజాన్‌ ఇప్పటిదాకా ఏ ప్రకటనా చేయలేదు. డిస్నీ హాట్‌స్టార్‌ ఇప్పటికే ఏవీవోడీ మోడల్‌ను అమలు చేసి భారతీయుల మది గెలుచుకుంది. నెంబర్‌–1 స్థానంతో పాటు 3.6 కోట్ల యాప్‌ డౌన్‌లోడ్స్‌తో దేశంలో అత్యధిక వాటానూ సొంతం చేసుకుంది. ఎంఎక్స్‌ ప్లేయర్‌, జీ, ఊట్‌, సోనీ లివ్‌, సన్‌ నెక్ట్స్‌ వంటి ఇతర స్ట్రీమింగ్‌ సంస్థలు కూడా డిస్నీ మాదిరిగా సబ్‌స్క్రిప్షన్‌ ఆదాయం ఒక్కటే అయితే కష్టమన్న ఉద్దేశంతో ప్రకటనలకు ఎప్పుడో గేట్లు తెరిచేశాయి. యాడ్స్‌ ఆదాయం భారీగా వస్తుండటంతో ఇంతటి పోటీని సైతం తట్టుకోగలుగుతున్నాయి. దీనిపై ట్రస్ట్‌ రీసెర్చ్‌ అడ్వయిజరీ (ట్రా) సీఈఓ చంద్రమౌళి నీలకంఠన్‌ను 'సాక్షి' సంప్రతించగా.. ''అవును! ధర తగ్గితే మధ్య మధ్యలో కొన్ని ప్రకటనలొచ్చినా మన ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోరు. అందుకే ఓటీటీ కంపెనీలు అవసరమైన మోడళ్లను తెచ్చే పనిలోపడ్డాయి. అమెజాన్‌ మాత్రం తన ప్రైమ్‌ వీడియో తెరపై ప్రకటనలకు చోటివ్వకపోవచ్చు. ఎందుకంటే దాని ప్రధాన వ్యాపారం వీడియో కంటెంట్‌ కాదు. తన సభ్యులకిస్తున్న రకరకాల సర్వీసుల్లో ఇదీ ఒకటి. దానికి నిధుల కొరత కూడా లేదు'' అని అభిప్రాయపడ్డారు. ఓటీటీ తెరపై ప్రకటనలు ఇపుడిపుడే పెరుగుతున్నాయని. వచ్చే ఏడాది కాలంలో దీనికొక రూపం రావచ్చని చెప్పారాయన. ''ఇండియా మిగతా దేశాల్లాంటిది కాదు. ఇక్కడ ప్రాంతీయ భాషల బలం ఎక్కువ. వీడియో కంటెంట్‌లోనూ వాటికి ప్రాధాన్యముంది. అందుకే స్థానిక చానెళ్లు కూడా ప్రకటనల విషయంలో ఓటీటీలకు గట్టి పోటీనే ఇస్తాయి'' అన్నారు.

యాడ్స్‌ నుంచి ప్రీమియంవైపు కూడా...!

చేతిలో కంటెంట్‌ ఉన్నపుడు దాన్ని యాడ్స్‌తో... యాడ్స్‌ లేకుండా ఎలాగైనా చూపించవచ్చన్నది ఓటీటీ సంస్థల ఉద్దేశం. అందుకే అగ్రిగేషన్‌ సేవలు కూడా అందిస్తూ ఏవీవోడీ మార్కెట్లో చెప్పుకోదగ్గ వాటా ఉన్న ఎంఎక్స్‌ ప్లేయర్‌.... ఇటీవలే రూ.299 వార్షిక సభ్యత్వ రుసుముతో ఎంఎక్స్‌ గోల్డ్‌ పేరిట ప్రీమియం సేవలు ఆరంభించింది. ప్రస్తుతం భారతీయ ఏవీవోడీ మార్కెట్లో ఎంఎక్స్‌ ప్లేయర్‌, యూట్యూబ్‌, డిస్నీ హాట్‌స్టార్‌దే హవా. ఈ 3 సంస్థలకూ ఉమ్మడిగా 65 శాతం మార్కెట్‌ వాటా ఉంది. ఇవి వినోద కంటెంట్‌తో పాటు అగ్రిగేషన్‌, స్పోర్ట్స్‌ కూడా అందిస్తుండటం వీటికి కలిసొస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌ లాంటి ప్లేయర్లు కూడా వస్తే ఏ మార్పులొస్తాయో తెరపై చూడాల్సిందే!.

ఆహా... నెట్‌ఫ్లిక్స్‌ దారిలోనే

తెలుగు కంటెంట్‌కు ప్రత్యేకమైన స్ట్రీమింగ్‌ సంస్థ 'ఆహా' కూడా ఇపుడు ఏవీవోడీ వైపు చూస్తోంది. దీనిపై సంస్థ బిజినెస్‌ స్ట్రాటజీ హెడ్‌ రామ్‌శివ 'సాక్షి'తో మాట్లాడుతూ.. ''మన మార్కెట్‌ చాలా భిన్నం. తక్కువ ధరకో, ఫ్రీగానో వచ్చే కంటెంట్‌లో కొన్ని యాడ్స్‌ ఉన్నా వీక్షకులు పెద్దగా పట్టించుకోరు. ఇలాంటి వారి కోసం మరికొన్ని ప్లాన్లను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నాం'' అన్నారాయన. ప్రీమియం కోరుకునేవారి కోసం ప్రస్తుత ప్లాన్లు యథాతథంగా ఉంటాయని స్పష్టంచేశారు. యాప్‌ యానీ సంస్థ 2022 నివేదికలో... దేశంలో డిస్నీ హాట్‌స్టార్‌కు 3.6 కోట్లు, అమెజాన్‌కు 1.7 కోట్ల యూజర్లు ఉన్నట్లు వెల్లడించింది. నెట్‌ఫ్లిక్స్‌కు 43–45 లక్షల సభ్యులుంటారనేది మార్కెట్‌ వర్గాల అంచనా. ఇది దేశీ టాప్‌–10 లోనూ లేదు. యాడ్స్‌ను స్కిప్‌ చేయాలని ఉన్నా... అందుకోసం ప్రీమియం మొత్తాన్ని వెచ్చించాలంటే మాత్రం చాలా మంది వెనకాడుతున్నారని, అందుకే ఏవీవోడీ ద్వారా ఓటీటీ సంస్థలు భారీ ఎత్తున ఆదాయాన్ని ఆర్జించనున్నాయని డెలాయిట్‌ 2022 నివేదిక తెలిపింది. ''ఏవీవోడీ మార్కెట్‌ ముమ్ముందు ఎస్‌వీవోడీని దాటిపోతుంది. 2021లో 1.1 బిలియన్‌ డాలర్లుగా (రూ.8,800 కోట్లు) ఉన్న ఏవీవోడీ మార్కెట్‌ 2026 నాటికి 2.4 బిలియన్‌ డాలర్లకు (రూ.19,200 కోట్లు) చేరుతుంది. ఇదే సమయంలో ఎస్‌వీవోడీ మాత్రం 80 లక్షల డాలర్ల (రూ.6,400 కోట్లు) నుంచి 2.1 బిలియన్‌ డాలర్లకు (రూ. 16,800 కోట్లు) చేరుతుంది'' అని డెలాయిట్‌ అంచనా వేసింది. మొత్తంగా దేశంలో ఓటీటీ మార్కెట్‌ వచ్చే పదేళ్లలో 20% కాంపౌండింగ్‌ వృద్ధిని సాధిస్తుందని సంస్థ పేర్కొంది. దేశంలో ప్రస్తుతం 10.2 కోట్ల మంది సబ్‌స్క్రయిబర్లు ఉండగా 2026 నాటికి వీరి సంఖ్య 22.4 కోట్లకు చేరుతుందని డెలాయిట్‌ తెలిపింది.

2024 నాటికి రూ.15 లక్షల కోట్లు

- వాహన పరిశ్రమపై గడ్కరీ అంచనా
- ఈ–డబుల్‌ డెక్కర్‌ బస్‌ల ప్రారంభం

ముంబై: 'భారత వాహన పరిశ్రమ విలువ ప్రస్తుతం రూ.7.5 లక్షల కోట్లు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక పన్నులు ఇవ్వడంతోపాటు గరిష్టంగా ఉపాధి అవకాశాలను ఈ రంగం కలిగి ఉంది. 2024 చివరి నాటికి పరిశ్రమను రూ.15 లక్షల కోట్లకు చేర్చడం నా కల. ఇది సాధ్యం కూడా' అని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్‌ గడ్కరీ అన్నారు. ముడి చమురు దిగుమతులు, కాలుష్యాన్ని తగ్గించడం కోసం వాహనాలకు ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలని గురువారం పిలుపునిచ్చారు. దేశంలో తొలిసారిగా ముంబైలో ఎలక్ట్రిక్‌ డబుల్‌ డెక్కర్‌ ఎయిర్‌ కండీషన్డ్‌ బస్‌లను ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. 'దేశంలో డీజిల్‌, పెట్రోల్‌ కారణంగా 35% కాలుష్యం ఉంది. ఈ నేపథ్యంలో దిగుమతులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో కూడిన, కాలుష్య రహిత, స్వదేశీ వాహనాలు అవసరం' అని తెలిపారు.



బస్‌లో 66 మంది..: హిందూజా గ్రూప్‌లో భాగమైన అశోక్‌ లేలాండ్‌ ఎలక్ట్రిక్‌ వాహన విభాగమైన స్విచ్‌ మొబిలిటీ ఈఐవీ 22 పేరుతో ఎలక్ట్రిక్‌ డబుల్‌ డెక్కర్‌ ఏసీ బస్‌లను తయారు చేసింది. ప్రస్తుత డబుల్‌ డెక్కర్‌ స్థానంలో 66 సీట్లు గల ఈ ఎలక్ట్రిక్‌ బస్‌లను ముంబైలో బృహన్‌ముంబై ఎలక్ట్రిసిటీ సప్లై, ట్రాన్స్‌పోర్ట్‌ (బీఈఎస్‌టీ) నడపనుంది. బీఈఎస్‌టీ నుంచి 200 బస్‌లకు ఇప్పటికే స్విచ్‌ మొబిలిటీ ఆర్డర్‌ దక్కించుకుంది. ఇతర నగరాల్లోనూ వీటిని పరిచయం చేసేందుకు తమ కంపెనీతో ప్రభుత్వ సంస్థలు చర్చలు జరుపుతున్నాయని స్విచ్‌ మొబిలిటీ ఇండియా సీఈవో మహేశ్‌ బాబు తెలిపారు. యూకేలోనూ స్విచ్‌ మొబిలిటీ డబుల్‌ డెక్కర్‌ ఈ–బస్‌లు పరుగెడుతున్నాయి.

బులియన్‌ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	52,081	▲	47
బంగారం (99.5 స్వచ్ఛత)	51,872	▲	46
వెండి (కిలో)	57,100	▼	721

'వార్విక్‌షైర్‌' తరఫున బరిలో సిరాజ్‌

భారత పేసర్‌, హైదరాబాదీ మొహమ్మద్‌ సిరాజ్‌కు ఇంగ్లండ్‌ కౌంటీల్లో ఆడే అవకాశం దక్కింది. ఈ సీజన్‌లో వార్విక్‌షైర్‌ కౌంటీ తరఫున మిగిలిన మూడు ఫస్ట్‌ క్లాస్‌ మ్యాచ్‌లలో అతను బరిలోకి దిగుతాడు. ఈ ఏడాది పుజారా, సుందర్‌, కృనాల్‌, ఉమేశ్‌, సైనీ తర్వాత కౌంటీల్లో ఆడనున్న ఆరో భారత ఆటగాడు సిరాజ్‌ కావడం విశేషం. ఆస్ట్రేలియా గడ్డపై అరంగేట్రం చేసిననాటినుంచి భారత టెస్టు టీమ్‌లో రెగ్యులర్‌గా మారిన సిరాజ్‌ ఇప్పటి వరకు 13 టెస్టుల్లో 30.77 సగటుతో 40 వికెట్లు పడగొట్టాడు. మరో 9 వన్డేలు, 5 టి20ల్లో కూడా అతను టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం జింబాబ్వేలో పర్యటిస్తున్న భారత జట్టులో సభ్యుడిగా ఉన్న సిరాజ్‌కు రాబోయే ఆసియా కప్‌ టీమ్‌లో మాత్రం చోటు దక్కలేదు.



శుభారంభం ఓపెనర్లతోనే...



'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' దీపక్‌ చహర్‌

- తొలి వన్డేలో భారత్‌ జయభేరి
- గిల్‌, ధావన్‌ అజేయ అర్ధ సెంచరీలు
- 10 వికెట్లతో జింబాబ్వే చిత్తు
- రేపు రెండో వన్డే

వరుస పర్యటనలో, వరుస సిరీస్‌ వేటలో భారత్‌ శుభారంభం చేసింది. చాలా కాలం తర్వాత పునరాగమనం చేసిన దీపక్‌ చహర్‌ (3/27) బౌలింగ్‌లో జింబాబ్వే బ్యాటింగ్‌ ఆర్డర్‌ను బెంబేలెత్తిస్తే... విజయవంతమైన గిల్‌–ధావన్‌ ఓపెనింగ్‌ జోడి మరొకరికి చాన్స్‌ ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది.

హరారే: ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు శుబ్‌మన్‌ గిల్‌, శిఖర్‌ ధావన్‌ అజేయ అర్ధసెంచరీల కంటే కూడా దీపక్‌ చహర్‌ స్పెల్‌ (7–0–27–3) ఈ మ్యాచ్‌లో హైలైట్‌. ఆరు నెలల తర్వాత బరిలోకి దిగిన చహర్‌ పిచ్‌ పరిస్థితుల్ని అనుకూలంగా మలచుకొని వైవిధ్యమైన బంతులతో టాపార్డర్‌లో ఏ ఒక్కరిని పట్టుమని 10 పరుగులైనా చేయనివ్వలేదు. ఛేదన సులువయ్యేందుకు అతని స్పెల్‌ కారణమైంది. ఇదే పిచ్‌పై రెండు వారాల క్రితం వరుస మ్యాచ్‌ల్లో 290, 303 పరుగులు నమోదయ్యాయి. సులువుగా ఛేదించడం కూడా జరిగింది. అలాంటి పిచ్‌పై చహర్‌ బౌలింగ్‌ అసాధారణమనే చెప్పాలి. దీంతో గురువారం జరిగిన తొలి వన్డేలో భారత్‌ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట జింబాబ్వే 40.3 ఓవర్లలో 189 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్‌ రెగిస్‌ చకాబ్వా (51 బంతుల్లో 35; 4 ఫోర్లు), రిచర్డ్‌ ఎన్‌గరవా (42 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్‌), ఇవాన్స్‌ (29 బంతుల్లో 33 నాటౌట్‌; 3 ఫోర్లు, 1 సిక్స్‌) మన బౌలింగ్‌కు కాస్త ఎదురు నిలిచారు. స్పిన్నర్‌ అక్షర్‌ పటేల్‌, సీమర్లు దీపక్‌ చహర్‌, ప్రసిధ్‌ కృష్ణ తలా 3 వికెట్లు తీశారు. తర్వాత భారత్‌ 30.5 ఓవర్లలో అసలు వికెట్టే కోల్పోకుండా 192 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు శుబ్‌మన్‌ గిల్‌ (72 బంతుల్లో 82 నాటౌట్‌; 10 ఫోర్లు, 1 సిక్స్‌), ధావన్‌ (113 బంతుల్లో 81 నాటౌట్‌; 9 ఫోర్లు) ఇద్దరే లక్ష్యాన్ని ఛేదించేశారు. చహర్‌కు 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' లభించింది. రేపు ఇదే వేదికపై రెండో వన్డే జరుగుతుంది.



చహర్‌ దెబ్బకు 'టాప్‌'టపా వికెట్లు

కొత్త బంతితో దీపక్‌ చహర్‌ చెలరేగాడు. ఇన్నింగ్స్‌ ఏడో ఓవర్లో ఇన్నోసెంట్‌ కైయా (4)ను కీపర్‌ క్యాచ్‌తో పంపాడు. తన మరుసటి ఓవర్‌ తొలి బంతికి మరుమని (8)ని కూడా కీపర్‌ క్యాచ్‌తోనే పెవిలియన్‌ చేర్చాడు. వెస్లీ మదెవెర్‌ (5)ను ఎల్బీగా ఔట్‌ చేశాడు. అంతకుముందు ఓవర్లో సిరాజ్‌... సియాన్‌ విలియమ్స్‌ (1) వికెట్‌ తీశాడు. జింబాబ్వే 31 పరుగులకే 4 కీలక వికెట్లను కోల్పోయింది. మిడిలార్డర్‌ సంగతి ప్రసిధ్‌ కృష్ణ, అక్షర్‌ పటేల్‌ చూసుకోవడంతో ఒక దశలో జింబాబ్వే 110/8 స్కోరుతో ఆలౌట్‌కు దగ్గరైంది. బ్రాడ్‌ ఇవాన్స్‌, రిచర్డ్‌ తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించడంతో ఆమాత్రం స్కోరు చేయగలిగింది.

ఇద్దరే పూర్తి చేశారు

టాపార్డర్‌లో ఓపెనింగ్‌ను ఇష్టపడే కెప్టెన్‌ రాహుల్‌ తను కాదని విజయవంతమైన ధావన్‌–గిల్‌ జోడితోనే ఓపెన్‌ చేయించాడు. కెప్టెన్‌ నమ్మకాన్ని వమ్ము చేయకుండా శిఖర్‌–శుబ్‌మన్‌ జోడీ ఈ రెండు నెలల్లో మూడో శతక భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. విండీస్‌ గడ్డపై కనబరిచిన జోరునే జింబాబ్వేపై కూడా కొనసాగించారు. మైదానంలో బౌండరీలు, భారత్‌కు పరుగులు వస్తున్నాయి కానీ పాపం ఆతిథ్య బౌలర్లకే వికెట్‌ గగనమైంది. ఏకంగా ఎనిమిది మంది బౌలర్లతో వేయించిన ప్రయత్నం కూడా ఫలితాన్నివ్వలేదు. ముందుగా ధావన్‌ (76 బంతుల్లో 5ఫోర్లతో) ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... జట్టు స్కోరు 20వ ఓవర్లో 100 పరుగులు దాటింది. శుబ్‌మన్‌ కూడా (51 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. దీంతో భారత్‌ లక్ష్యాన్ని చేరేందుకు 30.5 ఓవర్లే సరిపోయాయి. దాదాపు 20 ఓవర్ల ముందే ఇద్దరే బ్యాటర్లు జట్టును గెలిపించారు.

స్కోరు వివరాలు

జింబాబ్వే ఇన్నింగ్స్‌: కైయా (సి) సామ్సన్‌ (బి) చహర్‌ 4; మరుమని (సి) సామ్సన్‌ (బి) చహర్‌ 8; వెస్లీ (ఎల్బీ) (బి) చహర్‌ 5; సియాన్‌ విలియమ్స్‌ (సి) ధావన్‌ (బి) సిరాజ్‌ 1; సికందర్‌ రజా (సి) ధావన్‌ (బి) ప్రసిధ్‌ 12; చకాబ్వా (బి) అక్షర్‌ 35; రియాన్‌ బర్ల్‌ (సి) గిల్‌ (బి) ప్రసిధ్‌ 11; ల్యూక్‌ జాంగ్వే (ఎల్బీ) (బి) అక్షర్‌ 13; ఇవాన్స్‌ నాటౌట్‌ 33; రిచర్డ్‌ (బి) ప్రసిధ్‌ 34; విక్టర్‌ (సి) గిల్‌ (బి) అక్షర్‌ 8; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (40.3 ఓవర్లలో ఆలౌట్‌) 189.**

వికెట్ల పతనం: 1–25, 2–26, 3–31, 4–31, 5–66, 6–83, 7–107, 8–110, 9–180, 10–189.

బౌలింగ్‌: దీపక్‌ చహర్‌ 7–0–27–3, సిరాజ్‌ 8–2–36–1, కుల్దీప్‌ 10–1–36–0, ప్రసిధ్‌ 8–0–50–3, అక్షర్‌ 7.3–2–24–3.

భారత్‌ ఇన్నింగ్స్‌: ధావన్‌ నాటౌట్‌ 81; శుబ్‌మన్‌ గిల్‌ నాటౌట్‌ 82; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (30.5 ఓవర్లలో వికెట్‌ నష్టపోకుండా) 192.**

బౌలింగ్‌: రిచర్డ్‌ ఎన్‌గరవా 7–0–40–0, విక్టర్‌ 4–0–17–0, ఇవాన్స్‌ 3.5–0–28–0, సియాన్‌ 5–0–28–0, సికందర్‌ రజా 6–0–32–0, ల్యూక్‌ జాంగ్వే 2–0–11–0, వెస్లీ 2–0–16–0, రియాన్‌ బర్ల్‌ 1–0–12–0.

రాఫెల్‌ నాదల్‌కు నిరాశ



సిన్సినాటి: గాయం నుంచి కోలుకొని ఆరు వారాల తర్వాత బరిలోకి దిగిన స్పెయిన్‌ టెన్నిస్‌ దిగ్గజం రాఫెల్‌ నాదల్‌కు పునరాగమనంలో షాక్‌ తగిలింది. సిన్సినాటి ఓపెన్‌ తొలి మ్యాచ్‌లోనే నాదల్‌ వెనుదిరిగాడు. క్రొయేషియాకు చెందిన బోర్నా కొరిక్‌ 7–6 (9), 4–6, 6–3 స్కోరుతో నాదల్‌ను ఓడించాడు. 2 గంటల 51 నిమిషాల పాటు ఈ పోరు సాగింది. పొత్తి కండరాల్లో చీలికతో వింబుల్డన్‌ సెమీఫైనల్‌ మ్యాచ్‌కు ముందు తప్పుకున్న నాదల్‌ యూఎస్‌ ఓపెన్‌ సన్నాహకాల్లో భాగంగా ఈ టోర్నీలో ఆడాడు.

సానియా జోడి ముందంజ

సిన్సినాటి: భారత టెన్నిస్‌ స్టార్‌ సానియా మీర్జా తన భాగస్వామితో కలిసి సిన్సినాటి ఓపెన్‌ మాస్టర్స్‌ టోర్నీలో రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. వింబుల్డన్‌ తర్వాత మళ్లీ జత కట్టిన సానియా – లూసీ రాడెకా (చెక్‌ రిపబ్లిక్‌) తొలి రౌండ్‌లో 1–6, 6–3, 11–9తో కరోలిన్‌ గార్సియా (ఫ్రాన్స్‌) – పెట్రా మార్టిక్‌ (క్రొయేషియా) జోడీపై విజయం సాధించింది. 77 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో మ్యాచ్‌ పాయింట్‌ను కాపాడుకొని సానియా ద్వయం ముందంజ వేసింది.

ప్రజ్ఞానంద 'హ్యాట్రిక్‌' విజయం



మయామి: ఎఫ్‌టీఎక్స్‌ క్రిప్టో కప్‌ అంతర్జాతీయ ర్యాపిడ్‌ చెస్‌ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్‌ ప్రజ్ఞానంద 'హ్యాట్రిక్‌' విజయం సాధించాడు. తొలి రెండు రౌండ్లలోనూ మేటి ర్యాంకర్లకు చెక్‌ పెట్టిన ఈ టీనేజ్‌ సంచలనం గురువారం జరిగిన మూడో రౌండ్‌లో 2.5–1.5తో అమెరికన్‌ గ్రాండ్‌మాస్టర్‌ హాన్స్‌ నీమన్‌పై విజయం సాధించాడు. వరుస విజయాలతో 17 ఏళ్ల ప్రజ్ఞానంద ఇప్పుడు వరల్డ్‌ నంబర్‌వన్‌, ప్రపంచ చాంపియన్‌ మాగ్నస్‌ కార్ల్‌సన్‌ (నార్వే)తో కలిసి 9 పాయింట్లతో సంయుక్తంగా అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రతీ మ్యాచ్‌లోనూ నాలుగు ర్యాపిడ్‌ గేమ్‌లు జరిగే ఈ టోర్నీలో గురువారం జరిగిన పోరులో మొదటి గేమ్‌లో ఓడినప్పటికీ భారత ఆటగాడు అద్భుత ప్రదర్శనతో పుంజుకున్నాడు. రెండు, నాలుగో గేముల్లో గెలిచాడు. మూడో గేమ్‌ డ్రా అయ్యింది. తాజా విజయంతో అతని ఖాతాలో మరో రూ. 5.94 లక్షలు (7500 డాలర్లు) ప్రైజ్‌మనీ జమ అయ్యింది.

'అండగా నిలిస్తే అద్భుతాలు'



- యువ అథ్లెట్లపై గోపీచంద్‌ ప్రశంసలు
- 'మైత్రా' సహకారంతో ప్రోత్సాహం

సాక్షి, హైదరాబాద్‌: 'ఒక అథ్లెట్‌ స్వయంగా కూలీకి వెళితే తప్ప ఇల్లు గడవని స్థితి. మరొకరి తల్లిదండ్రులు రోజువారీ కార్మికులు. ఇంకొకరిది కూడా కడు పేదరికం. కానీ ఇలాంటి స్థితినుంచి వచ్చి కూడా వారు అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ప్రదర్శన కనబరుస్తున్నారు. అందుకే మన అథ్లెట్లను చూస్తే నాకు గౌరవం, గర్వం కలుగుతాయి. వారి శ్రమను ప్రత్యేకంగా అభినందించాలని అనిపిస్తుంది' అని భారత బ్యాడ్మింటన్‌ చీఫ్‌ కోచ్‌ పుల్లెల గోపీచంద్‌ వ్యాఖ్యానించారు. బ్యాడ్మింటన్‌ సహా కొన్ని ఇతర క్రీడల్లో కనీస స్థాయినుంచి మొదలు పెట్టి మరింతగా పైకి ఎదుగుతారని...కానీ కనీస సౌకర్యాలు లేని నేపథ్యంనుంచి వచ్చి అథ్లెట్లు సాధించే సాధారణ విజయాలను కూడా చాలా గొప్పగా భావించాలని ఆయన అభిప్రాయ పడ్డారు. 'గోపీచంద్‌–మైత్రా ఫౌండేషన్‌' ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఇటీవల భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన అథ్లెట్లను సన్మానించారు. దాదాపు ఏడేళ్ల క్రితం యువ క్రీడాకారులకు అండగా నిలవాలనే సంకల్పంతో 'మైత్రా ఫౌండేషన్‌'తో జత కట్టానని, అది మంచి ఫలితాలు ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేసిన గోపీచంద్‌..ప్రభుత్వ సంస్థలు 'సాయ్‌', 'శాట్స్‌' అధికారికంగా ఇచ్చే సౌకర్యాలతో పాటు కీలక సమయాల్లో ఆటగాళ్లకు డైట్‌, ఫిట్‌నెస్‌, ఫిజియో తదితర అంశాల్లో 'మైత్రా' సహకారం అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామన్వెల్త్‌ క్రీడల్లో ఫైనల్స్‌కు అర్హత సాధించిన యెర్రా జ్యోతి, ద్యుతీచంద్‌లతో పాటు అండర్‌–20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌ చేరిన ఎ.నందిని, కె.రజితలకు కూడా నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఇతర అథ్లెట్లు జ్యోతికశ్రీ, ఎన్‌.ఎస్‌. శ్రీనివాస్‌, ప్రణయ్‌, అనూష, దిల్‌ఖుష్‌ యాదవ్‌, భారత అథ్లెటిక్స్‌ కోచ్‌ నాగపురి రమేశ్‌లతో పాటు 'మైత్రా' గ్రూప్‌ చైర్మన్‌ రవి కైలాస్‌ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెస్టిండీస్‌ గెలుపు

బ్రిడ్జ్‌టౌన్‌: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో వెస్టిండీస్‌ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ 45.2 ఓవర్లలో 190 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్‌ కేన్‌ విలియమ్సన్‌ (34), మైకేల్‌ బ్రేస్‌వెల్‌ (34) మాత్రమే ఫర్వాలేదనిపించారు. విండీస్‌ బౌలర్లలో అకీల్‌ హొసీన్‌, అల్జారి జోసెఫ్‌ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం విండీస్‌ 39 ఓవర్లలో 5 వికెట్లకు 193 పరుగులు చేసింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' షమరా బ్రూక్స్‌ (91 బంతుల్లో 79; 9 ఫోర్లు, 1 సిక్స్‌) అర్ధ సెంచరీ సాధించగా...సౌతీ, బౌల్ట్‌ చెరో 2 వికెట్లు తీశారు.

దక్షిణాఫ్రికా 289/7

లండన్‌: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికాకు భారీ ఆధిక్యం లభించింది. మ్యాచ్‌ రెండో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. దాంతో దక్షిణాఫ్రికా ప్రస్తుతం 124 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. సారెల్‌ ఎర్వీ (73) అర్ధ సెంచరీ చేయగా, ఎల్గర్‌ (47), కేశవ్‌ మహరాజ్‌ (41), మార్కో జాన్సెన్‌ (41 బ్యాటింగ్‌) రాణించారు. బెన్‌ స్టోక్స్‌కు 3 వికెట్లు దక్కాయి. అంతకు ముందు ఓవర్‌నైట్‌ స్కోరు 116/6తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్‌ తమ తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకు ఆలౌటైంది. ఒలీ పోప్‌ (73) టాప్‌ స్కోరర్‌గా నిలిచాడు. పేస్‌ బౌలర్‌ రబడాకు 5 వికెట్లు దక్కగా, నోర్జే 3 వికెట్లు తీశాడు.

క్లుప్తంగా

శ్రీకాకుళం జాలర్లకు తమిళనాడులో శిక్షణ



శిక్షణకు హాజరైన శ్రీకాకుళం జాలర్లు

సాక్షి, చెన్నై: ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారులకు తమిళనాడులోని నాగపట్నం జిల్లా పూంపుహార్‌లో జాతీయస్థాయి శిక్షణ ఇస్తున్నారు. గురువారం నుంచి 3 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు జరగనున్నాయి. ఇక్కడి ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా శిక్షణకు శ్రీకాకుళంకు చెందిన 33 మందిని ఎంపిక చేశారు. వీరంతా మంగళవారం శ్రీకాకుళం నుంచి బయలుదేరి పూంపుహార్‌కు చేరుకున్నారు. గురువారం నుంచి ఇక్కడి ఫిష్ ఫర్ ఆల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో వీరికి శిక్షణ ఇస్తున్నారు. జాతీయ స్థాయిలో మత్స్యకారుల శిక్షణకు శ్రీకాకుళం జాలర్లకు అవకాశం దక్కడం విశేషం. శ్రీకాకుళం బృందం శిక్షణ తరగతులను ఆ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ పర్యవేక్షిస్తున్నారు.

జీతభత్యాలు ఇవ్వడంలేదు

- కోర్టు ధిక్కార పిటిషన్ వేసిన ఏబీ వెంకటేశ్వరరావు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసు జారీ

సాక్షి, అమరావతి : సస్పెన్షన్ కాలానికి తనకు జీతభత్యాలు చెల్లించాలన్న హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పాటించడంలేదని, దీనిని కోర్టు ధిక్కారంగా పరిగణించాలంటూ సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది నల్లూరి మాధవరావు వాదనలు వినిపించారు. సస్పెన్షన్ కాలానికి పిటిషనర్‌కు ఇవ్వాల్సిన జీతభత్యాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సమీర్ శర్మకు నోటీసు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 15కి వాయిదా వేసింది.

ఉధృతంగా గోదావరి

పోలవరం, ధవళేశ్వరం వద్ద పెరిగిన వరద

- భద్రాచలం వద్ద స్వల్పంగా తగ్గిన నీటిమట్టం
- మూడో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- కాటన్ బ్యారేజి నుంచి 16 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి



చింతూరు మెయిన్‌రోడ్‌లో నీటమునిగిన ఇళ్లు



పట్టిసం శివక్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

పోలవరం రూరల్/చింతూరు (అల్లూరి సీతారామ రాజు జిల్లా)/ధవళేశ్వరం: గోదావరి మళ్లీ ఉగ్ర రూపం దాల్చుతోంది. నాలుగు రోజుల క్రితం తగ్గుముఖం పట్టినప్పటికీ తిరిగి వరద పెరుగుతోంది. భద్రాచలం వద్ద స్వల్పంగా వరద తగ్గుతున్నప్పటికీ పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు వద్ద 34.48 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 13,16,412 క్యూసెక్కులు వదులుతున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి ఉధృతి కొనసాగుతుంది. ఇక్కడ గురువారం ఉదయం నుంచి క్రమేపి పెరుగుతూ రాత్రి 7 గంటలకు నీటిమట్టం 15.80 అడుగుల వద్ద ఉంది. బ్యారేజ్ నుంచి 16,02,555 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 11,000 క్యూసెక్కులు వదిలారు. భద్రాచలంలో నీటి ఉధృతి క్రమేపి తగ్గుతూ రాత్రి 7గంటలకు 51.90 అడుగులకు చేరింది. ఇక్కడ మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

విలీన మండలాల్లో తగ్గుతున్న వరద

విలీన మండలాల్లో గోదావరి, శబరి నదుల వరద నెమ్మదిగా తగ్గుతోంది. భద్రాచలం వద్ద వరద తగ్గుతుండడంతో ఎటపాక, కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాల్లో కూడా వరద తగ్గుముఖం పట్టింది. కూనవరం మండలంలో 56 గ్రామాల్లోని 6,500 కుటుంబాలను 27 పునరావాస కేంద్రాలకు తరలించారు. వీఆర్‌పురం మండలంలో 24 గ్రామాల్లోని 8,640 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చింతూరు మండలంలో ఆరు గ్రామాల్లోని 427 కుటుంబాలను 8 పునరావాస కేంద్రాలకు తరలించారు. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ముంపునకు గురైన గ్రామాలకు వాహనాలు, బోట్లు, లాంచీల ద్వారా నిత్యావసర సరుకులను తరలిస్తున్నారు.

తగ్గిన కృష్ణా వరద

శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురిసౌత్: కృష్ణా నదిలో వరద మరింత తగ్గింది. జూరాల, సుంకేసుల నుంచి 2,93,213 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తోంది. వరద తగ్గుతుండడంతో శ్రీశైలం మూడు గేట్లను మూసివేశారు. ఏడు గేట్లను 10 అడుగుల మేర తెరచి 1,94,922 క్యూసెక్కులు, రెండు విద్యుత్ కేంద్రాల ద్వారా మరో 63,000 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో గురువారం సాయంత్రం 212.9198 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయ నీటిమట్టం 884.50 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం నుంచి వరద తగ్గడంతో గురువారం నాగార్జున సాగర్ జలాశయం గేట్లను నాలుగింటిని మూసివేశారు. 18 గేట్ల ద్వారానే నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలోకి 1,82,804 క్యూసెక్కులు వస్తోంది. అంతే నీటిని క్రస్ట్ గేట్లు, కుడి, ఎడమ కాల్వలు, వరద కాలువ, ఎస్ఎల్‌బీసీ, విద్యుదుత్పాదనతో విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 584.80 అడుగులకు చేరింది. 296.8580 టీఎంసీలు నీటి నిల్వ ఉంది.

దేవస్థానం భూములను మీరెలా క్రమబద్ధీకరిస్తారు?

సింహాచలం దేవస్థానం భూములపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

- క్రమబద్ధీకరణకు చట్టం తేవడానికి వీల్లేదన్న ధర్మాసనం
- ఇలాగే వదిలేస్తే ప్రైవేటు ఆస్తులను పేదలకు ఇచ్చేస్తామంటారంటూ ఘాటు వ్యాఖ్య.. విచారణ 25కి వాయిదా

సాక్షి, అమరావతి: ఆక్రమణల్లో ఉన్న విశాఖపట్నం జిల్లా పంచ గ్రామాల పరిధిలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన భూములను క్రమబద్ధీకరించే అధికారం మీకెక్కడ ఉందని హైకోర్టు గురువారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ విషయంలో చట్టం తేవడానికి వీల్లేదని చెప్పింది. మీవి కాని భూములను ఆక్రమణదారుల పేరు మీద మీరెలా క్రమబద్ధీకరిస్తారన్న హైకోర్టు, ఇలాగే వదిలేస్తే ప్రైవేటు ఆస్తులను భూమి లేని పేదలకు ఇచ్చేస్తామంటారంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయిలో వాదనలు వింటామని చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచగ్రామాలుగా పిలిచే విశాఖ జిల్లా అడవివరం, వెంకటాపురం, వేపగుంట, పురుషోత్తపురం, చీమలపల్లి గ్రామాల్లో సింహాచలం దేవస్థానానికి పెద్ద విస్తీర్ణంలో భూములున్నాయి. వీటిని పలువురు ఆక్రమించుకొన్నారు. ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. వీటిని వారి పేరు మీద క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ విజయవాడకు చెందిన రామనాథం రామచంద్రరావు 2019లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై అప్పుడు విచారణ జరిపిన హైకోర్టు, భూముల క్రమబద్ధీకరణపై యథాతథస్థితి కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. దేవాలయ భూముల విక్రయం, క్రమబద్ధీకరణకు హైకోర్టు అనుమతి తప్పనిసరంటూ గతంలో ఇచ్చిన తీర్పును అధిగమించేందుకే ప్రభుత్వం చట్టం తెచ్చిందని తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. ఇది ప్రజల కోసం తెచ్చిన పథకమన్నారు. క్రమబద్ధీకరణ ఉచితం కాదని, ఆక్రమణదారుల నుంచి కొంత వసూలు చేస్తామని, ఆ మొత్తాన్ని దేవస్థానానికే ఇస్తామని చెప్పారు. దేవస్థానానికి మరో చోట భూములు ఇస్తామన్నారు. 30 ఏళ్లుగా ఆ భూములు ఆక్రమణదారుల ఆధీనంలో ఉన్నాయని, నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. అందుకే క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చట్టం తెచ్చిందన్నారు. దేవస్థానం తరఫు న్యాయవాది ఎ.మాధవరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఆక్రమణదారులను ఖాళీ చేయించే పరిస్థితి లేదని చెప్పారు. భూములను క్రమబద్ధీకరిస్తే దేవస్థానానికి ఆదాయం వస్తుందని అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. క్రమబద్ధీకరణ పేరుతో దేవస్థానం భూములను ఇతరులకు కట్టబెట్టే ప్రమాదం కూడా ఉందని వ్యాఖ్యానించింది. తక్కువ విలువైన భూములను దేవస్థానానికి ఇచ్చే అవకాశం కూడా ఉందంది.

చట్టం తేకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోలేం

చట్టం తెచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది

- చట్టంపై అభ్యంతరాలుంటే సవాలు చేసుకోండి
- మహిళా పోలీసుల వ్యవహారంలో స్పష్టం చేసిన ధర్మాసనం
- తదుపరి విచారణ సెప్టెంబర్ 15కి వాయిదా




సాక్షి, అమరావతి : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా, పోలీసు శాఖలో అంతర్భాగంగా పరిగణిస్తూ ప్రభుత్వం చట్టం తేకుండా అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. చట్టం తెచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపింది. ఆ చట్టంపై అభ్యంతరాలుంటే దానిని సవాలు చేసుకోవచ్చునని పిటిషనర్లకు స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే, మహిళా సంరక్షణ కార్యదర్శులను పేరుకు మాత్రమే మహిళా పోలీసులుగా పిలుస్తారే తప్ప, వారికి సాధారణ పోలీసులకు ఉండే అధికారాలేవీ ఉండవని రాష్ట్ర ప్రభుత్వం గురువారం హైకోర్టుకు నివేదించింది. పోలీసులు నిర్వర్తించే అధికారిక విధులు వారు నిర్వర్తించరని తెలిపింది. వారిని పోలీసు శాఖలో అంతర్భాగంగా పరిగణిస్తూ చట్టం తెస్తున్నామని, ఇప్పటికే ముసాయిదా సిద్ధమైందని, వచ్చే శాసన సభ సమావేశాల్లో ఆ చట్టాన్ని ప్రవేశపెడతామని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వివరించారు. పూర్తి వివరాలను కోర్టు ముందుంచేందుకు నాలుగు వారాల గడువు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన హైకోర్టు తదుపరి విచారణను సెప్టెంబర్ 15కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా పోలీసుల నియామకం, శిక్షణ, సిలబస్, జాబ్ చార్ట్, సబార్డినేట్ సర్వీసు నిబంధనలను ఖరారు చేస్తూ ఇచ్చిన రెండు జీవోలను సవాలు చేస్తూ విశాఖపట్నానికి చెందిన ఆరేటి ఉమామహేశ్వరరావు, మరి కొందరు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్‌లు) దాఖలు చేశారు. తమను మహిళా పోలీసులుగా పరిగణించడం సరైనదేనని, తమ వాదనలు కూడా వినాలంటూ కొందరు మహిళా సంరక్షణ కార్యదర్శులు అనుబంధ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు యలమంజుల బాలాజీ, నర్రా శ్రీనివాసరావులు వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వం దొడ్డిదారిలో మహిళా సంరక్షణ కార్యదర్శులను పోలీసు శాఖలో అంతర్భాగం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. సాధారణ పోలీసుల విధులు అప్పగించబోమని చెబుతూనే, వారికి బందోబస్తు డ్యూటీలు వేస్తున్నారని వివరించారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. బందోబస్తు విధులు ఎందుకు అప్పగిస్తున్నారని, అలాంటివి చేయకుండా చూడాలని ఏజీకి సూచించింది.

నౌకల మరమ్మతు కేంద్రంగా విశాఖ షిప్‌యార్డ్

షిప్‌యార్డ్ చైర్మన్ హేమంత్ ఖత్రి

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): నౌకల మరమ్మతు కేంద్రంగా విశాఖ షిప్‌యార్డ్‌ను అభివృద్ధి చేస్తామని షిప్‌యార్డ్ చైర్మన్ హేమంత్ ఖత్రి తెలిపారు. విశాఖ పోర్టు ఆధ్వర్యాన నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహిస్తున్న నౌకాయాన రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో హేమంత్ మాట్లాడుతూ షిప్‌యార్డ్‌లో రూ.20,000 కోట్లతో నూతన ప్రాజెక్టులను త్వరలోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. పోర్టు ట్రస్ట్ చైర్మన్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా పోర్టు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.